సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 1

శుక్రవారం 24-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

ఫ్యాషన్

కూల్ & కంఫర్ట్



నైట్ ఫంక్షన్స్‌కి సిల్వర్ కలర్ డ్రెస్సులు ఈ సీజన్‌లో అగ్రస్థానంలో ఉంటాయి. గోల్డ్ కలర్ ఆ తర్వాతి స్థానంలోనే ఉంటుంది. ఫ్యాషన్ వేదికలపైనా సిల్వర్ అట్రాక్షన్ తన వైభవాన్ని చాటుతుంది.

స్లిట్స్ ఉన్న డ్రెస్సులు ఈ సీజన్‌కి సౌకర్యంగా ఉండటమేకాదు స్టైల్‌గానూ అనిపిస్తాయి.

డెనిమ్ ప్రతి సీజన్‌కీ ఫ్రెండ్లీగా మారిపోతుంది. అలాగే, వేసవి ఫ్యాషన్ జాబితాలోనూ తన స్థానం పదిలమేనని చాటుతోంది. టాప్స్ ఎంపికలో శ్రద్ధ తీసుకుంటే చాలు.



మిగతా సీజన్‌ల కన్నా వేసవిలో డ్రెస్ ఎంపికకు కూల్ అండ్ కంఫర్ట్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తాం. అందుకే, ఫ్యాబ్రిక్స్‌లలో కాటన్స్ ముందు వరసలో ఉంటాయి. కానీ, ఫ్యాషనబుల్ డ్రెస్సుల విషయంలో ఈ కాలం చాలా ప్రయోగాలు చేయచ్చు. డే అండ్ నైట్ పార్టీలకు వెస్ట్రన్ టచ్ ఇస్తూనే సంప్రదాయ వేడుకల్లోనూ ప్రత్యేకంగా వెలిగిపోవచ్చు.



కార్గో ప్యాంటు, స్కర్ట్ వాటికి తగిన కార్సెట్ టాప్స్ ఈ వేసవికి సౌకర్యవంతమైన ఎంపిక. వదులుగా ఉండే కార్గో ప్యాంట్, స్కర్ట్, వాటికి ఉండే పాకెట్స్ ప్రత్యేక ఆకర్షణగానూ నిలుస్తాయి.

ఎక్కడ ఉన్నా ప్రత్యేకంగా కనిపించాలనుకునేవారికి షీర్ డ్రెస్సులు బాగా నప్పుతాయి. స్వచ్ఛమైన అనుభూతినిచ్చేలా ఫెయిర్‌లుక్‌తో ఆకట్టుకునే ఈ డ్రెస్సులు ఏ పార్టీలో అయినా బ్రైట్‌గా వెలిగిపోతాయి.

కటౌట్ డ్రెస్సులు పగలు, నైట్ ఫంక్షన్స్‌కు కూడా కొత్తదనాన్ని తీసుకువస్తాయి.

బ్యూటిప్స్

అవాంఛిత రోమాలను నివారించండి ఇలా...

ప్రస్తుతకాలంలో అవాంఛిత రోమాలతో చాలామంది బాధపడుతున్నారు. అది అందమైన ముఖాన్ని అంద విహీనంగా చేస్తుంది. వాటిని చూసుకున్నప్పుడల్లా స్త్రీలు ఎంతో బాధని అనుభవిస్తుంటారు. సాధారణంగా హార్మోన్ల అసమతుల్యత వల్ల ముఖంపై అవాంఛిత రోమాలు పెరుగుతుంటాయి. ఏది ఏమైనా అవాంఛిత రోమాలు అనేది ఒక దీర్ఘకాలిక సమస్య. దీనికి వాక్సింగ్, షేవింగ్, ఇతర చికిత్సలు చేయించటం వల్ల క్రమంగా మరింత పెరుగుతాయి. దీనికి శాశ్వత పరిష్కారం అంటూ ఏమి లేదు. కానీ కొన్ని సహజ నివారణలు ఉన్నాయి. అవేంటో చూద్దాం...

పసుపు



ఇది మనం ప్రతి రోజు మన వంటల్లో వాడేదే.. పసుపులో ఉండే యాంటీ బాక్టీరియల్ గుణాలు అవాంఛిత రోమాలును తొలగించి ముఖంలో తేజస్సుని, అందాన్ని మరింత రెట్టింపు చేస్తుంది. దీన్ని ఆయుర్వేదంలో ఒక ఔషధంలా ఉపయోగిస్తారు. పసుపుని శెనగపిండితో కలిపి ఉపయోగిస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. పసుపు రోమాలను తొలగించటమే కాకుండా వాటి పెరుగుదలను కూడా అదుపులో ఉంచుతుంది. వీటితోపాటుగా ఆరోగ్యకరమైన ఆహారం కూడా ముఖ రోమాలు వదిలించుకోవటంలో సహాయపడుతుంది. సరియైన ఆహారం తీసుకోకపోవడం వలన ఇది అధికమయ్యే ప్రమాదముంది. ముఖంపై అవాంఛిత రోమాల బెడద తగ్గాలంటే ఫైటో ఈస్ట్రోజెన్లు అధికంగా ఉన్న ఆహారాన్ని తినాలని పరిశోధకులు సూచిస్తున్నారు. ఫైటో ఈస్ట్రోజెన్లు అధికంగా అవిసెగింజలు, సోంపు, అల్ఫాల్ఫాలో ఉంటాయి.

ఇంటిప్స్

కొందరికి చపాతీలు చేయడం బాగా కుదరదు. గట్టిగా రొట్టెల్లా వస్తుంటాయి లేదా తయారు చేసిన కాసేపటికే రబ్బరులా సాగుతుంటాయి. అలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించాలి.



- చపాతీ పిండిని పాలు లేదా గోరువెచ్చని నీళ్ళు, కొద్దిగా నూనె కలిపి, గంటపాటు నానబెడితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- ఉడికించిన బంగాళదుంపను బాగా మెదిపి దానిని చపాతీ పిండిలో కలిపి ఆ పిండితో చపాతీలు చేస్తే, చపాతీలు మృదువుగా రావడమే కాదు, ఎక్కువసేపు తాజాగా ఉంటాయి.
- చపాతీలు వత్తేటప్పుడు మధ్యలో కాస్త నూనె వేసి మడతలతో చేసి హాట్ ప్యాక్‌లో ఉంచితే 6 నుండి 7 గంటల పాటు మెత్తగా ఉంటాయి.

న్యూస్‌మేకర్

హిజాబ్ బాక్సర్



ఢిల్లీలో ఇప్పుడు మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతున్నాయి. అందరి దృష్టి ఆస్ట్రేలియా బాక్సర్ **టినా రహిమి** మీద నిలిచింది. ఆమె ప్రపంచంలోనే బహుశా మొదటి హిజాబ్ బాక్సర్. ప్రిలిమినరిస్‌లోనే రహిమి ఓడిపోయినా హిజాబ్ గురించి ప్రపంచానికి ఉన్న దృష్టి మారడానికి పోరాటం కొనసాగిస్తూనే ఉంటాను అని తెలిపింది.

‘ఏం పర్వాలేదు. నా మద్దతుదారులను నిరాశ పరిచాను. కాని 2024 ఒలింపిక్స్‌లో కచ్చితంగా గోల్డ్ మెడల్ సాధిస్తాను’ అంది 27 సంవత్సరాల టినా రహిమి.

ఆస్ట్రేలియా నుంచి తొమ్మిది మంది బాక్సర్ల బృందంతో ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్‌కు హాజరైన టినా గట్టి పోరాటం ఇచ్చి ఏదో ఒక పతకం సాధించాలన్న పట్టుదలతో వచ్చింది. కాని మన టాలెంటెడ్ బాక్సర్ మనిషా మౌన్ చేతిలో ఓటమి పాలయ్యింది. రింగ్‌లో హిజాబ్ ధరించి తలపడిన ఆమెను మెచ్చుకోలు కళ్లతో, ఆశ్చర్యం కళ్లతో, ప్రశ్నార్థకం కళ్లతో చూసినవారు ఆమెను మర్చిపోవడం మాత్రం కష్టం.



● ఢిల్లీలో మనిషా మౌన్‌తో టినా రహిమి

‘అనుకూలంగానో ప్రతికూలంగానో నన్ను అందరూ చూస్తుంటారు. నేను ముస్లింని. నా మతానుసారం దుస్తులు ధరించే స్వేచ్ఛ నాకు ఉంది. నేను ఎంచుకున్న రంగంలో ముందుకు సాగడానికి అవి ఏమాత్రం అడ్డు కాకూడదని భావిస్తాను. నన్ను చూసిన చాలామంది ముస్లిం యువతులు స్ఫూర్తి పొందుతూ ఉంటారు. ఈమె హిజాబ్‌తో ఏకంగా బాక్సింగ్ చేయగలిగితే చదువుకు, ఉద్యోగాలకు అది మనకు ఏం అడ్డం అనుకుంటారు. అలాగే అనుకోవాలని కోరుకుంటాను’ అంది రహిమి.

రహిమి 57 కేజీల విభాగంలో ఆస్ట్రేలియా తరఫున విజయాలు సాధిస్తూ ఉంది. 2022 కామన్‌వెల్త్ క్రీడల్లో (బర్మింగ్ హామ్) ఫెదర్ వెయిట్ విభాగంలో బ్రాంజ్ మెడల్ గెల్చుకునిఆ ఘనత సాధించిన తొలి ఆస్ట్రేలియా ముస్లింగా నిలిచింది. అలాగే కామన్‌వెల్త్ క్రీడల్లో హిజాబ్‌తో బాక్సింగ్ చేసిన మొదటి మహిళగా కూడా.

‘ఇప్పటి వరకూ నా హిజాబ్ గురించి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అయితే హిజాబ్‌ను సమర్థించే వారు నేను గెలవాలని గట్టిగా కోరుకుంటారు. హిజాబ్‌తో గెలిచింది అని గొప్పగా చెప్పుకోవాలనుకుంటారు. అది నాకు వొత్తిడి కలిగిస్తోంది’ అంటుందామె.

సిడ్నిలో స్థిరబడి ఆస్ట్రేలియన్ జాతీయత స్వీకరించిన ఈ ఇరానియన్ మహిళ అక్కడ మేకప్ ఉమెన్‌గా ఉపాధి పొందుతోంది.

‘అయితే 2017లో జిమ్‌లో నేను, నా స్నేహితురాలు సరదాగా స్త్రీల బాక్సింగ్ క్లాసులకు అటెండ్ అయ్యాం. బ్యాగ్‌లను పంచ్ చేస్తుంటే మంచి కిక్‌గా అనిపించింది. ఆ సరదా కాస్త సీరియస్ ప్రాక్టీసుగా మారింది. 2018 నాటికి నేను క్వాలిఫైడ్ బాక్సర్‌గా మారాను’ అంటుంది రహిమి. ఆస్ట్రేలియాలో ముస్లిం అథ్లెట్లకు మంచి ప్రోత్సాహం ఉంది. ప్రతి ఏటా అక్కడ ‘ఆస్ట్రేలియా ముస్లిం అచీవ్‌మెంట్ అవార్డ్స్’ ఇస్తారు. గత సంవత్సరం రహిమికి ‘స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్’ అవార్డు ప్రకటించారు.

‘హిజాబ్ వారి వారి ఎంపిక. ఎంచుకున్న వారికి అది ఏ విధంగానూ అడ్డు కాదు’ అంటుంది రహిమి.

> ‘ఇప్పటి వరకూ నా హిజాబ్ గురించి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అయితే హిజాబ్‌ను సమర్థించే వారు నేను గెలవాలని గట్టిగా కోరుకుంటారు. హిజాబ్‌తో గెలిచింది అని గొప్పగా చెప్పుకోవాలనుకుంటారు. అది నాకు వొత్తిడి కలిగిస్తోంది’ అంటుందామె.

వంటిల్లు

రబ్డీ ఖీర్

కావలసినవి: బాదం పాలు – 2 లీటర్లు ; బియ్యం– కప్పు ; కుంకుమ పువ్వు– చిటికెడు ; చక్కెర – కప్పు ; యాలకుల పొడి– అర టీ స్పూన్ ; జీడిపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● బియ్యాన్ని కడిగి నానబెట్టాలి. మందపాటి పెనంలో (నూనె లేకుండా) జీడిపప్పును దోరగా వేయించి పక్కన పెట్టాలి. ● పెనం మీద మందపాటి పాత్రను పెట్టి పాలను మరిగించాలి. పాలు మరగడం మొదలైన తర్వాత మీగడ పైకి తేలుతుంటుంది. స్పూన్‌తో మీగడను తీసి చిన్న గిన్నెలో వేస్తూ పాలను మరగనివ్వాలి. ● నానిన బియ్యాన్ని మిక్సీలో కొంచెం బరకగా పొడి చేసి మరుగుతున్న పాలలో వేసి ఉండలు లేకుండా కలపాలి. ● ఈ మిశ్రమం ఉడుకుతున్నప్పుడు కుంకుమ పువ్వు వేయాలి. మిశ్రమం చిక్కబడుతున్నప్పుడు మరొక పాత్రలో టేబుల్ స్పూన్ నీటిని పోసి చక్కెర వేసి కలిపి ఐదు నిమిషాల సేపు ఉడికించాలి. గోధుమరంగులోకి మారిన తర్వాత ఈ చక్కెర పాకాన్ని పాలు– బియ్యప్పిండి మిశ్రమంలో వేసి బాగా కలిపి సన్నమంట మీద రెండు నిమిషాల పాటు కలుపుతూ ఉడికించాలి. ● ఇప్పుడు యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు వేసి కలిపి దించేయాలి. రబ్డీ ఖీర్ చల్లారిన తరవాత కప్పులో వేసి కొద్దిగా పేణీ, ఇష్టమైన గింజలు, డ్రైఫ్రూట్స్ అలంకరించవచ్చు లేదా అలాగే కూడా తినవచ్చు.

గమనిక: రబ్డీ ఖీర్ చల్లారే క్రమంలో మరింతగా చిక్కబడుతుంది. కాబట్టి గరిటజారుడుగా ఉండగానే స్టవ్ మీద నుంచి దించేయాలి.



సోయా మిల్క్ జింజర్ పై

కావలసినవి: సోయా మిల్క్ – పావు లీటరు ; తాజా అల్లం రసం– టేబుల్ స్పూన్ ; చక్కెర– టేబుల్ స్పూన్.

తయారీ: ● మందపాటి పాత్రలో సోయామిల్క్ పోసి, మీగడ తేలకుండా కలుపుతూ మరిగించాలి. ● పాలు చిక్కబడుతున్నప్పుడు చక్కెర కలిపి కలియబెడుతూ మరిగించాలి. ● చక్కెర కరిగిపోయిన తర్వాత అల్లం రసం కూడా కలిపి రెండు నిమిషాల పాటు మరిగించాలి. ● అప్పటికి పాలు దాదాపు సగం అవుతాయి. ఈ దశలో స్టవ్ ఆపేసి మూత పెట్టాలి. ● వేడి తగ్గిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టి చల్లగా సర్వ్ చేయాలి. ● ఇది హెల్దీ డెజర్ట్. సర్వ్ చేసే ముందు డ్రై ఫ్రూట్స్, నట్స్ కలుపుకోవచ్చు.

వేగన్ మిల్క్ ఇంట్లోనే!

సోయాపాలు : మూడు కప్పుల సోయా గింజలను కడిగి మునిగేటట్లు నీటిని పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం మరోసారి గట్టిగా రుద్ది రెండు–మూడు సార్లు కడగాలి. పొట్టు వదిలిన వరకు వదలనివ్వాలి. గింజలను మిక్సీలో వేసి కొద్దికొద్దిగా నీటిని కలుపుతూ గ్రైండ్ చేయాలి. మెత్తని పేస్ట్‌ని పెద్ద పాత్రలోకి తీసుకుని ఒక కప్పు నీటిని పోసి కలిపి పలుచటి క్లాత్ లేదా జ్యూస్ స్ట్రెయినర్‌తో వడపోయాలి. చిక్కటి సోయాపాలు వస్తాయి. మరో కప్పు నీటిని పోసి గట్టిగా పిండేసి అవసరమనిపిస్తే మరో అరకప్పు నీటిని పోసి వడపోయాలి. ఈ పాలను మరిగించి చల్లార్చి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే నాలుగు రోజుల పాటు తాజాగా ఉంటాయి.



పాలుగాని పాలతో...

వేగన్ స్వీట్స్

శాకాహారప్రియులు... మాంసాహారప్రియులు... ఇద్దరూ ఇష్టపడే రుచి పాలు – పాల ఉత్పత్తులు. వీటితోపాటు డెయిరీ లేని కొత్త ఆహారవిధానం ట్రెండింగ్‌లో ఉంది. అదే వేగన్ డైట్. పాలను దరి చేరనివ్వని వేగన్ ప్రియులు పెరుగుతున్నారు. యానిమల్ మిల్క్ వాడిన కారణంగా వీళ్లు స్వీట్లకూ దూరమే. అందుకే... ప్లాంట్ మిల్క్‌తో చేసుకునే స్వీట్లను చూద్దాం...



కోకోనట్ షీరా

కావలసినవి: తాజా కొబ్బరి తురుము – అర కప్పు ; కొబ్బరి పాలు – కప్పు ; నెయ్యి– అర కప్పు ; ఉప్మా రవ్వ– కప్పు ; బాదం – పది (సన్నగా తరగాలి) ; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్ ; చక్కెర – కప్పు ; యాలకుల పొడి– టీ స్పూన్.


తయారీ: ● మందపాటి పెనంలో నెయ్యి వేడి చేసి రవ్వ వేసి సన్న మంట మీద దోరగా వేయించాలి. రవ్వ వేగిన తర్వాత కొబ్బరి తురుము, బాదం, కిస్‌మిస్ వేసి వేయించాలి. కొబ్బరి వేగిన వాసన తెలుస్తుంది. అప్పుడు కొబ్బరి పాలు, చక్కెర వేసి కలుపుతూ ఉడికించాలి. కొబ్బరిపాలు మరీ చిక్కగా ఉండి అడుగు పడుతూ ఉంటే అర కప్పు నీటిని వేసుకోవచ్చు. మిశ్రమం దగ్గరవుతున్నప్పుడు యాలకుల పొడి వేసి కలిపి, తేమ ఇగిరిపోయిన తర్వాత దించేయాలి.

బాదం పాలు

ఇవి కూడా రాత్రంతా నానబెట్టి ఉదయం మిక్సీలో గ్రైండ్ చేసి తగినంత నీటితో వడపోసుకోవడమే.

కొబ్బరి పాలు

తాజా కొబ్బరి ముక్కలను లేదా తురుమును మిక్సీలో వేసి నీటిని కలుపుతూ మెత్తగా గ్రైండ్ వడపోయాలి. చిక్కదనాన్ని బట్టి మరికొంత నీటిని కలుపుకుంటూ వడపోసుకోవాలి.


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50


సంపుటి: 16 సంచిక: 1

శుక్రవారం 24-3-2023

సాక్షి CELEBRATING 15 YEARS

15 ఏళ్ల విజయ యాత్రను ముగించుకుని 16వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా పాఠకులకు, ఏజెంట్లకు మరియు ప్రకటనకర్తలకు సాక్షి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి రంజాన్

రంజాన్ నెల ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం 5.09 గం. సహర్‌తో ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి.

- వివరాలు 2లో



4 రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి బీజేపీ 4 రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల్ని నియమించింది.

- వివరాలు 6లో



నిఖత్ పంచ్ అదిరె...

ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు నిఖత్ జరీన్, నీతూ, లవ్లీనా బొర్గోహైన్, స్వీటీ బూరా ఫైనల్ చేరారు.

- వివరాలు 15లో



అమృత్‌పాల్ @ ఆ ఏడుగురు

దేశంలో శాంతిభద్రతల్ని విచ్ఛిన్నం చేయడానికే ఐఎస్ఐ అమృత్‌పాల్‌ను పంజాబ్‌కు పంపిందని పోలీసులు అనుమానిస్తున్నారు.

- వివరాలు 6లో

కడుపులో పెట్టుకుంటాం

పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు ప్రకటించిన సీఎం కేసీఆర్



గురువారం మహబూబాబాద్ జిల్లా రెడ్డికుంట తండాలో పంట నష్టపోయిన రైతును పరామర్శిస్తున్న సీఎం కేసీఆర్

- నిరాశ పడొద్దు..ధైర్యం కోల్పోవద్దంటూ విజ్ఞప్తి
- 2,28,258 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వెల్లడి
- రూ. 228 కోట్లు గంటలోనే మంజూరు
- కరీంనగర్‌లో జీవో కాపీ కూడా చూపించిన ముఖ్యమంత్రి
- 'ఫస్ట్ టైం ఇన్ ఇండియా.. చాలా కాస్ట్లీ' అంటూ వ్యాఖ్య
- కేంద్రానికి నివేదిక పంపడం లేదన్న కేసీఆర్
- మా రైతుల్ని మేమే కాపాడుకుంటామని స్పష్టీకరణ
- నాలుగు జిల్లాల్లో ముఖ్యమంత్రి సుడిగాలి పర్యటన

సాక్షి ప్రతినిధులు ఖమ్మం, కరీంనగర్/సాక్షి, మహబూబాబాద్, వరంగల్/దుగ్గొండి: ఇటీవలి అకాల వర్షాలకు రాష్ట్రంలోని 2,28,258 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని సీఎం కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ప్రభుత్వం తరఫున సహాయ పునరావాస చర్యగా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రూ.228 కోట్లు గంటలోనే మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత కరీంనగర్‌లో సంబంధిత జీవో కాపీని కూడా చూపించారు. 'ఇది చాలా కాస్ట్లీ. ఎకరానికి రూ.10 వేలు ఫస్ట్ టైమ్ ఇన్ ఇండియా. ఈ పంట.. ఆ పంట అని కాకుండా దెబ్బతిన్న ప్రతి ఎకరాకు ప్రకటిస్తున్నా. తక్షణమే ఈ సహాయం బాధిత రైతులకు అందుతుంది..' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులెవరూ అధైర్య పడొద్దని, అండగా ఉంటామని, కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. గురువారం ఆయన ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం

మిగతా 13వ పేజీలో ▶

> పంటలు దెబ్బతింటే తెలిసీ తెలియక నష్టపరిహారం అంటారు. కానీ వాస్తవంగా దీన్ని సహాయ పునరావాస చర్యలు అంటారు. నష్ట పరిహారం అనేది ప్రపంచంలో ఎవ్వరూ ఇవ్వలేరు. సాధ్యం కాదు కూడా. మళ్లీ రైతు పుంజుకుని వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా సహాయ సహకారాలు అందించాలి. అందుకే ఎకరానికి రూ.10 వేలు ఇస్తున్నాం.
>
> - సీఎం కేసీఆర్

పంట నష్టంపై సర్వే

- బాధిత రైతులు, కౌలు రైతులను గుర్తించాలి
- ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం
- ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ ప్రభుత్వం
- నాలుగు రోజుల్లో సాయం అందజేత

13 లో

ఈ అనుబంధం నిరంతరం

'సాక్షి' పదిహేనవ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు ఎడిటర్ లేఖ

2 లో

సాక్షి CELEBRATING 15 YEARS

జనం వెంట నిలిచి... సమస్యలు తీర్చి...

కొన్ని అక్షర సాక్ష్యాలు

- లోపలి పేజీల్లో



16.8 కోట్ల మంది డేటా చోరీ!

రక్షణ శాఖకు చెందిన 2.55 లక్షల మంది సహా వివిధ వర్గాల ప్రజల వివరాలు విక్రయం

- వివిధ కంపెనీలు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళల డేటా కూడా అంగట్లోనే
- వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్లు, సెల్‌ఫోన్, పాన్ నంబర్లు సైతం...
- దేశ భద్రతకు ముప్పు కలిగించేలా నోయిడా కేంద్రంగా ఓ ముఠా దందా
- ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు
- లోతైన దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు: సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: వందలు.. వేలు.. లక్షలు కాదు.. ఏకంగా కోట్లాది మందికి సంబంధించిన వ్యక్తిగత సమాచారం చోరీకి గురైంది. రక్షణ శాఖ సహా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన లక్షలాది మంది ప్రభుత్వాధికారులు, ఉద్యోగుల డేటా అంగడి సరుకుగా మారింది. మహిళలు, వృద్ధులు, విద్యార్థుల వివరాలూ కేటుగాళ్లకు చేరాయి. పాన్, ఫోన్ నంబర్లు, వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్ల వివరాలు క్రిమినల్స్ పరమయ్యాయి. దేశ భద్రతకు ముప్పు కలిగించే స్థాయిలో

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రూ. 429.28 కోట్లతో మద్నూర్-బోధన్ రోడ్డు



కామారెడ్డి, నిజామాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేలా మద్నూర్- బోధన్ రహదారి విస్తరణ కోసం రూ.429.28 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు.

- వివరాలు 7లో

మోదీతో రాజకీయాలు మాట్లాడలేదు: కోమటిరెడ్డి



ప్రధాని మోదీతో రాజకీయపర అంశాలపై చర్చ జరగలేదని, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే ఆయనను కలిశానని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి తెలిపారు.

- వివరాలు 7లో

అధికార పక్షానికి 6



ఏపీలో ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఆరు స్థానాలను సాధించింది. టీడీపీ క్రాస్ ఓటింగ్‌తో ఒక స్థానాన్ని దక్కించుకుంది. వైఎస్సార్ సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉండటంతో ఏడు స్థానాలకూ అభ్యర్థులను పోటీ పెట్టగా, సంఖ్యాబలం లేకపోయిన ప్పటికీ బాబు అభ్యర్థిని బరిలోకి దింపారు.

- వివరాలు 8లో



'దొంగల ఇంటి పేరు మోదీ' వ్యాఖ్యలపై...

రాహుల్‌కు రెండేళ్ల జైలు

- పరువు నష్టం కేసులో దోషిగా తేల్చిన సూరత్ కోర్టు
- అప్పీల్‌కు అనుమతి, నెలపాటు శిక్ష నిలిపివేత
- ఇప్పటికిప్పుడు అనర్హత వేటు పడదు: నిపుణులు

6 లో

రేవంత్, సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు



- టీఎస్‌పీఎస్సీ అంశంలో కుట్రపూరితంగా నాపై ఆరోపణలు
- బట్టకాల్చి మీద వేసే చిల్లర వేషాలను సహించం
- కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారంటూ కేటీఆర్ ఆగ్రహం

- వివరాలు 2లో

కేటీఆర్ దగ్గర మొత్తం డేటా ఉంది



- ఆయనకు నోటీసులు ఇచ్చి విచారించాలి... రాకుంటే అరెస్టు చేయాలి
- ఇదే విషయాన్ని సిట్ అధికారులకు స్పష్టం చేశా: రేవంత్‌రెడ్డి
- కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్

- వివరాలు 2లో

నోటీసులకు భయపడేదే లే



- చట్ట, న్యాయ, రాజకీయపరంగా ఎదుర్కొంటా
- కేటీఆర్‌ను బర్తరఫ్ చేసే వరకు వదిలిపెట్టేది లేదు
- టీఎస్‌పీఎస్సీతో సంబంధం లేకుండా ఆ సంస్థ తరఫున ఎందుకు మాట్లాడుతున్నవ్?: కేటీఆర్‌ను నిలదీసిన బండి సంజయ్

2 లో

ఎల్బీనగర్ లాడ్జిలో

ఎవరెవరు కలిశారు?

ఈ నెల 4న లాడ్జిలో బస చేసిన నీలేశ్, గోపాల్

- వారితో పాటే డాక్యా, రాజేందర్.. మరికొందరు
- వారెవరన్న దానిపై దృష్టి పెట్టిన సిట్ అధికారులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజ్ స్కామ్‌ను దర్యాప్తు చేస్తున్న సిట్.. ఎల్బీనగర్‌లోని ఓ లాడ్జిపై దృష్టి సారించింది. ఏఈ పరీక్ష జరగడానికి ముందురోజు రాత్రి నిందితులు అక్కడ బస చేయడం, మరికొందరు వచ్చి వారిని కలవడంతో.. వచ్చిన వారెవరనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ కేసులో కొత్తగా అరెస్టు చేసిన ముగ్గురినీ సిట్ అధికారులు గురువారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరితో పాటు పోలీసు కస్టడీ పూర్తయిన తొమ్మిది మందినీ జైలుకు పంపారు. మరోవక్క గ్రూప్-1 పరీక్షలో 100 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన 121 మంది జాబితాను కమిషన్ నుంచి సేకరించిన పోలీసులు వారికి నోటీసులు ఇవ్వడం ప్రారంభించారు.

లాడ్జి నుంచే ఏఈ పరీక్షకు ..

గత నెల ఆఖరి వారంలో ప్రవీణ్ కుమార్ నుంచి ఏఈ ప్రశ్నపత్రం అందుకున్న రేణుక, డాక్యాలు అభ్యర్థులైన నీలేశ్, గోపాల్‌లను మహబూబ్‌నగర్

మిగతా 12వ పేజీలో ▶

పరీక్షలు రాసిన కమిషన్ ఉద్యోగులెవరు?

- వారికి వచ్చిన మార్కులు ఎన్ని?
- 48 గంటల్లో నివేదిక సమర్పించాలి
- ప్రభుత్వానికి గవర్నర్ తమిళిసై ఆదేశం

2 లో

ఇదండీ సంగతి



విదేశాలకు పారిపోలేదట! ఆస్తుల కొనుగోళ్లకు వెళ్లాడట!!



ఈ అనుబంధం నిరంతరం!

ఉగాదులు ఏటేటా వస్తూనే ఉంటాయి. ఎన్ని మధురోహలను అవి మిగిల్చి వెళ్తున్నాయన్నదే ముఖ్యం. ఉషస్సులు రోజూ పూస్తూనే ఉంటాయి. వాటి కాంతులు ఎన్ని క్రాంతుల్ని వెలిగించాయన్నదే ప్రధానం. పుట్టిన ప్రతి జీవికీ కాలంలో ఒక కొలమానం ఉంటుంది. జట్టు కట్టిన ప్రతి సంస్థకు కూడా ఆయుర్దాయం లెక్కలుంటాయి. ఆ కొలమానాలు, ఆయుర్దాయాలు దస్తావేజుల కోసం మాత్రమే. ఎంతకాలం బతికామన్నది కాదు, ఎలా బతికామన్నది ముఖ్యం. క్వాలిటీ ఆఫ్ లైఫ్ ముఖ్యం. వ్యక్తికైనా, వ్యవస్థకైనా ఈ సూత్రం వర్తిస్తుంది. వ్యక్తుల జీవిత లక్ష్యాలను ఎవరికి వారే నిర్ణయించుకుంటారు. ఎంతవరకు విజయం సాధించారో తూకం వేయగల తీర్పరులు కూడా ఎవరికి వారే! వ్యవస్థల లక్ష్యాలను సమష్టి తత్వం నిర్ణయిస్తుంది. ఆ వ్యవస్థల జయాపజయాలపై భాష్యం చెప్పగలిగే వారెవ్వరు? ఆ వ్యవస్థల ద్వారా ప్రభావితమయ్యే విశాల పౌరసమాజం మాత్రమే. వ్యవస్థల పనితీరును బట్టి వాటిలో ఎప్పటికప్పుడు ఆయుష్షును నింపగలిగే ఆక్సిజన్ యంత్రం సమాజం దగ్గరే ఉంటుంది.

'సాక్షి'దినపత్రిక తెలుగింటి తలుపు తట్టి నేటికి సరిగ్గా పదిహేనేళ్లవుతున్నది. తన పదిహేనేళ్ల కాలగమనంలో ఏ రోజున కూడా మిలియన్ కాపీల మార్కును తగ్గకుండా తలెత్తుకుని నిలబడిన పత్రిక బహుశా 'సాక్షి'ఒక్కటే! ఏబీసీ లెక్కల ప్రకారం సగటున 12 లక్షల సర్క్యులేషన్‌ను 'సాక్షి'సాధించింది. ఈ ఒక్క మెతుకు చాలు అన్నం ఉడికిందో లేదో తేల్చడానికి! పన్నెండు లక్షల తెలుగు కుటుంబాల్లో సాక్షి 'ఫ్యామిలీ'మెంబర్‌గా మారింది. 'సాక్షి'ని తమ ఇంటి మనిషిగా ఆ కుటుంబాలు నేటికీ సమాదరిస్తున్నాయి. ఒక పత్రికను ప్రజలు ఎందుకు ఇంతగా ఆదరిస్తారు? అందుకు తగిన కారణాలుండాలి కదా! ఉన్నాయి. లక్షలాది కుటుంబాలతో అనుబంధం పెనవేసుకోవడం వెనుక పదిహేనేళ్ల సౌభ్రాతృత్వం ఉన్నది. సంఘీభావం ఉన్నది. సాహచర్యం కొనసాగుతున్నది. తన పాఠక కుటుంబాల్లోని ప్రతి ఉద్వేగాన్ని 'సాక్షి'పంచుకున్నది. వారి ఆనందంలో కేరింతలు కొట్టింది. దుఃఖంలో కన్నీరు తుడిచింది. వారి పోరాట స్ఫూర్తికి పదును పెట్టింది. విజయాలకు పరవశించింది. కింద పడితే చేయందించింది. అడుగడుగునా తోడునీడగా నిలవడానికి తన శక్తిమేరకు 'సాక్షి'పని చేసింది. అందుకే ఈ చెక్కుచెదరని ప్రజాదరణ.

సమస్యలు వ్యక్తిగతమా... సామూహికమా అన్న తేడాను చూడలేదు. న్యాయమైన పరిష్కారం కోసం బాధితులతో కలిసి నడుం కట్టింది. సిద్దిపేటలో శ్రీనివాస్ అనే ఓ నిరుపేద కరోనాతో కన్నుమూశాడు. భార్యాబిడ్డల్ని అద్దె ఇంటి ఓనర్ గెంటేశాడు. ఇద్దరు బిడ్డలతో అభాగ్యురాలు నడివీధిన నిలబడి రోదించింది. 'సాక్షి'అండగా నిలబడింది. ప్రభుత్వం తరఫున ఆమెకో గదిని కేటాయింపజేసింది. ఉత్తరాంధ్ర గిరిజన పల్లెల్లో ప్రసవం కోసం గర్భిణులను డోలీల్లో మోసుకొని వెళ్లేవారు. కొండదారుల్లో కిలోమీటర్ల పర్యంతం అలా వెళ్లాల్సి వచ్చేది. అనేకమార్లు దురదృష్టకర మరణాలు కూడా సంభవించేవి. ఈ అమానుషత్వంపై 'సాక్షి'ఒక ఉద్యమాన్నే నడిపింది. ప్రభుత్వం మారిన వెంటనే స్పందన లభించింది. గర్భిణులను ప్రసవ తేదీకి వారం రోజుల ముందుగానే అతిథిగృహాల్లో చేర్చుతున్నారు. అనంతరం ఆస్పత్రికి పంపించి సుఖప్రసవం జరిగేలా చూస్తున్నారు. ప్రసవం తర్వాత అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి తల్లీబిడ్డల్ని ఇంటికి సాగనంపుతున్నారు. ఇవి మచ్చుకు మాత్రమే. ఇటువంటి ఉదాహరణలు 'సాక్షి'అనుభవంలో కొన్ని వందలున్నాయి.

ప్రజల తరఫున ఉద్యమాలకూ, పోరాటాలకు మాత్రమే 'సాక్షి'పరిమితం కాలేదు. సకుటుంబ సపరివారానికి సలహాదారు పాత్రను కూడా పోషించింది. సాధికారికంగా సలహాలివ్వగలిగే నిపుణులను పరిచయం చేసింది. ఈ పదిహేనేళ్లలో లక్షలాదిమంది విద్యార్థులు, ఉద్యోగార్థులూ తమ 'భవిత'ను 'సాక్షి'లో వెతుక్కున్నారు. సివిల్స్, గ్రూప్ 1, 2 వంటి పోటీ పరీక్షలైనా, అకడమిక్ కోర్సులైనా, క్యాట్, గేట్, నీట్, ఐఐటీ, ఎంసెట్ ప్రవేశ పరీక్షలైనా విద్యార్థులు ముందుగా చూసేది సాక్షినే. ఇప్పటికీ ఈ ఒరవడి కొనసాగుతూనే ఉన్నది. డైలీ ఫీచర్స్‌కు కొత్త అర్థాన్ని చెబుతూ 'ఫ్యామిలీ'పేరుతో ప్రతిరోజూ ఒక ఇంద్రధనుసునే 'సాక్షి'అందజేస్తున్నది. ఫ్యామిలీ బాస్‌గా ఇల్లాలినే పరిగణిస్తూ, ఆమె కేంద్రకంగానే ఫీచర్స్ కథనాలను రూపొందిస్తున్నది. స్ఫూర్తిదాయకమైన మహిళా విజయాలు, చైతన్యం, ఆర్థిక స్వావలంబన, పిల్లల పెంపకం, పెద్దల కేరింగ్ వంటి అంశాల్లో ఎన్నో అమూల్యమైన కథనాలు 'సాక్షి'పేజీలను అలంకరించాయి. ఫ్యామిలీ పేజీల శీర్షికలన్నీ కూడా పాఠకులకు కంఠోపాఠమే.

మట్టిలోని మాణిక్యాలను వెలికితీసే పనిలో కూడా 'సాక్షి'నిమగ్నమై పనిచేస్తున్నది. అటువంటి మాణిక్యాలకు 'సాక్షి'ఎక్సలెన్స్ అవార్డులను అందజేసి గౌరవిస్తున్నది. గుర్తింపు కోరుకోకుండా, ప్రశంసల కోసం పాకులాడకుండా తమ పోరాటాల్లో మునిగి తేలుతున్న ఎంతోమంది రియల్ హీరోలను వెతికి లోకానికి పరిచయం చేస్తున్నందుకు 'సాక్షి'గర్విస్తున్నది. సుస్థిర సేద్య పద్ధతులు కూడా వ్యవసాయరంగ సంక్షోభ పరిష్కారానికి ఒక మార్గమని బలంగా నమ్మిన 'సాక్షి'పదిహేనేళ్లుగా తన సాగు'బడి'లో ఈ పాఠాలను బోధిస్తున్నది. ఈ రోజున తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాదిమంది రైతులు పాటిస్తున్న ప్రకృతి సేద్య విధానాల వెనుక తను పోషించిన వైతాళిక పాత్రను 'సాక్షి'వినమ్రంగా చాటుకుంటున్నది. చిన్నారులకోసం స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ వంటి మెదడుకు మేత వేసే కార్యక్రమాలు, యువతరంలో క్రీడా స్ఫూర్తిని నింపడం కోసం 'సాక్షి ప్రీమియర్ లీగ్'పోటీలు ప్రతిఏటా 'సాక్షి'నిర్వహిస్తున్నది. ఇలా అన్ని వయసుల ప్రజలకూ, అన్ని శ్రేణుల సమూహాలకు ఉపయుక్తమయ్యే కార్యక్రమాలను భుజాన వేసుకొన్న 'సాక్షి'నేడు జనం గుండెచప్పుడుగా మారింది. అందుకే ఈ ఆదరణ.

'సాక్షి'పుట్టుకే ఒక లక్ష్యంకోసం. 'సాక్షి'వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచుగా చెప్పేమాట – 'ఎంతకాలం బతికామన్నది కాదు, ఎలా బతికామన్నది ముఖ్యం!' ఆయన బలంగా నమ్మే సిద్ధాంతం – విశ్వసనీయత! ఈ రెండంశాలు 'సాక్షి'కి సర్వదా శిరోధార్యాలు. ఏకపక్ష వార్తల చీకటి యుగాన్ని చీల్చి చెండాడుతూ, నాణేనికి మరోవైపు కోణాన్ని పరిచయం చేసే లక్ష్యంతో 'సాక్షి' ఆవిర్భవించింది. లక్ష్యసాధనలో విజయం సాధించిందని చెప్పడానికి పాఠకాదరణే ఒక కొలమానం. పత్రికా రచనలోనూ, ప్రచురణలోనూ నాణ్యత, విశ్వసనీయత పాళ్లను ఏమాత్రం తగ్గకుండా 'సాక్షి'సర్వశక్తులా ప్రయత్నిస్తున్నది. ఇన్నేళ్లుగా తమ కుటుంబంలో ఒకరిగా అక్కున చేర్చుకున్న లక్షలాది పాఠక మహాశయులకూ, వారి ఆత్మీయతకూ 'సాక్షి'శిరస్సు వంచి నమస్కరిస్తున్నది. అండగా నిలబడుతున్న ప్రకటనకర్తలకు, తోడుగా నడుస్తున్న ఏజెంట్లకు, తెల్లవారక ముందే పాఠకుల ఇళ్లకు చేరవేస్తున్న పేపర్ బాయ్స్‌కు 'సాక్షి'సిబ్బంది – యాజమాన్యం తరఫున శతాధిక వందనాలు, ధన్యవాదాలు. గతంలాగే ఇకముందు కూడా పాఠక కుటుంబాల్లో సభ్యురాలి పాత్రను 'సాక్షి' పోషిస్తుంది. మీతో కలిసి నడుస్తుంది. కలిసి ఆడుతుంది. పాడుతుంది. అవసరమైతే మీతో కలిసి మీ తరఫున పోరాడుతుంది. ఈ అనుబంధం నిరంతరం కొనసాగుతుంది.

\- ఎడిటర్

లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



కెరమెరి(ఆసిఫాబాద్): పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రెటరీలతోపాటు బాధ్యులైన అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన పాదయాత్ర గురువారం కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని జ్యోతినగర్ నుంచి ప్రారంభమై ధనోరా గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాసిన తర్వాత పేపర్ లీక్ కావడంతో అభ్యర్థులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు భవిష్యత్తు గురించి భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే, దోషులను శిక్షించకుండా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని సిట్ అధికారులు తమ కార్యాలయానికి తప్పుచేసిన ముద్దాయిలా పిలిపించడం అన్యాయమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిందేనని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకులు వాస్తవ పరిస్థితులు చెబుతుండటంతోనే సీఎం కేసీఆర్ పంట నష్టపరిహారం ఎకరాకు రూ.10 వేలు ఇస్తామంటున్నారని పేర్కొన్నారు. కాగా, పేపర్ల లీకేజీపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు ప్రశ్నించిన రేవంత్ సహా ప్రతిపక్ష నాయకులను, వ్యక్తులను భయపెట్టేలా చేయడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని గురువారం భట్టి ఒక ప్రకటనలో విమర్శించారు.

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ అనుబంధం నిరంతరం



● అది 2015 ఏప్రిల్ 4వ తేదీ.. ఉమ్మడి నల్లగొండ జిల్లా మోత్కూరు మండలం జానకీపురంలో జరిగిన ఎన్‌కౌంటర్ సంచలనం సృష్టించింది. దానికి ముందు ఇద్దరు సిమీ ఉగ్రవాదులు అస్లాం అయాబ్, జాకీర్ బాదల్ సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో పోలీసులపై కాల్పులు జరిపారు. అక్కడి నుంచి పరారై అర్వపల్లి మీదుగా వెళ్తూ సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై మెయిన్ రోడ్డులో ఆగి ఓ ప్రయాణికుడి బైక్‌ను లాక్కున్నారు. నాటి ఘటనలో ఈ ఇద్దరు ఉగ్రవాదుల కాల్పుల్లో సీఐలు మొగిలయ్య, బాలగంగిరెడ్డి తీవ్రంగా గాయపడగా ఆత్మకూరు (ఎం) ఎస్సై సిద్దయ్య, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు కూడా మరణించారు.

✔ అయితే బైక్‌పై పిస్టల్, కార్బన్ గన్ చేతబట్టి వెళ్తున్న ఈ కరడుగట్టిన ఉగ్రవాదులను స్థానిక రిపోర్టర్ శ్రీరంగం వెంకన్న ఫొటో తీశారు. ఈ సమయంలో వారిలో ఒకరు రిపోర్టర్‌ను గమనించి దాడికి సమాయత్తమయ్యారు. కానీ అదే సమయంలో ఓ బస్సు అడ్డంగా రావడం, వెనుక నుంచి పోలీసు వాహనం వస్తున్న చప్పుడు వినిపించడంతో ఉగ్రవాదులు పారిపోయారు. 'సాక్షి'రిపోర్టర్ సాహసోపేతంగా తీసిన ఈ చిత్రమే ఆ ఉగ్రవాదులను గుర్తించడానికి తోడ్పడింది. దీనిని జాతీయ, అంతర్జాతీయ మీడియాలో కూడా వినియోగించుకోవడం గమనార్హం.

\- అర్వపల్లి

రేవంత్, సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

- టీఎస్‌పీఎస్సీ అంశంలో కుట్రపూరితంగా నాపై ఆరోపణలు చేస్తున్నారు
- బట్టకాల్చి మీద వేసే చిల్లర వేషాలు సహించం
- కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారంటూ కేటీఆర్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వ్యవహారంలో రాజకీయ దురుద్దేశంతోనే కుట్రపూరితంగా పదే పదే తన పేరును లాగేందుకు ప్రతిపక్ష నేతలు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోడిగుండుకు మోకాలికి ముడిపెట్టినట్లు మాట్లాడుతూ బట్టకాల్చి మీద వేసే చిల్లర ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ వ్యవహారంపై నిరాధారమైన, అసత్య ఆరోపణలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు లీగల్ నోటీసులు పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్రలను ఎండగట్టేందుకే లీగల్ నోటీసులు పంపిస్తున్నట్లు వెల్లడించారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడి స్వయంప్రతిపత్తి కలిగిన టీఎస్‌పీఎస్సీ అంశంలో తనను లాగడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాలన పట్ల కనీస జ్ఞానం లేకుండా వాస్తవాలు పక్కన పెట్టి బండి సంజయ్, రేవంత్‌రెడ్డి దుర్మార్గపూరిత కుట్రలకు తెరలేపారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగాల భర్తీ ప్రక్రియను నిలిపివేసే కుట్ర

ఉద్యోగాల భర్తీ ప్రక్రియను నిలిపివేయాలనే కుతంత్రంతోనే టీఎస్‌పీఎస్సీ అంశంలో కాంగ్రెస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. చదువులు పక్కనపెట్టి తమ రాజకీయాల కోసం యువత కలిసి రావాలనడం, ఉద్యోగ నోటిఫికేషన్ల జారీని కుట్రగా అభివర్ణించడం విపక్షాల కుట్రలకు అద్దంపడుతున్నాయన్నారు. శవాలపై చిల్లర ఏరుకునే రాజకీయ రాబందుల మాదిరిగా కాంగ్రెస్, బీజేపీ మారాయని మండిపడ్డారు. బండి సంజయ్, రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పరిస్థితి పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. ఉద్యోగాల జాతరకు పాతరేయాలనే విపక్షాల కుట్రలు సాగనివ్వబోమని, వీరి రాజకీయ ఉచ్చులో యువత చిక్కుకోవద్దని కేటీఆర్ పిలుపునిచ్చారు. దిద్దుబాటు చర్యలు చేపట్టిన టీఎస్‌పీఎస్సీ భవిష్యత్తులో జరిగే పరీక్షలను పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు సన్నద్ధమవుతోందన్నారు.

నోటీసులకు భయపడేదే లే

చట్ట, న్యాయ, రాజకీయపరంగా ఎదుర్కొంటా

- కేటీఆర్‌ను బర్తరఫ్ చేసే వరకు వదిలిపెట్టేది లేదు
- టీఎస్‌పీఎస్సీతో సంబంధం లేకుండా ఆ సంస్థ తరఫున ఎందుకు మాట్లాడుతున్నవ్?: బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు. చట్ట, న్యాయబద్ధంగా తగిన సమాధానమిస్తాం'అని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ స్పష్టం చేశారు. రాజకీయంగా, ప్రజా క్షేత్రంలో పోరాడతామే తప్ప కేసీఆర్ సర్కార్ తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. ట్విట్టర్ టిల్లును (కేటీఆర్) కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసే వరకు వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. తనకు కేటీఆర్ లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో వస్తున్న వార్తలపై గురువారం రాత్రి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

''టీఎస్‌పీఎస్సీతో సంబంధం లేదని కేటీఆర్ చెప్పడం పెద్ద జోక్. ఏ సంబంధం లేకపోతే సీఎం నిర్వహించే సమీక్షలో ఎందుకు పాల్గొన్నారు. విద్యాశాఖ మంత్రి, చీఫ్ సెక్రటరీ, అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ పేపర్ లీకేజీకి ఇద్దరు వ్యక్తులే తప్ప టీఎస్‌పీఎస్సీ తప్పిదం లేదని ఎట్లా చెబుతారు? లీకేజీ వెనుక బీజేపీ, బండి సంజయ్ కుట్ర ఉందని ఎట్లా ఆరోపిస్తారు? రాష్ట్రంలోని అన్ని శాఖల తరఫున వకాల్తా పుచ్చుకుని ఎందుకు మాట్లాడుతున్నారో సమాధానం చెప్పాలి''అని డిమాండ్ చేశారు. మంత్రిగా కేటీఆర్ స్పందిస్తే తప్పు లేనప్పుడు... ప్రజల పక్షాన పోరాడే ప్రతిపక్షంగా తాము మాట్లాడితే తప్పేముందని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు నోటీసులిచ్చే కొత్త సాంప్రదాయానికి కేటీఆర్ తెరలేపడం సిగ్గుచేటు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ తప్పిదాలపై నోరెత్తకుండా ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలో భాగమే ఇది అని విమర్శించారు. కేసీఆర్ సర్కార్‌కు తన వైఫల్యాలు, తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు బెదిరించడం, కేసులు పెట్టడం, తమ తాబేదారు సంస్థలతో నోటీసులు ఇప్పించడం, అరెస్ట్ చేయించడం అలవాటుగా మారిందని నిందించారు. చట్ట, న్యాయపరంగా నోటీసులకు సమాధానమిస్తాం. రాజకీయంగా ఎదుర్కొంటామే తప్ప వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని సంజయ్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

కేంద్రం సాయం లేదనడం అబద్ధం...

పంట నష్టం కింద రైతులకు కేంద్రం పైసా సాయం చేయలేదని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చెప్పడం పచ్చి అబద్ధమని బండి సంజయ్ పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు సాయం చాలా గొప్ప విషయమని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల నుంచి రైతులకు పంట నష్టపరిహారం చెల్లిస్తోంది. ఆ నిధుల్లో 75 శాతం వాటా కేంద్రానివే. అయినా కేంద్రం పైసా ఇవ్వలేదని చెబితే ప్రజలు నవ్వుకుంటున్నారనే సోయి లేకుండా మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పడి 9 ఏళ్లయినా ఇంతవరకు సమగ్ర పంటల విధానాన్ని, బీమా పాలసీని తీసుకురాకుండా కేంద్రంపై బురద చల్లడం సిగ్గుచేటని బండి సంజయ్ నిందించారు.

క్లుప్తంగా...

పరీక్షలు రాసిన కమిషన్ ఉద్యోగులెవరు?

48 గంటల్లో నివేదిక సమర్పించాలి.. ప్రభుత్వానికి గవర్నర్ తమిళిసై ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) పేపర్ లీకేజీపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మరోసారి తీవ్రంగా స్పందించారు. మొదటిసారి పేపర్ లీక్ అయినప్పుడు కమిషన్ కార్యదర్శిని 48 గంటల్లో లీకేజీకి సంబంధించిన సమాచారం ఇవ్వాలని ఆదేశిస్తూ కమిషన్‌కు లేఖ రాసిన సంగతి విదితమే. తాజాగా గురువారం మరో లేఖను ప్రభుత్వానికి, కమిషన్‌కు రాశారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పోటీపరీక్షలకు హాజరైన కమిషన్ రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎవరు? కమిషన్ నుంచి అనుమతితో, అనుమతి లేకుండా హాజరైన వారెవరెవరు? పరీక్షల్లో సాధించిన మార్కులు ఎన్ని? పరీక్షల తర్ఫీదుకు సెలవులు తీసుకున్నారా? వంటి వివరాలతో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసు దర్యాప్తు తాజా పురోగతిపై 48 గంటల్లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ ఆదేశించారు. గవర్నర్ ఆదేశాలతో ఈ మేరకు రాజ్‌భవన్ గురువారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, డీజీపీ, టీఎస్‌పీఎస్సీకి లేఖలు రాసింది. సిట్ దర్యాప్తులో పురోగతిని సైతం నివేదికలో తెలపాలని కోరింది.

నేటి నుంచి టెన్త్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్షలు వచ్చే నెల 3 నుంచి ప్రారంభంకానున్నాయి. కావున.. టెన్త్ హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు అభ్యర్థులు https://telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి శుక్రవారం నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

గంట విచారణ.. 43 నిమిషాలు ప్రెస్‌మీట్!

- టీఎస్‌పీఎస్సీ 'లీకేజ్'వ్యవహారంలో రేవంత్ ఆరోపణలకు ఆధారాలు కోరిన సిట్
- భారీ కాన్వాయ్‌తో వచ్చిన రేవంత్.. అడ్డుకున్న పోలీసులు
- కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా.. తోపులాట, ఉద్రిక్తత, అరెస్టులు



సిట్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజ్ స్కామ్‌పై రాజకీయ ఆరోపణలు చేసిన టీపీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని సిట్ అధికారులు గురువారం సుమారు గంట పాటు ప్రశ్నించారు. ఆయన భారీ కాన్వాయ్‌తో విచారణకు హాజరవడం, పెద్ద సంఖ్యలో వచ్చిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం, కాంగ్రెస్ శ్రేణుల ధర్నా, తోపులాట, అరెస్టులతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, షబ్బీర్ అలీతో పాటు పలువురు సీనియర్లను పోలీసులు గృహ నిర్బంధం చేయడంపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారీ కాన్వాయ్‌తో వచ్చి..

సిట్ సమన్ల ప్రకారం రేవంత్ గురువారం ఉదయం 11 గంటలకు హాజరుకావాల్సి ఉంది. ఆయన తన ఇంటి నుంచి నాలుగు కార్లతో బయలుదేరారు. రెండో కారులో ఆయన కూర్చున్నారు. ఈ కాన్వాయ్‌కు దారిపొడవునా మరిన్ని కార్లు వచ్చి చేరాయి. తాజ్‌కృష్ణ హోటల్ వద్దకు వచ్చేసరికి కార్ల సంఖ్య 40 వరకు చేరింది. అక్కడ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీనితో రేవంత్‌రెడ్డి కారుదిగి వచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో వదిలేశారు. తిరిగి లిబర్టీ చౌరస్తా వద్ద పోలీసులు మరోసారి కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో రేవంత్ కారు దిగి నడుచుకుంటూ సిట్ కార్యాలయం వద్దకు వచ్చారు. మధ్యాహ్నం 12.45 గంటలకు రేవంత్ సిట్ ఆఫీస్‌లోకి వెళ్లగా.. ఆయన అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు బయట గేటు వద్దే ఆపేశారు. ఈ సమయంలో కాంగ్రెస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేశాయి. ఈ సమయంలో పోలీసులకు, పార్టీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. చివరికి కొందరిని పోలీసులు అరెస్టు చేసి నారాయణగూడ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఆధారాలేమీ ఇవ్వకుండానే..

సిట్ కార్యాలయంలోకి వెళ్లే సమయంలో రేవంత్ తన వెంట కొన్ని ఫోల్డర్స్ తీసుకువెళ్లారు. దాదాపు గంటపాటు జరిగిన విచారణలో రేవంత్ తాను చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలేవీ అధికారులకు అందించలేదని తెలిసింది. కేవలం కేటీఆర్ ప్రెస్‌మీట్‌కు సంబంధించిన క్లిప్పింగ్స్, వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్‌నే ఇచ్చారని.. వాటితోపాటు ఇచ్చిన లేఖపై కేటీఆర్ మీద తాను చేస్తున్న ఫిర్యాదు అంటూ రాశారని సమాచారం. అయితే ఫిర్యాదులా తీసుకోవడానికి సిట్ అధికారులు నిరాకరించడంతో.. దానిని సమాచారంగా మార్చి అందించినట్టు తెలిసింది. దాదాపు 1:45 గంటల సమయంలో సిట్ కార్యాలయం నుంచి రేవంత్ బయటికి వచ్చారు. అక్కడే 43 నిమిషాలకుపైగా మీడియాతో మాట్లాడారు. కాగా, రేవంత్ ఆధారాలేవీ అందించనందున ఆయనపై తదుపరి చర్యలు తీసుకోవడంపై న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్నామని ఓ సిట్ అధికారి తెలిపారు.

జోరుగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర

ఠాక్రేకు వివరించిన రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఆశించినదానికంటే బాగా జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే గురువారం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, నదీంజావెద్, రోహిత్ చౌదరిలతో సమావేశమయ్యారు. వాస్తవానికి రేవంత్‌తోపాటు సీఎల్పీ నేత భట్టి కూడా ఠాక్రేతో భేటీ కావాల్సి ఉంది. అయితే భట్టి ఆసిఫాబాద్ జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఉన్నందున హైదరాబాద్‌కు రాలేకపోయారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో జరుగుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర తీరును సమీక్షించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో యాత్ర జరుగుతున్న సరళిని ఠాక్రేకు రేవంత్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యాత్రలను త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. దీంతో సంతృప్తి వ్యక్తం చేసిన ఠాక్రే, రేవంత్‌రెడ్డిని అభినందించారు.

కేటీఆర్ దగ్గర మొత్తం డేటా ఉంది

- ఆయనకు నోటీసులిచ్చి విచారించాలి.. రాకుంటే అరెస్టు చేయాలి
- ఇదే విషయాన్ని సిట్ అధికారులకు స్పష్టం చేశా..: రేవంత్‌రెడ్డి
- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై నేను, సంజయ్, కేటీఆర్ స్పందించాం
- నాకు, సంజయ్‌కు మాత్రమే సిట్ నోటీసులు ఇవ్వడమేంటి?

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ నేరాన్ని కేవలం ఇద్దరికే పరిమితం చేసి కేటీఆర్ పెద్ద తలల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని.. ఆయన వద్ద మొత్తం సమాచారం ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంలో బీజేపీ నేతలు ఉన్నారని కేటీఆర్ బహిరంగంగానే చెప్పారని.. ఈ విషయంలో ఆయనకు సిట్ నోటీసులు ఇచ్చి విచారించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో రేవంత్‌రెడ్డి పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ ఆరోపణలకు సంబంధించి ఆధారాలను అందజేయాలన్న నోటీసుల మేరకు రేవంత్ గురువారం సిట్ ఎదుట హాజరయ్యారు. విచారణ అనంతరం బయటికి వచ్చాక మీడియాతో మాట్లాడారు. ''గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో వంద మందికిపైగా 100 మార్కులు వచ్చాయని చెప్తే.. ప్రభుత్వం వారిని విచారించాల్సింది పోయి సిట్ ద్వారా నోటీసులిచ్చి మమ్మల్ని భయపెట్టే ప్రయత్నం చేస్తోంది. పేపర్ లీకేజీపై నేను, బండి సంజయ్, కేటీఆర్ స్పందించాం. కానీ సిట్ అధికారులు కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులకు మాత్రమే నోటీసులిచ్చి కేటీఆర్‌కు ఇవ్వలేదు. కేటీఆర్ వద్ద లీకేజీకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంది. ఈ నెల 18న ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ నేతలపై ఆరోపణలు చేశారు. ఆయనకు నోటీసులు ఇచ్చి పిలిచి ఆ వివరాలు, ఆధారాలు తీసుకోవాలి. కేటీఆర్ రాకపోతే అరెస్టు చేసి కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాలని సిట్ అధికారులకు చెప్పాను. కేటీఆర్ స్పీచ్‌కు సంబంధించిన ఆధారాలు అందించాను''అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

మూడు డిమాండ్లతో నిరసనలు

టీఎస్‌పీఎస్సీ వ్యవహారంపై మూడు ప్రధాన డిమాండ్లతో ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ''లీకేజ్ వ్యవహారానికి నిరసనగా ఈ నెల 24, 25 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగ నిరసన దీక్ష కార్యక్రమం, 25న సాయంత్రం కాకతీయ యూనివర్సిటీలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం, టీఎస్‌పీఎస్సీని రద్దు చేయడం, పేపర్ లీక్ కేసును సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలనే మూడు నిర్దిష్టమైన డిమాండ్లతో ముందుకువెళ్తాం. 30లక్షల మంది తెలంగాణ నిరుద్యోగుల భవిష్యత్‌ను ఆంధ్రా వాళ్లే నిర్ణయిస్తున్నారు. రాష్ట్రం వచ్చినా ఆంధ్రా అధికారుల చేతిలోనే తాళాలు ఎందుకు ఉన్నాయి? ఇంత పెద్ద వ్యవస్థకు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ హోదా ఉన్న ఒక్క తెలంగాణ బిడ్డ లేడా? రాజమండ్రికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు తాళాలు అప్పగించడం ఏమిటి? పేపర్ల లీకేజ్ కేసు దర్యాప్తు చేసే సిట్‌కు విజయవాడకు చెందిన ఐపీఎస్ అధికారి ఏఆర్ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా ఉన్నారు. తెలంగాణకు చెందిన శివధర్‌రెడ్డి, సుధీర్‌బాబు మీకు కనిపించలేదా?''అని రేవంత్ ప్రశ్నించారు. ఏఆర్ శ్రీనివాస్ నిజాయతీని తాను శంకించట్లేదని, అయితే ప్రభుత్వ పెద్దల తీరు సరిగా లేదని పేర్కొన్నారు.

నేటి నుంచి రంజాన్

నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలు షురూ



సాక్షి, హైదరాబాద్: నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ నెల ప్రారంభమైనట్లు సైరన్లు మోగించి మతగురువులు ప్రకటించారు. శుక్రవారం తెల్లవారుజామున సహార్‌తో ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. కాగా, మూడేళ్లుగా కరోనాతో నగరంలో రంజాన్ సందడి అంతగా కనిపించలేదు. ఈ ఏడాది కరోనా ప్రభావం తగ్గడంతో రంజాన్ కళ మళ్లీ తిరిగి రానుంది. ఒకవైపు ముస్లింలు ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ..మరోవైపు తమకు కావాల్సిన నిత్యావసర వస్తువులతో పాటు పండ్లు, ఫలాలు కొనుగోలుతో మార్కెట్‌లు సందడిగా మారాయి. చార్మినార్, నయాపూల్, అఫ్జల్‌గంజ్, మల్లేపల్లితో, మెహిదీపట్నం, టోలిచౌకితో పాటు ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల్లో రంజాన్ మార్కెట్‌లు వెలిశాయి. వ్యాపార సంస్థలను రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

ఆదర్శ జీవనానికి రంజాన్ మాసం ప్రేరణ: సీఎం

సాక్షి, హైదరాబాద్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సీఎం కేసీఆర్ తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పరమ పవిత్రమైన రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనను పెంపొందించి, ఆదర్శవంత జీవనం దిశగా ప్రేరణనిస్తుందని ఆయన అన్నారు. ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ఖురాన్ పఠనం, ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, జకాత్, ఫిత్రా వంటి ధార్మిక కార్యక్రమాలతో ఆధ్యాత్మికత, జీవిత పరమార్థం అవగాహనలోకి వస్తాయని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలనీ ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

అవగాహనే అస్త్రంగా..!

- అగ్ని ప్రమాదాల నియంత్రణపై అధికారుల ఫోకస్
- వరుస ప్రమాదాల నేపథ్యంలో బహుళ అంతస్తుల భవనాల్లో ఉండే వారికి అవగాహన కార్యక్రమాలు



సాక్షి, హైదరాబాద్: వరుసగా జరుగుతున్న భారీ అగ్నిప్రమాదాల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. బహుళ అంతస్తుల భవనాలు, చాలా ఏళ్ల క్రితం నిర్మించిన వాణిజ్య సముదాయాల్లో అగ్నిప్రమాదాల నియంత్రణపై అధికారులు ప్రధానంగా ఫోకస్ పెట్టారు. ప్రమాదం జరిగితే ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లే అవకాశాలు ఇలాంటి చోట్లలోనే ఎక్కువగా ఉండటంతో ఈ తరహా భవన సముదాయాల్లో ఉండే వారికి అవగాహన పెంచడమే లక్ష్యంగా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి శుక్రవారం ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలి, ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటే ఎలా జాగ్రత్తపడాలన్న అంశాలపై ఈ శిబిరాల్లో వివరిస్తున్నట్టు వివరించారు. అలాగే అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఏం చేయకూడదన్న విషయాలు కూడా వివరిస్తున్నారు. వాణిజ్య సముదాయాలతోపాటు పెట్రోల్ బంక్‌లు, పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీల్లో కూడా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లోని పాత బహుళ అంతస్తుల వాణిజ్య భవనాల్లోని దుకాణ యజమానులకు, ఆయా దుకాణాల్లో పనిచేసే వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తాజాగా స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రమైన పొగ కారణంగా లోపల చిక్కుకుపోవడం, ఆ సమయంలో ఎలా తప్పించుకోవాలో అవగాహన లేకపోవడంతోనూ బాధితులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇకపై ఇలాంటి పరిస్థితి రాకుండా వాణిజ్య సముదాయాల్లో పనిచేసే వారికి జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఇటీవలే అన్ని జిల్లాలతోపాటు రీజియన్‌ల ముఖ్య అగ్నిమాపక శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి ఫైర్‌స్టేషన్ అధికారులు తమ పరిధిలోని భవనాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంపై ఆడిటింగ్ చేయడంతోపాటు, ప్రమాదాల నియంత్రణకు జాగ్రత్తలు వివరించాలని ఆదేశించారు.

సాక్షి CELEBRATING 15 YEARS
ఈ అనుబంధం నిరంతరం

- హైదరాబాద్‌లో విచ్చలవిడిగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విక్రయాలపై 'సాక్షి' స్టింగ్ ఆపరేషన్ నిర్వహించింది. సోషల్ మీడియా ఆధారంగా దందా జరుగుతున్న తీరును ఆధారాలతో సహా గుర్తించింది. 'సిటీలో గంజాయ్.. అడుగడుగునా ఎంజాయ్' శీర్షికన 2021 సెప్టెంబర్ 6న ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. తర్వాత మరిన్ని వివరాలతో కథనాలు ఇచ్చింది.

✔ 'సాక్షి' కథనాలతో స్పందించిన ప్రభుత్వం నిషా ముక్త్ రాష్ట్రం ఏర్పాటుకు నడుం బిగించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రాష్ట్రస్థాయి 'నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో' ఏర్పాటుకు సంకల్పించింది. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) ఏర్పాటు అందులో భాగమే. ఈ వింగ్ పకడ్బందీ నిఘా, వరుస దాడులతో భారీ ఎత్తున డ్రగ్స్ దందాల గుట్టు తేల్చి, చాలా మందిని అరెస్టు చేయడం గమనార్హం. ఇక రాష్ట్ర పోలీసు విభాగానికి ప్రభుత్వం గత ఏడాది అదనంగా 3,966 పోస్టులు కేటాయించగా.. అందులో తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ బ్యూరో కోసమే 1,500 పోస్టులు ఇవ్వడం గమనార్హం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని 7వ అంతస్తును ఈ విభాగానికి కేటాయించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, వరంగల్ కమిషనరేట్లలో ప్రత్యేకంగా నార్కోటిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకూ పచ్చజెండా ఊపింది.



సాక్షి, హైదరాబాద్

నాలుగేళ్లుగా పరారీలో ఉన్న నేరస్తుడు అరెస్ట్

హరియాణాలో అరెస్టు చేసిన తెలంగాణ సీఐడీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: బయోటెక్ కంపెనీలో డీలర్లుగా అవకాశం ఇస్తామని నమ్మించి పలువురి నుంచి రూ. 1.26 కోట్లు వసూలు చేసి పరారీలో ఉన్న నిందితుడిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. 2019లో నమోదైన ఈ కేసులో నిందితుడు రంజిత్ తివారీ అలియాస్ రాజీవ్ సక్సేనా అలియాస్ హిమాన్షు ఉపాధ్యాయ నాలుగేళ్లుగా పరారీలో ఉన్నాడు. ఎట్టకేలకు నిందితుడి జాడను గుర్తించిన సీఐడీ అధికారులు ఈ నెల 20న హరియాణా రాష్ట్రంలోని గురుగ్రామ్ జిల్లాలో అరెస్టు చేసినట్టు సీఐడీ అడిషనల్ డీజీ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. కేసు దర్యాప్తులో ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.

జస్టిస్ దేవానంద్, జస్టిస్ నాగార్జున్ బదిలీపై రాష్ట్రపతి ఆమోదముద్ర


దేవానంద్


నాగార్జున్

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు మద్రాస్ హైకోర్టుకు బదిలీపై గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ భట్టు దేవానంద్, తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ దేవరాజు నాగార్జున్‌లను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుపై రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు.

> నిశ్చయంగా మానవుడు ఆత్రగాడుగా (తొందరపడే వాడిగా) సృష్టించబడ్డాడు ; తనకు కీడు కలిగినప్పుడు ఆందోళన చెందుతాడు ; మేలు కలిగినపుడు స్వార్థపరునిగా ప్రవర్తిస్తాడు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, మార్చి, 24

అప్రమత్తత అవసరమే!

పీడకల లాంటి కోవిడ్–19 మానవాళిని ఇంకా నీడలా వెంటాడుతూనే ఉంది. మొదలై మూడేళ్ళు నిండినా, ఇప్పటికీ ఏదో ఒక కొత్త రూపంలో వేధిస్తూనే ఉంది. దేశంలో కొన్నాళ్ళు సద్దుమణిగిన కరోనా ఈ మార్చిలో క్రమంగా పడగవిప్పింది. కరోనా కేసులు గత అయిదు వారాల్లో ఏకంగా 9 రెట్లు పెరగడంతో, కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. డిసెంబర్ 22 తర్వాత సరిగ్గా మూడు నెలలకు బుధవారం మళ్ళీ ప్రధాని మోదీ సారథ్యంలో కరోనాపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించడం దాని ఫలితమే. ఒక వంక కరోనా, మరో వంక ఇన్‌ఫ్లుయెంజా కేసులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుండడంతో తక్షణ కార్యాచరణకు ప్రభుత్వం కదిలింది. కరోనా కేసుల 'టెస్టింగ్ – ట్రాకింగ్ – చికిత్స – టీకాకరణ – కోవిడ్ సముచిత ప్రవర్తన' అనే అయిదంచెల వ్యూహంపై దృష్టి కొనసాగించాల్సిందిగా కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలకూ గురువారం సూచించింది. త్వరలో దేశమంతటా మాక్ డ్రిల్స్ నిర్వహించడానికీ సమాయత్తమవుతోంది. వెరసి, దేశంలో ఆరోగ్య వ్యవస్థ సంసిద్ధత, టీకాకరణ వర్తమాన స్థితి లాంటి వాటిపై మరోసారి ఆలోచన, అంచనా మొదలైంది.

ఫిబ్రవరి రెండోవారంలో రోజూ సగటున 108 కేసులొస్తే, ఇప్పుడది రోజుకు 966 కేసులకు పెరగడం గమనార్హం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కరోనా కేసుల్లో 1 శాతమే భారత్‌లోనివనీ, మొత్తంగా దేశంలో ఉన్నవి 7600 కరోనా కేసులే అనీ అధికారిక లెక్క. అయితే టెస్టింగ్ గణనీయంగా తగ్గిన నేపథ్యంలో కేసుల అసలు సంఖ్య అంతకన్నా ఎక్కువే ఉండవచ్చు. ప్రస్తుతానికి మహా రాష్ట్ర, గుజరాత్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు ఎనిమిదింటిలో గరిష్ఠంగా కేసులు నమోదవుతున్నాయి. కరోనా వైరస్‌లో జన్యుపరమైన వేరియేషన్లను గమనించడానికి 50కి పైగా ప్రయోగశాలలతో కూడిన గ్రూపు 'ఇండియన్ సార్స్– కోవ్–2 జీనోమిక్స్ కన్సార్టియమ్' (ఇన్సాకాగ్) పనిచేస్తోంది. వీలైనంత ఎక్కువగా కోవిడ్ పాజిటివ్ నమూనాలను ఈ ఇన్సాకాగ్ ల్యాబ్‌లకు పంపి, జన్యు నిర్మాణక్రమాన్ని విశ్లేషిస్తే ఏ కొత్త వేరియంట్ వచ్చినా ఇట్టే కనిపెట్టవచ్చు. తక్షణ చర్యలు చేపట్టవచ్చు. అందుకే, ప్రభుత్వం సైతం ల్యాబ్‌ల ద్వారా వీలైనన్ని పాజిటివ్ శాంపిళ్ళను పరీక్షించి, జీనోమ్ సీక్వెన్సింగ్ విశ్లేషించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

మునుపటి కరోనా వేరియంట్లకు భిన్నంగా ఈసారి మూడు అదనపు కొమ్ములున్న ఉత్పరివర్తనమైన ఎక్స్‌బీబీ.1.16 (మరో మాటలో 'ఆర్క్‌టూరస్') వేరియంట్ తాజా కేసుల విజృంభణకు కారణమని ప్రాథమిక విశ్లేషణ. దేశంలో తొలిసారిగా జనవరిలో బయటపడ్డ ఈ వేరియంట్ కేసుల సంఖ్య ఏ నెలకానెల పెరుగుతూ వస్తుండడం గమనార్హం. ఈ వేరియంట్ తీవ్రత, వ్యాప్తి ఎంత అన్నది అధ్యయనం చేయాల్సి ఉంది. కేసులు పెరుగుతున్నా, ఆస్పత్రి పాలవడం, ప్రాణాలు కోల్పోవడం లాంటివి ఎక్కువగా లేవు. అది పెద్ద ఊరట. నిజానికి, ఇప్పటి వరకు దేశంలో మొత్తం 220.65 కోట్లకు పైగా కరోనా టీకా డోసులు వేశారు. ఇది పెద్ద సంఖ్యే. వ్యాధినిరోధకత సాధించిన మన ప్రజానీకం ఇప్పటికే బీఎ.2.75, బీఎ.5, బీక్యూస్, ఎక్స్‌బీబీ.1.5 లాంటి పలు కరోనా వేరియంట్లను తట్టుకొని నిలబడింది. కొత్త వేరియంట్‌ను కూడా తట్టుకొంటే, మంచిదే. అలా కాకుంటేనే చిక్కు.

కరోనా, ఫ్లూ, సీజనల్ వ్యాధులు సహా కారణాలేమైనా తీవ్ర శ్వాసకోశ సమస్యలు అనేకం ప్రస్తుతం నమోదవుతూ ఉండడం ఆలోచించాల్సిన విషయం. ప్రస్తుత ఫ్లూ సీజన్‌లో దేశంలో శరవేగంగా వ్యాపిస్తూ, శ్వాసకోశ సమస్యలు కల్పిస్తున్న హెచ్3ఎన్2 వైరస్ సైతం కొన్ని దశాబ్దాలుగా ప్రపంచంలో ఉన్నదే. 'ఇన్‌ఫ్లుయెంజా–ఏ'లో ఉపవర్గానికి చెందిన ఈ వైరస్ కూడా కరోనా వైరస్‌లా మహమ్మారిగా విజృంభించి, 1968లో ప్రపంచవ్యాప్తంగా 20 నుంచి 40 లక్షల మరణాలకు కారణమైంది. మన దేశంలో 2010లో బయటపడ్డ ఈ రకం వైరస్‌కు ఒకసారి గురైతే జీవితకాల వ్యాధినిరోధకత వస్తుందట. అయితే కరోనా, దీర్ఘకాలం గొంతునొప్పి, దగ్గుతో వేధించే ఇన్‌ఫ్లుయెంజా – రెండూ ఎప్పటికప్పుడు జన్యు ఉత్పరివర్తనాలతో రూపం మార్చుకొనే ఆర్ఎన్ఏ వైరస్‌లే. అందుకే, ఇన్‌ఫ్లుయెంజా సైతం కరోనాలా ఒకరి నుంచి మరొకరికి మహమ్మారిలా విస్తరించే ముప్పుంది. దేశంలో ఏ,బీ రకాల ఇన్‌ఫ్లుయెంజాలు రెండూ ఉన్నందున తాత్కాలికంగా హడావిడి చేసి, సమస్యను అదుపు చేశామనడం కాక ప్రభుత్వ పక్షాన సమగ్ర ఆరోగ్య ప్రణాళికా రచన తప్పనిసరి.

రకరకాల మహమ్మారుల నివారణ, ఎదుర్కొనే సంసిద్ధత, కార్యాచరణలకు సంబంధించి 'మహమ్మారి నివారణ ఒప్పందం' చేసుకోవాలని విశ్వవేదికపై వివిధ దేశాలు, సంస్థలు ఇప్పటికే చర్చిస్తున్నాయి. ఆర్థికంగా, పారిశ్రామికంగా వర్ధమాన దేశాలైన 'గ్లోబల్ సౌత్'కు ప్రతినిధిగా, జీ20 దేశాలకు ప్రస్తుత సారథిగా భారత్ ఇందులో చురుకైన పాత్ర పోషించాలి. అందరికీ ఫలాలు సమంగా అందేలా చూడాలి. కరోనా, ఫ్లూ కేసులు వేలల్లో నమోదైన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాలే కాదు, ప్రజలూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. సుదీర్ఘంగా వేధిస్తున్న వ్యాధులతో విసుగొచ్చి, ముందు జాగ్రత్తలు పాటించకుంటే మనకే నష్టం. ఈ వ్యాధికారక వాతావరణంతోనూ సహజీవనం చేయడం నేర్చుకోవాలి. సభలు, సమావేశాలు, సినిమాలు, షికార్లు, ప్రయాణాలు – ఇలా జన సమ్మర్దం ఉండే ప్రతిచోటా స్వచ్ఛందంగా మాస్కు ధారణ, భౌతికదూరం తప్పనిసరి చేసుకోవాలి. వీటితో పాటు తరచూ చేతుల పరిశుభ్రతను ఒక అలవాటుగా చేసుకోవాలని నిపుణుల సూచన. ఈ కనీస జాగ్రత్తలతో కరోనాతో సహా అన్ని రకాల వైరల్, ఫ్లూ దాడుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. మహమ్మారుల కథ ఇంకా ముగిసిపోలేదు. మన జాగ్రత్తలే మనకు రక్ష.

ఇది భారత్ భరించలేని బెడద

విశ్లేషణ



ప్రకాశ్ సింగ్

పాకిస్తాన్‌తో కలిసి వేర్పాటువాద శక్తులు పంజాబ్‌లో సమస్యను పెంచి పోషించడానికి ప్రయత్నిస్తున్నారనేది స్పష్టం. పోలీసులు ఇప్పటికైనా మేలుకున్నారు. కానీ రాష్ట్రం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాడేందుకు ప్రభుత్వం, పోలీసు బలగాలకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. అలాగే ఖలిస్తాన్ నిరసనకారులు లండన్‌లోని భారత రాయబార కార్యాలయం వెలుపల త్రివర్ణ పతాకాన్ని దించేయడం వంటి చర్యలకు దిగారు. వీరి కార్యకలాపాలను నిరోధించేందుకు సమర్థ చర్యలు చేపట్టాలని కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియాల మీద భారత్ ఒత్తిడి తేవాలి. యుద్ధప్రాతిపదికన ఖలిస్తాన్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేదంటే 1980లలో పంజాబ్‌ను వెంటాడిన ఉగ్రవాద రాత్రులు పునరావృతమైతే దేశం వాటిని భరించలేదు.

'వారిస్ పంజాబ్ దే' చీఫ్ అమృత్‌పాల్ సింగ్, అతడి అనుచరులపై మోపిన ఉక్కుపాదం నాటకీయంగా ఉంది. అది రహస్యపూరితంగా కూడా ఉంది. వేర్పాటువాద బోధకుడు గత కొంతకాలంగా పెంచుకుంటూ వచ్చిన ప్రమాద తీవ్రతపై రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా మేలుకుంది. ఫిబ్రవరి 23న జరిగిన అజ్నాలా ఘటన పోలీసులకు పెద్ద ఉపద్రవంలా మిగిలింది. ఈ ఘటనలో ఖలిస్తానీలు తుపాకులు పేల్చి పోలీసులను బాదిపడేశారు. అమృత్‌పాల్ సింగ్ అనుయాయి లవ్‌ప్రీత్ సింగ్ తూఫాన్ విడుదలను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. పోలీసులు ఈ వేర్పాటువాదికి దాదాపుగా లొంగిపోవడం కలవరపెట్టింది. తీవ్ర విమర్శలను ఎదుర్కొన్న తర్వాత, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఎట్టకేలకు మార్చి 18న అమృత్‌పాల్ సింగ్, అతడి మద్దతుదారులకు వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని నిర్ణయించుకుంది.



ఉపరితల చర్యలు పనికిరావు

ఇలాంటి తీవ్ర ఘటనపై తీసుకునే ఏ పోలీసు చర్యకు అయినా మంచి నిఘా వ్యవస్థ, సమగ్ర ప్రణాళిక మద్దతు తప్పనిసరిగా ఉండాలి. పైగా ఈ పథకాన్ని అమలుపర్చే బృందాన్ని జాగ్రత్తగా ఎంచుకోవలసి ఉంది. అయితే పంజాబ్ పోలీసులు ఎక్కడో దారి తప్పినట్లు కనిపిస్తోంది. అసలు అందరికంటే ముందు అమృత్‌పాల్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేయవలసింది. అతడిని బహిరంగంగా కస్టడీలోకి తీసుకుని వుంటే అతడి అనుచరులు చెదిరిపోయేవారు. అమృత్‌పాల్ ఇప్పటికీ పరారీలోనే ఉన్నాడు. దీన్ని జీర్ణించుకోవడం కష్టం. పంజాబ్ పోలీసులు ఎల్లప్పుడూ శాంతిభద్రతల దృక్కోణంలో పనిచేస్తుంటారని పంజాబ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుఖ్‌చైన్ సింగ్ గిల్ వ్యాఖ్యానించారు. ఈ వాదన నచ్చజెప్పేలా లేదు. మారుమూల దాగి వున్న వ్యక్తిని పట్టుకోవడానికి పంజాబ్ అటు నాగాలాండ్ కాదు, ఇటు చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ కాదు. చూస్తుంటే పోలీసులు గందరగోళానికి గురై ఉండాలి. లేదా అమృత్‌పాల్‌ను ఇప్పటికే నిర్బంధించి ఉండాలి. కానీ బహిరంగంగా కోర్టుకు హాజరు పర్చకపోయి ఉండాలి. ఏ రకంగా చూసినా రాష్ట్ర ప్రభుత్వానికీ, పోలీసులకూ ఇది వృథా ప్రయాసగానే మిగిలిపోవచ్చు.

వారిస్ పంజాబ్ దే అనుయాయులకు వ్యతిరేకంగా నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. సమాజంలో సామరస్యతను పాడు చేయడం, పోలీసులపై దాడి చేయడం, హత్యాయత్నం చేయడం, ప్రజాసేవకులు తమ విధులు చేపట్టకుండా అడ్డుకోవడం వాటికి కారణాలు. ఇవి సరే. కానీ భింద్రన్‌వాలే 2.0 అని తనను తాను చెప్పుకొంటున్న వ్యక్తిని బహిరంగంగా పట్టుకోకపోతే, ఈ ఉపరితల చర్యలతో ఉపయోగం ఉండదు.

రాష్ట్ర పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. భటిండాలో 16 మంది ఖలిస్తానీ మద్దతుదారులను అరెస్టు చేశారు. లూధియానాలో 21 మందిని కస్టడీలోకి తీసుకున్నారు. అజ్నాలాలో ఏడుగురిని చుట్టుముట్టారు. మొత్తంగా 112 మందిని అరెస్టు చేశారు. ఫిరోజ్‌పూర్, భటిండా, రూప్ నగర్, ఫరీద్ కోట్, బటాలా, హోషియార్‌పూర్, గుర్దాస్‌పూర్, మోగా, జలంధర్ వంటి నగరాల్లో భద్రతా దళాలు తమ బలం తెలిపేలా జాతీయ పతాకం చేబూని మార్చ్ కూడా నిర్వహించాయి.

రాజకీయాలకో నమస్కారం!

ఈ చర్యలన్నీ స్వాగతించాల్సినవే. కానీ గత కొద్ది నెలలుగా, పంజాబ్ పోలీసులు వారి ఘనతకు తగినట్లుగా వ్యవహరించలేకపోయారు. అత్యంత శక్తిమంతులైన శత్రువులకు కూడా నరకం చూపించే తమ సమర్థతను వారు ప్రదర్శించలేకపోయారు. ఒకే ఒక వివరణ ఏమిటంటే, ఈ వ్యవహారంలో పోలీసులు కాస్త నెమ్మదిగా వ్యవహరించాలని సూచనలు అందివుండాలి. వారిస్ పంజాబ్ దే ప్రతీఘాతుక కార్యకలాపాల గురించి మాట్లాడుతూనే, పంజాబ్ రాజకీయ నాయకత్వం అమృత్‌పాల్ సింగ్ పేరును ప్రత్యేకించి పేర్కొనకపోవడంపై చాలామంది ఎత్తిచూపారు. నేటి రాజకీయాలకో నమస్కారం. వాటి వల్ల పోలీసులు ఏ చర్యా చేపట్టకపోవడమే సురక్షితమైన చర్య అనుకున్నట్టున్నారు. ఎందుకంటే ఇది వివాదానికి దారి తీయవచ్చు. పైగా అధికారంలో ఉన్నవారు తమకు మద్దతుగా నిలబడకపోవచ్చు అని వారు భావించి వుండాలి. ఇలాంటి అంశాలు రాష్ట్ర ప్రభుత్వ విశ్వసనీయతను, చిత్తశుద్ధిని దెబ్బతీస్తాయి.

నిస్సందేహంగా, అమృత్‌పాల్ సింగ్ ప్రతిష్ఠకు పెద్ద దెబ్బ తగిలింది. అజ్నాలా పోలీస్ స్టేషన్‌కు గురు గ్రంథ్ సాహిబ్‌ని తీసుకెళ్లాలనీ, దాన్ని ఒక కవచంగా ఉపయోగించాలనీ అతడు తీసుకున్న నిర్ణయాన్ని సిక్కు మతాధికారులు ప్రశ్నించారు. ఇప్పుడు, అతడు అదృశ్యమైపోవడం పట్ల కూడా తీవ్రంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే ఎలాంటి ప్రమాదాన్నయినా నిర్భయంగా ఎదుర్కోవాలనీ, దాన్ని సవాలుగా తీసుకోవాలనీ బోధించే సిక్కు సంప్రదాయానికి ఇది భిన్నం.ఇక్కడ రెండు అంశాలను గుర్తు పెట్టుకోవాలి. ఒకటి పాకిస్తాన్‌తో, ఆ దేశ గూఢాచార సంస్థ ఐఎస్ఐతో సింగ్‌కు గల లంకె. ఒక సీనియర్ పంజాబ్ పోలీస్ అధికారి దీన్ని స్పష్టంగా పేర్కొన్నారు కూడా. అలాగే, తన మచ్చలను చిరుతపులి ఎన్నటికీ మార్చుకోలేనట్టుగా– తమ ప్రజలు ఆకలితో అలమటిస్తూ, దేశ ఖజానా దివాళా తీస్తున్న సమయంలో కూడా భారత్‌కు వ్యతిరేకంగా సమస్యలు సృష్టించడానికి పాకిస్తాన్ తన ఎత్తులను ఎన్నటికీ వదులుకోదనే విషయం స్పష్టమైంది. రెండోది ఏమిటంటే– పోలీసు, శాంతి భద్రతలు రాష్ట్ర పరిధిలో ఉంటున్నప్పటికీ వేర్పాటువాదం ఈ స్థాయిలో చెలరేగుతున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

ఉగ్రవాదులకు స్తూపాలా?

గత 10 సంవత్సరాలుగా పంజాబ్ పరిస్థితులు దిగజారుతున్నాయి. 2014లో దమ్‌దమీ టక్‌సాల్ సంస్థ 'ఆపరేషన్ బ్లూ స్టార్'లో చనిపోయిన జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే, ఇంకా ఇతర తీవ్రవాదులకు స్వర్ణ దేవాలయం ఆవరణలో స్మారక స్తూపం నిర్మించింది. పంజాబ్ వ్యాప్తంగా అనేక సందర్భాల్లో ఖలిస్తాన్, భింద్రన్‌వాలే పోస్టర్లను బహిరంగంగా ప్రదర్శించారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ వాటిని నిర్లక్ష్యం చేశాయి.

పంజాబ్ ఈరోజు అనేక రకాల సమస్యలతో పోరాడుతోంది. రాష్ట్రంలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని పాకిస్తాన్ ప్రభుత్వం పకడ్బందీగా పథకం వేస్తోంది. దీనికి తోడుగా సరిహద్దుల అవతలి నుంచి సీమాంతర మాదక ద్రవ్యాల సమస్య కూడా తీవ్రంగానే ఉంది. పాకిస్తాన్ నుంచి డ్రోన్లతో ఆయుధాలు జారవిడవడం, రాష్ట్రం లోపల సాయుధ ముఠాలు పెరగడం, ఖలిస్తాన్ రూపకల్పనకు మద్దతిచ్చే శక్తులు పెరగడం– వీటన్నింటినీ దీర్ఘకాలిక పథకంతో పరిష్కరించాల్సి ఉంది. అరకొర స్పందనలు, తలొగ్గిపోయే చర్యలు వంటివి సరిపోవు.

కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల్లో ఖలిస్తాన్ మద్దతుదారుల కార్యకలాపాలను నిరోధించేందుకు సమర్థ చర్యలు చేపట్టాలని భారత ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి. ఖలిస్తాన్ అనుకూలవాద నినాదాలు చేస్తున్న నిరసనకారులు లండన్‌లోని భారత రాయబార కార్యాలయం వెలుపల త్రివర్ణ పతాకాన్ని కిందికి దించేయడంతో ఇలాంటి చర్య చేపట్టడం జరూరుగా మారింది. భారత ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన దీన్ని పరిష్కరించాల్సి ఉంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, 1980లలో పంజాబ్‌ను వెటాడిన ఉగ్రవాద రాత్రులు తిరిగి సంభవిస్తే భారతదేశం వాటిని భరించలేదు.

వ్యాసకర్త మాజీ పోలీస్ అధికారి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అమరవీరులు



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను స్మరించుకుంటున్నాను. మన మాతృభూమి భారతదేశం కోసం తమ ప్రాణాలు వదిలేసిన గొప్ప అమరులకు నివాళి. (మార్చ్ 23 అమర వీరుల దినోత్సవం ; ఈ ముగ్గురు వీరులను ఉరి తీసిన రోజు.)

– సీమా దుగ్గల్, ఐపీఎస్ అధికారి

అనకపోవడమే తప్పు



ప్రజాస్వామ్యానికి ఉచ్చస్థితి ఇది. 'గోలీ మారో' (కాల్చేయండి) లాంటి వ్యాఖ్యానాలు ఏమాత్రం ఇబ్బంది లేనివి ; ద్వేషపూరిత ప్రసంగాలు సర్వసాధారణం. కానీ అవేవీ చేయని రాహుల్ గాంధీ లాంటివారికి మాత్రం జైలు శిక్షలు పడతాయి.

– జ్యోత్స్నా మోహన్, కాలమిస్ట్

విష వలయం



22 కోట్ల మంది పాకిస్తానీయుల అతి పెద్ద విషాదం ఏమిటంటే – న్యాయాధికారులు, రాజకీయ నాయకులు, అధికారులు ఒకరి నొకరు పెళ్లి చేసుకున్నారు. అందరినీ చూడండి. వాళ్లు ఒక మాఫియాలా తయారయ్యారు. ఇంక మీరు ఈ విష వలయం లోంచి ఎలా బయటపడగలరు?

– సాజిద్ ఎన్. తరార్, పాక్ వ్యాపారవేత్త

అసమానతకు కారణం



2020 లాక్‌డౌన్ కాలంలో కార్మికులు 3.7 ట్రిలియన్ డాలర్లు నష్టపోయారు. అదే సమయంలో బిలియనీర్లు 3.9 ట్రిలియన్ డాలర్లు లబ్ధి పొందారు. డబ్బులకు సంబంధించి ప్రపంచ చరిత్రలో అతి పెద్ద ఊర్ధ్వముఖ మార్పిడి ఇది.

– ఆరన్ ఖేరియాటీ, ఫెలో

మరో యుద్ధం?



నగోర్నో – కరబాఖ్ ప్రాంతం మీద ఎప్పుడూ ఒక కన్నేసి ఉంచండి. ఆర్మేనియా, అజర్‌బైజాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు చాలా తీవ్రస్థాయిలో ఉన్నాయి.

– ట్రెయ్ యాంగ్స్ట్, రిపోర్టర్

జగతిని ధర్మయాత్రతో జయించిన సమ్రాట్



మల్లెపల్లి లక్ష్మయ్య

''భారతీయ జెండాలో ధర్మ చక్రాన్ని ఇముడ్చుకోవడం కేవలం గుర్తుగా మాత్రమే కాదు. ఇది ప్రత్యక్షంగా సమ్రాట్ అశోకుణ్ణి నిరంతరం గుర్తుచేసుకోవడమే. సమ్రాట్ అశోకుడు భారతదేశం మాత్రమే గర్వించదగిన వాడు కాదు. యావత్ ప్రపంచం ఆయనను స్మరించుకొంటూనే ఉంది. ఆయన ఇతర దేశాలకు పంపిన దమ్మ సైన్యం దండయాత్రలకు వెళ్ళలేదు. మానవత్వాన్ని తమ వెంట తీసుకెళ్ళి ఎన్నో దేశాల సమాజాలను చైతన్య పరిచింది'' అంటూ భారత ప్రప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, 1947 జూలై 22వ తేదీన రాజ్యాంగ సభలో భారత జాతీయ పతాకంపై ప్రవేశ పెట్టిన తీర్మాన సభలో ప్రస్తావించారు. ఆయనతో పాటు ఆనాటి సభలో ఉన్న బాబాసాహెబ్ అంబేడ్కర్‌తోపాటు అనేక మంది మేధావులూ, న్యాయ నిపుణులూ నెహ్రూ ప్రసంగాన్ని ఎంతో ప్రశంసించారు.

అంతేకాకుండా ప్రముఖ బ్రిటిష్ చరిత్రకారుడు 'ప్రపంచ చరిత్రలో వేలాది మంది రాజులు, చక్రవర్తుల మధ్య సమ్రాట్ అశోక్ ఒక దివ్య తారలా వెలుగుతుంటాడు' అన్నారు. ఆయన పేరే హెచ్.జి. వెల్స్. ఆయన ప్రపంచ చరి త్రను, భారత దేశ చరిత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

దశదిశలా తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేసిన చక్రవర్తిగా అశోకుడికి గొప్ప పేరుంది. యుద్ధాలను నిరసించి శాంతిని కాంక్షించిన మానవతామూర్తిగా ఆయనకు మరొక విశేషమైన స్థాన మున్నది. పరిపాలనలో అనేకమైన సంస్కరణలను ప్రవేశ పెట్టిన దీక్షాదక్షతల ప్రత్యేకతలు ఉన్నాయి. వీటన్నింటికి తోడు, బౌద్ధాన్ని భారతదేశ హద్దులను దాటించి ఎన్నో దేశాల్లో ఆ ధర్మాన్ని విస్తరింపచేసిన సందర్భమున్నది. తన సొంత కొడుకును, బిడ్డను శ్రీలంకకు దమ్మదూతలుగా పంపించిన త్యాగ గుణమున్నది. వీటిన్నింటికన్న మరొక ముఖ్యమైన విషయమున్నది. అదే ఒక రాజుగా, చక్రవర్తిగా ప్రజల క్షేమాన్ని, సంక్షేమాన్ని ప్రధాన కర్తవ్యంగా స్వీకరించి ప్రపంచ చరిత్రలోనే 'సంక్షేమం' అన్న పదానికి ఒక రూపాన్నీ, సారాన్నీ అందించిన ఆద్యుడిగా చరిత్రలో నిలిచిపోయాడు.

బౌద్ధాన్ని తాత్విక భూమికగా చేసుకుని అశోకుడు ఈ విధానాలను సొంతం చేసుకున్నాడు. అందులో గౌతమ బుద్ధుడు అందించిన మార్గదర్శనం ప్రాథమికం. గౌతమ బుద్ధుని అనంతమైన బోధనలలో ఎన్నో అద్భుతమైన విషయాలున్నాయి. చాలామంది గౌతమ బుద్ధుణ్ణి కేవలం ఒక నైతిక విషయాల ప్రబోధకుడిగా పరిగణిస్తున్నారు. కానీ ఆయన ఆర్థిక, రాజకీయ విషయాల్లో ఎన్నో ఆవిష్కరణలను చేశారు.

ఆనాటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఆయన 'కూటదంత సుత్త', 'దశ రాజ దమ్మ' జాతక కథల్లో... ఒక రాజు నిర్వహించాల్సిన కర్తవ్యాలను చాలా వివరంగా తెలి పారు. దానినే దశరాజదమ్మంగా చెపుతుంటారు. దానం, శీలం, త్యాగం, నిజాయితీ, నిబద్ధత, ఆదరణ, దురాశలకు దూరంగా ఉండడం, విద్వేషం లేకుండా ఉండడం, ఇతర ప్రాణులను హింసించకుండా ఉండడం, క్షమా గుణం కలిగి ఉండడం, శత్రుత్వం లేకుండా ఉండడం లాంటి లక్షణాలకు కట్టుబడి ఉండాలని గౌతమ బుద్ధుడు బోధించాడు.

అంతేకాకుండా బుద్ధుడు మరొక చోట 'వస్స కార' అనే పేరుగల మంత్రితో మాట్లాడుతూ చెప్పిన విషయాలు కూడా రాజనీతికి మార్గదర్శకాలు. వస్సకార సుత్తలో గౌతమ బుద్ధుడు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి పునాదులు వేశాయి. మగధ రాజు అజాత శత్రు తన మంత్రి వస్సకారుణ్ణి బుద్ధుని దగ్గరికి పంపించి వజ్జి మీద దండయాత్ర చేస్తే ఎలా ఉంటుందని అడిగి సలహా తీసుకొమ్మని ఆదేశిస్తాడు. వస్సకారుడు వెళ్ళి బుద్ధుణ్ణి ఈ విషయమై అడుగుతాడు. దానికి గౌతమ బుద్ధుడు ఆనందుడికి కొన్ని ప్రశ్నలు వేస్తాడు. వజ్జి అనేది స్వతంత్రంగా ఉన్న జనపదం. వజ్జిలో ప్రజాస్వామ్య భావన ఉందని బుద్ధుడు చెపుతాడు. వాళ్ళు నిత్యం సమావేశమవుతారనీ, సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పొల్లుపోకుండా అమలు చేస్తారనీ; పిల్లలను, వృద్ధులను, మహిళలను గౌరవిస్తారనీ, గురువులను ఆదరించి పూజిస్తారనీ, అటువంటి వాళ్ళను ఎవ్వరు జయించలేరని బుద్ధుడు తెల్పి చెప్పాడు.

పదిసూత్రాలలో ఉన్న దశరాజ దమ్మం, వస్సకార సూత్రాలు సమ్రాట్ అశోకుని మీద అమిత ప్రభావాన్ని కలుగజేశాయని భావించక తప్పదు. ఇందుకు ఈనాటి ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌కు సమీపంలోని ధౌలిలో లభించిన శిలాశాసనమే సాక్ష్యం. ''ప్రజలందరూ నావాళ్లే. వాళ్లంతా నా సంతానమే. నా సంతానం క్షేమాన్ని ఎట్లాగైతే బాధ్యతగా స్వీకరిస్తానో, అట్లాగే ప్రజలందరి సంక్షేమం నా కర్తవ్యం'' అంటూ తన పాలన విధానాన్ని వివరించాడు. అప్పటివరకు యాగాల పేరుతో ధ్వంసమైపోతున్న సమాజాన్ని ప్రగతి వైపు పరుగులు పెట్టించిన అశోకుడు నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలకు బలమైన పునాదులు వేశాడు.

కొత్త కోణం



ప్రముఖ చరిత్రకారులు రొమిల్లా థాపర్ జరిపిన పరిశోధనలో అశోకుడి గురించి ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. సమాజాభివృద్ధిలో ఏ ఒక్క అంశాన్ని కూడా అశోకుడు వదిలిపెట్టలేదు. ముఖ్యంగా ప్రజల కష్టాలను తొలగించడానికి ఆర్థిక పరమైన ఎన్నో సంస్కరణలను ప్రవేశ పెట్టాడు. అందులో ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అశోకుడు తీసుకున్న చర్యలు వ్యవసాయ స్థిరీకరణకు ఉపయోగపడ్డాయి. వ్యవసాయ అభివృద్ధి కోసం చెరువులను తవ్వించి, పంట కాలువలను తవ్వడం ద్వారా వ్యవసాయ ప్రగతిలో కొత్త విప్లవం వచ్చింది. అందువల్ల స్థిరమైన గ్రామాల సంఖ్య పెరిగింది. యాగాలు, క్రతువుల పేరిట జరుగుతున్న పశు వధను నిషేధించడం వ్యవసాయ ప్రగతికి ఎంతో ఉపకరించింది. పశు సంతతిని అభివృద్ధి చేయడానికి పశు పెంపకం వైపు ప్రజలను ఆలోచింప జేశారు. ఈ విధానం వల్ల పాడి పంటలతో సమాజం ముందుకు వెళ్ళే మార్గాన్ని వేశారు. గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీస్ రాసిన 'ఇండికా' పుస్తకం ద్వారా ఈ విషయాలు కొన్ని వెలుగులోకి వచ్చాయి.

అంతేకాకుండా వ్యవసాయంతో పాటు వ్యాపార, వాణిజ్య రంగాలను అభివృద్ధి చేశాడు. అందులో నౌకాయానం, నౌకా నిర్మాణ పరిశ్రమలు ముఖ్యమైనవి. నౌకా నిర్మాణ పరిశ్రమ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకాక, అనాటి ప్రభుత్వమే నిర్వహించింది. ఎవరైనా నౌకలు కావాలంటే ప్రభుత్వమే అద్దెకు ఇచ్చేది. దీనికై ప్రత్యేకమైన విభాగాలు ఉండేవి. బంగారం, బట్టలు, వజ్రాలు, రత్నాలు, సుగంధ ద్రవ్యాలు ఇతర వస్తువుల ఎగుమతులు ఎక్కువగా జరిగేవి. దీనివల్ల గ్రామాలలో వృత్తి సముదాయాలు బాగా పెరిగాయి. వడ్రంగం, కుమ్మరి, కమ్మరి, చేనేత వర్గాలు చాలా వేగంగా తమ ఉత్పత్తిని, నైపుణ్యాన్ని పెంచుకోగలిగాయి. అంతేకాకుండా ఆనాటి పాలన అందిస్తున్న ప్రోత్సాహం వలన వ్యక్తుల నైపుణ్యం కూడా బాగా పెరిగింది. దీనితో వ్యాపార, వాణిజ్య రంగాలతో పాటు, కళా సంస్కృతులు బాగా వృద్ధి చెందాయి. ప్రజల కోసం ప్రభుత్వమే వైద్యశాలలను నిర్మించింది. పశు పక్ష్యాదులకు కూడా వైద్యం అందించారు. వ్యాపారుల కోసం, ఇతర యాత్రికుల కోసం దారుల వెంట వసతులు, నీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఇట్లా సమ్రాట్ అశోకుడు సాగించిన రాజకీయ, ఆర్థిక విప్లవ వృక్షాలకు బుద్ధుడు వేసిన విత్తనాలే మూలం. అందువల్ల బౌద్ధం గొప్పతనం విశిష్టత అశోకుడి పాలనలో మనకు రుజువులుగా కనిపించాయి. అలా బుద్ధుడు ప్రవచించిన బోధనలను ఆచరణలో అశోకుడు ఆనాటి సమాజానికి అన్వయించి ఆనాటి సామాజిక గతిని ప్రగతి వైపు నడిపించాడు. అయితే బుద్ధుడు, అశోకుడు చూపిన మార్గాన్ని బాబాసాహెబ్ అంబేడ్కర్ తన రాజకీయ సిద్ధాంతంగా మలుచుకొని జవహర్‌లాల్ నెహ్రూ లాంటి నాయకుల తోడ్పాటుతో భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య సంపదగా మార్చారు. అందుకే భారతదేశ చరిత్ర బుద్ధుడు, అశోకుడు, బాబాసాహెబ్ అంబేడ్కర్లదే అంటే అతిశయోక్తి కాదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 81063 22077
(మార్చి 29న సమ్రాట్ అశోక అష్టమి – అశోక జయంతి)

ఆదర్శ పోలీసు అధికారి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అధికారులలో కె. విజయరామారావు ఒకరు. వైవిధ్యభరితమైన పదవుల్లో అత్యుత్తమ సేవలందించి ఆయా పదవులకే వన్నె తెచ్చిన విశిష్టమైన వ్యక్తి ఆయన! పోలీసులు, ప్రజల మధ్య అపోహలను, అనుమానాలను తొలగించి పోలీసు ప్రజా సంబంధాలను మెరుగుపరచడానికి 1981 నవంబర్ లో 'సురక్ష' పేరుతో ఒక పోలీసు మాస పత్రికను ప్రారంభించారు. దానికి ఆయనే వ్యవస్థాపక సంపాదకులుగా పనిచేశారు. దానిని ప్రామాణికమైన పత్రికగా మలిచేందుకు జర్నలిజం అనుభవం ఉన్న వ్యక్తి అవసరమనే విషయాన్ని గ్రహించారు. ఈ తరుణంలో నేను ఆయనను కలవడం – వెంటనే ఆయన సీఎం ఎన్టీఆర్‌తో మాట్లాడి అసిస్టెంట్ ఎడిటర్ పోస్టును మంజూరు చేయించడం, నేను ఆ హోదాలో ఆ పత్రికలో జాయిన్ అవ్వడం... చకచకా జరిగిపోయాయి. దైనందిన విధినిర్వహణలో కిందిస్థాయి పోలీసులకు ఇది ఒక కరదీపికగా మారింది.



కె. విజయరామారావు

వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్లకు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల వద్దకు పంపించడం కోసం నగర పోలీసు కమీషనర్‌గా ప్రతి పోలీసు స్టేషన్లో రిసెప్షనిస్టులను ఏర్పాటు చేశారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ళ యూనిఫాంను మార్చారు. పోలీసుల జీతాలు పెరిగేలా కృషి చేశారు. పోలీస్ శాఖలో హోంగార్డులుగా పనిచేసేవారికి పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో రిజర్వేషన్ కల్పించారు. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఐజీగా ఉన్నప్పుడు ఆయన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి పారదర్శక విధానాన్ని ప్రవేశపెట్టి అందరి ప్రశంసలందుకున్నారు.

పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు విజయ రామారావును సీబీఐ డైరెక్టర్‌గా నియమించి ఢిల్లీకి తీసుకెళ్ళారు. సీబీఐ డైరెక్టర్‌గా అనేక సంచలన కేసుల దర్యాప్తును ఆయన విజయవంతంగా పర్యవేక్షించారు. ఉద్యోగ విరమణ తర్వాత రాజకీయరంగ ప్రవేశం చేసి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మంత్రి పదవినీ అలంకరించారు. మార్చి 13న ఆయన మరణం ఎందరినో చింతాక్రాంతులను చేసింది.

– ఎస్. బాల్‌రెడ్డి,
మాజీ సహాయ సంపాదకులు, 'సురక్ష' మాస పత్రిక

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.తదియ రా.7.34 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** అశ్వని ప.3.51 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.55 నుండి 1.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.30 నుండి 9.16 వరకు తదుపరి ప.12.29 నుండి 1.19 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.43 నుండి 10.19 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.05, **సూర్యాస్తమయం:** 6.07.

క్లుప్తంగా...

ఈనెల 27న ఎమ్మెల్సీ కవిత పిటిషన్ విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ తనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 27న సుప్రీంకోర్టు విచారించనుంది. విచారణకు సంబంధించిన తదుపరి చర్యలపై స్టే ఇవ్వాలంటూ ఈ నెల 14న కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అనంతరం ఈ నెల 17న పిటిషన్ త్వరగా విచారించాలని సీజేఐ ధర్మాసనం ముందు కవిత తరఫు న్యాయవాది ప్రస్తావించారు. ఈ నెల 24న పిటిషన్‌ను విచారణ జాబితాలో చేర్చాలని ఆ సమయంలో సీజేఐ ఆదేశాలిచ్చారు. అయితే తాజాగా సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఈ నెల 27న విచారణ జాబితాలో కవిత పిటిషన్‌ను చేర్చింది. ఈనెల 27న సోమవారం జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించనుంది.

ఇంటర్ ఆన్‌లైన్ మూల్యాంకన టెండర్ ఖరారు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ సమాధాన పత్రాలకు ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టేందుకు బోర్డు నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇందుకు సంబంధించిన టెండర్‌ను అధికారులు ఖరారు చేశారు. రెండోసారి నిర్వహించిన బిడ్డింగ్‌లో కోసైన్ అనే సంస్థ ఎల్–1గా నిలిచింది. బోర్డు నిర్ణయాన్ని ప్రభుత్వానికి పంపామని.. అక్కడి నుంచి పాలనాపరమైన అనుమతులు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. టెండర్ పొందిన సంస్థ అందించే సాఫ్ట్‌వేర్ సాయంతో అధికారులు ఇంటర్ సమాధాన పత్రాలను స్కాన్ చేసి మూల్యాంకనం చేపట్టే అధ్యాపక నిపుణులకు ఆన్‌లైన్ ద్వారా పంపనున్నారు. మూల్యాంకనం తర్వాత వారు ఆన్‌లైన్ ద్వారానే మార్కులు ఫీడ్ చేయనున్నారు. ఈ విధానం వల్ల మూల్యాంకన ప్రక్రియ త్వరగా జరగడంతో పాటు రీవాల్యూయేషన్ ప్రక్రియ కూడా అతితక్కువ సమయంలో పూర్తిచేసుకొనే వెసులుబాటు ఉంటుంది.

కొత్తగా 20 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం 4,422 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 20 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.42 లక్షలకు చేరింది. ప్రస్తుతం 146 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా.. 27 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఎంసెట్ పేపర్లకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ

టీఎస్‌పీఎస్సీ లీకేజ్ నేపథ్యంలో సాంకేతిక భద్రత

- పాస్‌వర్డ్స్, సర్వర్లపై పటిష్టమైన నిఘా
- ఎవరి అధీనంలో సమాచారం ఉండాలి?
- ఎవరెవరు బాధ్యత వహించాలి?
- ఉన్నత విద్యా మండలి అధికారుల తర్జన భర్జన
- స్పష్టతపై నిపుణులను సంప్రదిస్తున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా మే 7 నుంచి జరిగే ఎంసెట్ ప్రశ్నపత్రాలకు పటిష్టమైన సాంకేతిక భద్రత అవసరమని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో ఈ తరహా అభిప్రాయానికొచ్చారు. దీనికోసం అత్యంత పటిష్టమైన బ్లాక్‌చైన్ టెక్నాలజీ భద్రత వ్యవస్థను కల్పించే యోచనలో ఉన్నారు. దీనితోపాటే ఎంసెట్ పేపర్ రూపకల్పన, వాటిని కంప్యూటర్లు, సర్వర్లలో నిక్షిప్తం చేసిన విధానాలపై నిపుణులతో కలిసి అధికారులు లోతైన సమీక్షకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటి వరకూ పేపర్ తయారీలో ముఖ్యపాత్ర పోషించిన వ్యక్తులు, సాంకేతిక నిపుణుల వివరాలను క్రోడీకరిస్తున్నారు. ఇదే కోణంలో పేపర్లను భద్రత పరిచిన తర్వాత సంబంధిత సర్వర్లు, కంప్యూటర్లను ఎవరైనా వినియోగించారా? అనే కోణంలో సమాచార సేకరణకు సిద్ధమవుతున్నారు. ఎంసెట్‌కు ప్రశ్నపత్రాల సర్వర్లకు సంబంధించిన ప్రతీ ఐపీ అడ్రస్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, నివేదిక రూపొందించే పనిలో ఉన్నారు.


ఎలాంటి తప్పిదాలు జరగకూడదు

ఇతర రాష్ట్రాలతో సహా రాష్ట్రానికి చెందిన మొత్తం 2.50 లక్షల మంది ఎంసెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం ఉన్నత విద్యా మండలికి స్పష్టం చేసినట్టు తెలిసింది. మేఘాలయాలో జరుగుతున్న అఖిల భారత విశ్వవిద్యాలయాల సమావేశంలో ఉన్న రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఎంసెట్ నిర్వహిస్తున్న జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి ఎంసెట్ భద్రతపై సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించినట్టు తెలిసింది.

ముట్టుకున్నా 'బ్లాక్'అలారం..

ఎంసెట్ పేపర్ల భద్రతకు వాడబోతున్న బ్లాక్ చైన్ టెక్నాలజీ అత్యంత శక్తివంతమైందని నిపుణులు చెబుతున్నారు. ఒకసారి దీన్ని సర్వర్లకు, కీలకమైన కంప్యూటర్ డివైస్‌కు అనుసంధానం చేస్తే ఏ ఇతర వ్యక్తి ముట్టుకున్నా తక్షణమే కీలకమైన వ్యక్తులకు సంకేతాలిస్తుంది. ఇప్పటి వరకూ డివైజ్‌లోకి ఎవరెవరు? ఏ ఐపీ అడ్రస్‌తో వెళ్ళారనే రహస్య సమాచారం అందిస్తుంది. కంప్యూటర్ సైన్స్‌లో క్రిప్టోగ్రఫీ విధానంలో పనిచేసే బ్లాక్‌చైన్ టెక్నాలజీని ఇప్పటికే అనేక దేశాలు వాడుతున్నట్టు నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎంసెట్ పేపర్లకు బాధ్యులెవరు? ఏయే సమయాల్లో వాళ్ళు డివైజ్‌లోకి వెళ్ళాలి? అనేదానిపై ముందే స్పష్టత ఉంటుంది. ఇది బ్లాక్‌చైన్ టెక్నాలజీ మెమోరీలో నిక్షిప్తమై ఉంటుంది. ఆయా సమయాల్లో ఆయా వ్యక్తులు ప్రవేశించినా, అందుకు భిన్నంగా వెళ్ళినా తేలికగా ముందే గుర్తించడం ఈ సాంకేతికత ప్రత్యేకగా చెబుతున్నారు. అత్యంత రహస్యమైన వ్యవస్థను అంతకంటే రహస్యంగా భద్రతపర్చడమే కాకుండా, హ్యాక్ చేసే ప్రయత్నాలను అడ్డుకునే విధానం ఇందులో ఉందని చెబుతున్నారు. దీన్ని పక్కాగా నిర్వహించగల నమ్మకమైన వ్యక్తుల గురించి అధికారులు జల్లెడ పడుతున్నారు. అంతేకాకుండా పాస్‌వర్డ్స్, సమాచార ప్రవేశం ఎవరెవరికి ఏ మేర ఇవ్వాలనే విషయాలపై స్పష్టతకు రావాలనే ఆలోచనలో ఉన్నారు. దీనివల్లే ఏం జరిగినా వారినే బాధ్యులను చేయవచ్చని చెబుతున్నారు.

ప్రత్యేక భద్రతపై పరిశీలిస్తున్నాం



ఎంసెట్ ప్రశ్నపత్రాలకు పూర్తి భద్రత కల్పించే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఉన్నత విద్యా మండలితో కలిసి ఈ విషయంలో చర్చలు జరుపుతాం. మేఘాలయ వీసీల సమావేశంలో ఉన్నప్పటికీ కీలకమైన ఈ అంశంపై దృష్టి పెట్టాం. ఎలాంటి భద్రత చర్యలు తీసుకున్నదీ త్వరలో వివరిస్తాం.

ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి
(వీసీ జేఎన్‌టీయూహెచ్)

ఎన్‌క్రిప్షన్ కూడా అవసరమే



ఎంసెట్ వంటి కీలకమైన ప్రశ్నపత్రాలకు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భద్రత మంచిదే. దీంతో పాటే, ఎన్‌క్రిప్షన్ విధానం అత్యంత ముఖ్యం. దీనివల్ల ప్రశ్నపత్రం ఎవరికైనా చిక్కినా ఏమీ అర్థంకాని భాషలో ఉంటుంది. దీన్ని కేవలం వ్యాల్యూడ్ యూజర్ మాత్రమే డీకోడ్ చేయడం సాధ్యం. క్రిప్టోగ్రఫీ భాషా విధానంతో దీన్ని రూపొందించారు. విశ్వసనీయమైన వ్యక్తులకు అధికారం ఇచ్చిన ఈ టెక్నాలజీని వాడుకుంటే పేపర్ లీక్ వంటి ఘటనలకు ఆస్కారమే ఉండదు.

ప్రొఫెసర్ ఎస్ రామచంద్రన్
(వీసీ, అనురాగ్ యూనివర్సిటీ, సైబర్‌క్రైం ఫ్యాకల్టీ నిపుణులు)

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులివ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేటు కాలేజీల మొర



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ప్రైవేటు కాలేజీల నిర్వహణ కష్టంగా ఉందని ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌరీసతీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఇక్కడి సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు స్థాపించిన కాలేజీలపట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. తమ కాలేజీల్లో 9.40 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. 2021–22 సంవత్సరానికి రూ.86.55 కోట్లు ట్రెజరీకి విడుదలైనా ప్రైవేట్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వలేదని, 2022–23 సంవత్సరానికి రూ.226 కోట్లు ఇంకా విడుదల చేయలేదన్నారు. దీనివల్ల అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతులులేవని వేధించే ప్రభుత్వం, తమకు రావాల్సిన బకాయిలు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. గడచిన ఎనిమిదేళ్లలో కాలేజీలపై వివిధ రకాల ఫీజులను 10 నుంచి 50 శాతం పెంచారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మాత్రం ఆ నిష్పత్తిలో పెంచలేదన్నారు. ఈ నెలాఖరులోగా ప్రభుత్వం తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సంఘం నేతలు ఇంద్రసేనరెడ్డి, ఉస్మాన్, ఎస్ఎన్ రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ అనుబంధం నిరంతరం

- కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని బూరుగిద్ద గ్రామం కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఉంటుంది. 13 కుటుంబాలు 1987లో 29 గుంటల భూమిని కొని ఇండ్లు నిర్మించుకున్నాయి. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత కొందరు ఆ ఊరి భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ భూమి తమదని, ఖాళీ చేసి వెళ్లిపోవాలని.. లేకుంటే ఇళ్లు కూల్చేస్తామని బెదిరింపులకు దిగారు. బాధిత కుటుంబాలు 'సాక్షి'ని ఆశ్రయించాయి.

✔ 2020 డిసెంబర్ 21న సాక్షి మెయిన్ పేజీలో 'ఊరినే అమ్మేశారు'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ శరత్ బూరుగిద్ద గ్రామానికి ఆర్డీవోను పంపి విచారణ చేయించారు. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, ఆ భూమిని ఆబాదీ కింద మార్చారు. 13 కుటుంబాలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించారు. ఈ కథనాన్ని డిగ్రీ మూడో సంవత్సరం తెలుగు పుస్తకంలో పాఠ్యాంశంగా కూడా చేర్చడం గమనార్హం. తమ గ్రామ ఉనికికే ప్రమాదం కలిగే పరిస్థితుల్లో అండగా నిలిచిన 'సాక్షి'కి రుణపడి ఉంటామని ఇక్కడి కుటుంబాలు చెప్తున్నాయి.


చిన్న పల్లె 'బూరుగిద్ద' గోస

ఊరినే అమ్మేశారు!

- సాక్షి, కామారెడ్డి

- సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన కొత్వాల్ శ్రీనివాస్ కరోనా మహమ్మారి బారిన పడి 2021 మే 26న కన్నుమూశాడు. వారు అద్దెకున్న ఇంటి యజమాని కరోనా భయంతో శ్రీనివాస్ కుటుంబాన్ని ఇంట్లోంచి పంపించేశాడు. చేసేదేమీ లేక.. ఎవరూ చేరదీయక.. శ్రీనివాస్ భార్య సుజాత, ఇద్దరు చిన్నపిల్లలతో రెండు రోజుల పాటు శ్మశానంలోనే గడిపింది. విషయం తెలుసుకున్న 'సాక్షి' ప్రతినిధులు వెళ్లి వారిని కలిశారు. వారి బాధకు 'శ్మశానమే ఆవాసం' శీర్షికన ప్రత్యేక కథనంగా అక్షర రూపమిచ్చారు.

✔ మే 29న ప్రచురితమైన ఆ కథనంపై ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు వెంటనే స్పందించారు. మే 29న సాయంత్రం అధికారులు, మంత్రి వ్యక్తిగత సిబ్బందిని శ్మశానం వద్దకు పంపించారు. బాధిత కుటుంబానికి పట్టణంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో 127వ బ్లాక్‌లో 7 నంబర్ ఇంటిని కేటాయించి.. నెల రోజులకు సరిపడా నిత్యావసరాలు, వంట సరుకులను అందించారు. 'సాక్షి' కథనంతో స్పందించిన నాయీ బ్రాహ్మణ లాయర్స్ అసోసియేషన్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. 'సాక్షి' అందించిన సాయం ఎంతో గొప్పదని, దీనిని జీవితంలో మరవలేమని సుజాత చెప్తున్నారు.

శ్మశానమే ఆవాసం



- ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట)

బడిపిల్లల సాహిత్యానికి రాష్ట్రస్థాయి పురస్కారం



సిరిసిల్ల కల్చరల్: పసివయసులోనే సాహిత్య అభిలాష పెంచేందుకు జరిగిన ప్రయత్నానికి మంచి ప్రోత్సాహం లభించింది. జిల్లాకేంద్రానికి చెందిన బడిపిల్లలు వెలువరించిన 'సిరిసిల్ల సిరిమల్లెలు'పుస్తకానికి రాష్ట్రస్థాయి పురస్కారం వరించింది. శివనగర్‌లోని కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చిన్నారులు కథలు, కవితలు, కథానికలు, వ్యాసాల రూపాల్లో రాసిన అంశాలన్నింటినీ పుస్తకంగా రూపొందించారు. పుస్తకాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించి చిన్నారులు ఆశీర్వదించారు. తాజాగా ఈ సాహిత్యసంపుటికి రాష్ట్రస్థాయి చింతోజు బ్రహ్మయ్య బాలమణి స్మారక పురస్కారం వరించింది. ఉత్తమ కవితాసంకలనం విభాగంలో 'సిరిమల్లెలు'ఎంపికైందని పురస్కార కమిటీ జ్యూరీ సభ్యులు డాక్టర్ చింతోజు రాజారాం, శంకర్, నారాయణ, ప్రొఫెసర్ మారోజు దేవేంద్ర ప్రకటించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పరబ్రహ్మమూర్తి, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ చిన్నారులను అభినందించారు.

క్లుప్తంగా

అత్యుత్తమ వంటకాల జాబితాలో...
షాహీ పనీర్, దాల్, కుర్మా!



న్యూయార్క్: ప్రపంచంలోని అత్యుత్తమ వంటకాల జాబితాలో భారత్ నుంచి ఏకంగా ఎనిమిది వెరైటీలకు చోటు దక్కింది. టాప్-50 వంటకాల్లో షాహీ పనీర్ ఐదో స్థానంలో నిలిచింది. కీమాకు పదో స్థానం, చికెన్ కుర్మాకు 16, దాల్‌కు 26, గోవా వంటక విందాలూకు 31, వడా పావ్‌కు 39, దాల్ తడ్కాకు 40వ స్థానం లభించాయి. అయితే, 38 స్థానం దక్కిన ప్రపంచ ప్రఖ్యాత భారతీయ వంటకం చికెన్ టిక్కాను బ్రిటిష్ వంటకంగా పేర్కొనడం విశేషం! ప్రపంచ ప్రఖ్యాతి పొందిన పలువురు వంట నిపుణుల పర్యవేక్షణలో ప్రఖ్యాత ఫుడ్ గైడ్ టేస్ట్ అట్లాస్ ఈ జాబితాను రూపొందించింది. థాయ్‌లాండ్ వంటకం హానెంగ్ అగ్రస్థానంలో నిలిచింది. సింగపూర్ వంటకం సిచువాన్, చైనాకు చెందిన హాట్‌పాట్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాలుగు రాష్ట్రాలకు బీజేపీ గురువారం కొత్త అధ్యక్షులను నియమించింది. రాజస్థాన్‌కు ఎంపీ సి.పి.జోషి, బీహార్‌కు ఓబీసీ నాయకుడు, ఎమ్మెల్సీ సమ్రాట్ చౌధరి, ఒడిశాకు మాజీ మంత్రి మన్మోహన్ సమాల్, ఢిల్లీకి వీరేంద్ర సచదేవ్‌ను అధ్యక్షులుగా నియమించింది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ మేరకు ప్రకటించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలున్న రాజస్థాన్‌లో జోషి నియామకాన్ని నేతలు స్వాగతిస్తున్నారు.

తెలంగాణ, బెంగాల్ సహా 9 రాష్ట్రాలు సీబీఐకి నో

న్యూఢిల్లీ: తెలంగాణ, పశ్చిమబెంగాల్, రాజస్తాన్ సహా 9 రాష్ట్రాలు సీబీఐకి కేసుల దర్యాప్తులో సాధారణ అంగీకారాన్ని ఉపసంహరించుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఆ రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మేఘాలయ, మిజోరం, పంజాబ్, రాజస్తాన్, తెలంగాణ, పశ్చిమబెంగాల్ అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభకు లిఖితపూర్వకంగా వెల్లడించారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీఎస్‌పీఈ) చట్టం -1946లోని సెక్షన్-6 ప్రకారం..సీబీఐ కొన్ని రకాల కేసుల దర్యాప్తునకు ముందుగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

'దొంగల ఇంటి పేరు మోదీ' వ్యాఖ్యలపై...
రాహుల్‌కు రెండేళ్ల జైలు

పరువు నష్టం కేసులో దోషిగా తేల్చిన సూరత్ కోర్టు | **అప్పీల్‌కు అనుమతి, నెలపాటు శిక్ష నిలిపివేత** | **ఇప్పటికిప్పుడు అనర్హత వేటు పడదు: నిపుణులు**

సూరత్/ఢిల్లీ: 'దొంగలందరి ఇంటిపేరు ఎందుకు మోదీయే ఉంటుంది?' అంటూ వ్యాఖ్యలు చేసిన కేసులో కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీకి గుజరాత్‌లోని సూరత్ కోర్టు గురువారం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఐపీసీ సెక్షన్లు 499, 500 కింద రాహుల్‌ను దోషిగా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్.హెచ్.వర్మ నిర్ధారించారు. ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష ఖరారు చేసిన అనంతరం బెయిల్ మంజూరు చేశారు. పై కోర్టులో అప్పీలుకు వీలుగా జైలు శిక్షను 30 రోజులపాటు నిలిపేస్తున్నట్లు వెల్లడించారు. తీర్పు వెలువరించిన సమయంలో రాహుల్ కోర్టులోనే ఉన్నారు. ''ఈ కేసులో దోషి పార్లమెంట్ సభ్యుడు. ఆయన ఏం మాట్లాడినా అది దేశ ప్రజలపై ప్రభావం చూపిస్తుంది. అందుకే కేసు తీవ్రత పెరిగింది. దోషికి తక్కువ శిక్ష విధిస్తే ప్రజలకు తప్పుడు సంకేతం పంపించినట్లు అవుతుంది. ఎవరైనా ఇతరులను ఇష్టారాజ్యంగా దూషించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. 'చౌకీదార్ చోర్ హై' అంటూ చేసిన వ్యాఖ్యలపై నమోదైన కేసులో రాహుల్ గతంలో క్షమాపణ చెప్పారు. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని అప్పట్లో సుప్రీంకోర్టు ఆయనకు సూచించింది. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు కనిపించడం లేదు'' అని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది.



గురువారం సూరత్ కోర్టుకు వస్తున్న రాహుల్ గాంధీ

కించపర్చే ఉద్దేశం లేదు

విచారణ సందర్భంగా రాహుల్ తన వాదన వినిపించారు. తనకు ఎవరిపైనా ఎలాంటి వివక్ష లేదని, దేశ ప్రజలందరినీ అభిమానిస్తానని చెప్పారు. ఎవరినీ కించపర్చే ఉద్దేశం లేదన్నారు. ''ప్రజాప్రయోజనాల కోణంలోనే ఎన్నికల ప్రచారంలో ప్రసంగించా. అది నా విధి'' అని తెలిపారు. ఈ కేసులో ఫిర్యాదుదారుకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, నిందితుడు గతంలో ఏ కేసులోనూ దోషిగా తేలలేదని, ఎవరి నుంచీ క్షమాభిక్ష కోరలేదని, ఆయనకు తక్కువ శిక్ష విధించాలని రాహుల్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ వాదనను ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది ఖండించారు. రాహుల్‌ను గతంలో సుప్రీంకోర్టు మందలించిందని గుర్తుచేశారు. ప్రాసిక్యూషన్ వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది.

చట్టప్రకారం పోరాడతాం: కాంగ్రెస్

సూరత్ కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అప్పీల్ దాఖలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ''పిరికిపంద, నిరంకుశ బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై, ప్రతిపక్షాలపై కక్షగట్టింది. ప్రభుత్వ అరాచక పాలనను ప్రశ్నిస్తున్నందుకు, అదానీపై అంశంపై జేపీసీ నియమించాలని డిమాండ్ చేస్తున్నందుకు మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటోంది. రాజకీయ ప్రసంగాలపై కేసులు పెట్టడం చాలా దారుణం. ఒక వేలు ఇతరుల వైపు చూపిస్తే నాలుగు వేళ్లు తమవైపే చూపిస్తాయని బీజేపీ నేతలు తెలుసుకోవాలి. ఇలాంటిది ఏదో జరుగుతుందని ముందే ఊహించాం. న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. చట్ట ప్రకారమే పోరాడుతాం'' అని ఖర్గే స్పష్టం చేశారు.

రాహుల్ భయపడే ప్రసక్తే లేదు: ప్రియాంక

తన సోదరుడు రాహుల్ గొంతును నొక్కేయడానికి మోదీ ప్రభుత్వం సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా మండిపడ్డారు. రాహుల్ గతంలో ఏనాడూ భయపడలేదని, భవిష్యత్తులోనూ భయపడే ప్రసక్తే లేదని చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సత్యమే మాట్లాడుతాడని ట్వీట్ చేశారు. దేశ ప్రజల కోసం గొంతెత్తుతూనే ఉంటారని పేర్కొన్నారు.

అమిత్ షాకు సమన్లు ఇవ్వండి
సీబీఐ డైరెక్టర్‌కు జైరాం రమేశ్ లేఖ

న్యూఢిల్లీ: ''మేఘాలయలో కాన్రాడ్ సంగ్మా సర్కారు దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వమని ఆరోపించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సమన్లు జారీ చేయండి. అవినీతికి సబంధించిన వివరాలు ఆయన నుంచి సేకరించండి'' అని సీబీఐని కాంగ్రెస్ పార్టీ కోరింది. పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ మేరకు సీబీఐ డైరెక్టర్ సుబోధ్ జైస్వాల్‌కు లేఖ రాశారు. ''సంగ్మా ప్రభుత్వ అవినీతి గురించి తెలిసే షా ఆరోపణలు చేశారు. దానిపై చర్యల నిమిత్తం వివరాలు సేకరించండి'' అని కోరారు.

ఏమిటీ కేసు?

2019 ఏప్రిల్ 13న కర్ణాటకలోని కోలార్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ ప్రధాని మోదీపై ఆరోపణలు గుప్పించారు. 'దొంగలందరి ఇంటి పేరు ఎందుకు మోదీయే ఉంటుంది?' అని అన్నారు. మోదీ సామాజికవర్గం పరువుకు రాహుల్ నష్టం కలిగించారంటూ గుజరాత్‌లోని సూరత్ వెస్ట్ బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పూర్ణేశ్ మోదీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాహుల్ విజ్ఞప్తి మేరకు విచారణ సూరత్‌లో జరగకుండా విధించిన స్టేను గుజరాత్ హైకోర్టు గత ఫిబ్రవరిలో తొలగించింది.

సత్యమే నా మార్గం: రాహుల్

సూరత్ కోర్టు తీర్పుపై రాహుల్ గాంధీ స్పందించారు. ''సత్యం, అహింసపైనే నా మతం ఆధారపడి ఉంటుంది. సత్యమే నా దైవం. ఆ దైవాన్ని చేరుకొనే మార్గమే అహింస'' అంటూ మహాత్మాగాంధీ చెప్పిన సూక్తిని ట్వీట్ చేశారు. స్వాతంత్య్ర యోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పించారు. సత్యం, ధైర్యసాహసాలే ఆలంబనగా మాతృదేశం కోసం నిర్భయంగా పోరాడడాన్ని ఆ మహనీయుల నుంచి నేర్చుకున్నామన్నారు.

క్షమాపణ చెప్పాలి: బీజేపీ

రాహుల్ గాంధీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఇతరులను దూషిస్తే శిక్ష తప్పదని చెప్పారు. రాహుల్‌కు జైలుశిక్ష విధించడంపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఎవరినైనా దూషించడానికి రాహుల్‌కు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కాంగ్రెస్ కోరుకుంటోందా? అని ప్రశ్నించారు. ఇతరుల పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ డిమాండ్ చేశారు.

రాహుల్‌కు కేజ్రీవాల్ మద్దతు

రాహుల్‌ను పరువు నష్టం కేసులో ఇరికించడం దారుణమని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. రాహుల్‌కు మద్దతు ప్రకటించారు. బీజేపీయేతర నాయకులు, పార్టీలపై కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ ట్వీట్ చేశారు. వారిని కేసుల్లో ఇరికించడం ద్వారా నిర్మూలించడమే ఉద్దేశమన్నారు.

అనర్హత వేటు పడుతుందా?

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడిన రాజకీయ నాయకుడిపై శిక్ష ఖరారైన తేదీ నుంచి మిగిలిన పదవీ కాలమంతా అనర్హత వేటు పడుతుంది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడవుతాడు. అయితే, అనర్హత వేటు వెంటనే పడదని సుప్రీంకోర్టు లాయర్ మహేష్ జెఠ్మలానీ చెప్పారు. ప్రజాప్రతినిధ్య చట్టం ప్రకారం మూడు నెలల గడువు ఇవ్వొచ్చని తెలిపారు. ఈ సమయంలో నేరారోపణ లేదా శిక్షపై అప్పిలేట్ కోర్టు స్టే ఇస్తే అప్పీల్‌పై విచారణ ముగిసే దాకా అనర్హత వేటు కూడా ఆగిపోతుందని వివరించారు. మూడు నెలల్లోగా నేరారోపణ లేదా శిక్ష రద్దు కాకపోతే దోషిపై అనర్హత వేటు వేయొచ్చని పేర్కొన్నారు. శిక్షను రద్దు చేసే అధికారం శిక్ష విధించిన కోర్టుకు కాకుండా అప్పిలేట్ కోర్టుకే ఉంటుందన్నారు. రాహుల్ గాంధీకి విధించిన జైలు శిక్షను అప్పిలేట్ కోర్టు రద్దు చేయొచ్చని, అదే జరిగితే అప్పీల్‌పై విచారణ ముగిసేదాకా ఆయనపై ఎంపీగా అనర్హత వేటు వేసే అవకాశం లేదని మహేష్ జెఠ్మలానీ వెల్లడించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం కింద అనర్హత వేటు నుంచి తప్పించుకోవాలంటే శిక్షను అప్పిలేట్ కోర్టు రద్దు చేయడమో లేదంటే నేరారోపణపై స్టే విధించడమో జరగాలని సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది చెప్పారు. రాహుల్ గాంధీకి అప్పిలేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని అన్నారు. 2013 నాటి లిలీ థామస్, 2018 నాటి లోక్ ప్రహరి కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను ఆయన గుర్తుచేశారు. ప్రజాప్రతినిధుల శిక్ష రద్దయితే అనర్హత వేటు కూడా రద్దవుతుందని అప్పట్లో న్యాయస్థానం తేల్చిచెప్పిందని వివరించారు.

పోలీసు బూట్ల కింద నలిగి నవజాత శిశువు మృతి
ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

రాంచీ: జార్ఖండ్ రాష్ట్రం గిరిడిహ్ జిల్లాలో సోదాల సమయంలో పోలీసుల బూట్ల కింద నలిగి శిశువు చనిపోయిన ఘటన తీవ్ర సంచలనం కలిగిస్తోంది. ఘటనకు సంబంధించి ఆరుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. దియోరీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. కొషాడింఘి గ్రామానికి చెందిన భూషణ్ పాండేతోపాటు, మరో వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు బుధవారం వేకువజామున 3.20 గంటల సమయంలో అతడి ఇంటికి వెళ్లారు. మూసి ఉన్న తలుపులను పోలీసులు బలవంతంగా తెరిచి లోపలికి ప్రవేశించినట్లు పాండే ఆరోపించాడు. లోపలికొచ్చిన పోలీసులు నాలుగు రోజుల వయస్సున్న తన మనవడిని బూటు కాళ్లతో తొక్కారని, శిశువు అక్కడికక్కడే చనిపోయాడని అన్నాడు. పాండే ఆరోపణలతో కూడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. మెజిస్ట్రేట్ సమక్షంలో శిశువు మృతదేహానికి పోస్టుమార్టం చేయించామని ఎస్పీ అమిత్ రేణు చెప్పారు. బూటుకాలితో గట్టిగా తొక్కడంతో శిశువు ప్లీహం ఛిద్రమైనట్లు తేలిందన్నారు. ఇందుకు సంబంధించి ఆరుగురు పోలీసులపై కేసులు నమోదు చేసి, సస్పెన్షన్ వేటు వేశామన్నారు. దోషులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బర్త్ కంట్రోల్ మాత్రలతో బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు!

న్యూఢిల్లీ: హార్మోనల్ గర్భనిరోధక మాత్రల వాడకంతో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ముప్పు స్వల్పంగా పెరుగుతున్నట్లు యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లోని యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ అధ్యయనంలో వెల్లడయ్యింది. అన్ని రకాల హార్మోనల్ కాంట్రాసెప్టివ్ పిల్స్‌తో ఈ ముప్పు ఉన్నట్లు తేలింది. ఈ అధ్యయనం వివరాలను 'ప్లస్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురించారు. గర్భనిరోధక మాత్రల వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు 20 శాతం నుంచి 30 శాతం దాకా పెరుగుతున్నట్లు గుర్తించామని పరిశోధకులు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లతో కూడిన గర్భనిరోధక మాత్రల వినియోగం అధికంగా ఉంది. ఈ రెండు హార్మోన్లతో కూడిన మాత్రల వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ తలెత్తే అవకాశం ఉన్నట్లు గతంలోనే తేలినా, కేవలం ప్రొజెస్టిరాన్ ఉన్న మాత్రల వల్ల కూడా ఈ ముప్పు ఉన్నట్లు స్పష్టంగా వెల్లడి కావడం ఇదే ప్రథమం.

ఐఎన్ఎస్ మాజీ అధ్యక్షుడు చాజ్‌లానీ కన్నుమూత

న్యూఢిల్లీ: ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) మాజీ అధ్యక్షుడు అభయ్ చాజ్‌లానీ కన్నుమూశారు. పత్రికా రంగంలో ఆయన దశాబ్దాలపాటు విశేషమైన సేవలు అందించారు. 2009లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. చాజ్‌లానీ మృతిపట్ల ఐఎన్ఎస్ అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి సంతాపం ప్రకటించారు. మీడియా రంగం అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

పర్యాటక వీసాతోనూ ఉద్యోగ దరఖాస్తులు: అమెరికా
నిరుద్యోగ భారత టెకీలకు భారీ ఊరట

వాషింగ్టన్: మాంద్యం దెబ్బకు అమెరికాలో ఉద్యోగం కోల్పోయి కొత్త కొలువు దొరక్క దేశం వీడాల్సి వస్తుందేమోనని ఆందోళన పడుతున్న హెచ్-1బీ వీసాదారులకు, ముఖ్యంగా భారత టెకీలకు భారీ ఊరట! బిజినెస్ (బి-1), పర్యాటక (బి-2) వీసాదారులు కూడా అమెరికాలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఇంటర్వ్యూలకూ హాజరు కావచ్చని ఆ దేశ పౌరసత్వ, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) పేర్కొంది. ''అమెరికాలో ఉద్యోగం కోల్పోయిన వారు 60 రోజుల్లోపు మరో ఉద్యోగం చూసుకోలేని పక్షంలో అమెరికా వీడటం తప్ప మరో మార్గంలేదనే అపోహలో ఉన్నారు. మరింత కాలం దేశంలో ఉండేందుకు వారికి పలు మార్గాలున్నాయి. 60 రోజుల్లోపు వీసా స్టేటస్‌ను (బి-1, బి-2కు) మార్చుకుంటే ఆ గ్రేస్ పీరియడ్ ముగిశాక కూడా అమెరికాలో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలను కొనసాగించుకోవచ్చు'' అని వివరించింది. అయితే ఉద్యోగం దొరికాక అందులో చేరేలోపు వీసా స్టేటస్‌ను తదనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఈ విషయమై పలువురు వెలిబుచ్చిన పలు సందేహాలకు సమాధానంగా సంస్థ ఈ మేరకు ట్వీట్ చేసింది. బి-1 వీసాను స్వల్పకాలిక బిజినెస్ ప్రయాణాలకు, బి-2ను ప్రధానంగా పర్యాటక అవసరాలకు అమెరికా జారీ చేస్తుంటుంది. మాంద్యం దెబ్బకు అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా పలు దిగ్గజ కంపెనీలు వేలాదిగా ఉద్యోగులను తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఇలా గత నవంబర్ నుంచి అమెరికాలోనే 2 లక్షల మందికి పైగా నిరుద్యోగులయ్యారు. వీరిలో కనీసం లక్ష మంది భారతీయులేనని అంచనా!

ఎజెండా ఇదీ ...

- పంజాబ్ సమాజాన్ని మతం ఆధారంగా విడదీయడమే అమృత్‌పాల్ సింగ్ ప్రధాన ఎజెండా. ఉత్తరప్రదేశ్, బిహార్ నుంచి రాష్ట్రానికి వచ్చే నిరుపేదలైన కూలీలపై స్థానికుల్లో వ్యతిరేకత పెంచి అగ్గిరాజేయాలని చూసినట్టుగా పోలీసులు చెబుతున్నారు.
- విదేశీ సంస్థల నుంచి అందిన నిధులతో అక్రమంగా ఆయుధాలను కొనుగోలు చేసి పంజాబ్ యువతలో గన్ కల్చర్ పెంచడానికి కూడా ప్రణాళికలు రూపొందించాడు.
- పంజాబ్‌లో అనిశ్చితి రేపడానికి ఆనందపూర్ ఖల్సా ఫౌజ్ (ఏకేఎఫ్) పేరుతో ఒక ప్రైవేటు ఆర్మీని రూపొందించాడు. అందులో ఎక్కువ మంది నేరచరితులే. ఐఎస్ఐ ఆర్థిక సాయంతో అందరికీ ఆయుధాలు, వాహనాలు కొనుగోలు చేశాడు.
- డ్రగ్స్‌కు బానిసలైన వారిని, మాజీ సైనికాధికారులపై వలవేసి వారితో ఒక ఉగ్రవాద సంస్థ నెలకొల్పాలని ప్రయత్నించాడు. దుబాయ్ నుంచి వచ్చాక జల్లూపూర్ కెహ్రా గ్రామంలో డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్‌ని నెలకొల్పాడు.
- డ్రగ్ డీ ఎడిక్షన్ సెంటర్‌కి తీసుకువచ్చిన వారు ఆరోగ్యం బాగయ్యాక వారిస్ పంజాబ్ దే సంస్థలో చేరి ఎలాంటి విధ్వంసం రేపడానికైనా సిద్ధంగా ఉండాలి. అలా చేయలేనివారిని శారీరకంగా హింసించేవారని పోలీసుల విచారణలో తేలింది.

అమృత్‌పాల్‌పైనున్న కేసులు

వారిస్ పంజాబ్ దే చీఫ్ అమృత్‌పాల్ సింగ్ మొత్తం ఆరు క్రిమినల్ కేసుల్ని ఎదుర్కొంటున్నాడు. వాటిలో పోలీసు అధికారులపై హత్యాయత్నం, దాడి కేసులున్నాయి.

- ఫిబ్రవరి 16 : అమృత్‌పాల్‌పై కిడ్నాప్, దాడి కేసు నమోదు
- ఫిబ్రవరి 22 : విద్వేషాలు రెచ్చగొడుతున్నాడంటూ కేసు
- ఫిబ్రవరి 22 - యువతలో అసహనం నింపుతున్నాడని కేసు
- ఫిబ్రవరి 23 - అమృత్‌పాల్, అతని సాయుధ అనుచరులు పోలీసు అధికారులపై దాడులు, హత్యాయత్నం కేసులు
- మార్చి 18 : ఆయుధాల చట్టం కింద కేసు నమోదు
- మార్చి 19 : ర్యాష్ డ్రైవింగ్ చేసినందుకు జలంధర్‌లో కేసు



దుబాయ్‌లో డ్రైవర్‌గా పని చేసే అమృత్‌పాల్ సింగ్ రాత్రికి రాత్రే సిక్కు మత ప్రబోధకుడిగా వేషం మార్చడం వెనుక పాకిస్తాన్ ఐఎస్ఐ హస్తం ఉందన్న అనుమానాలున్నాయి. దేశంలో మత ఘర్షణలు రేపి, శాంతిభద్రతల్ని విచ్ఛిన్నం చేయడానికే ఐఎస్ఐ అమృత్‌పాల్‌ను దుబాయ్ నుంచి పంజాబ్‌కు పంపిందని పోలీసులు చెబుతున్నారు. భారత్‌కు వచ్చిన ఆరు నెలల్లో ఖలిస్తానీ ఉద్యమం పేరుతో అమృత్‌పాల్ సింగ్ వార్తల్లో నిలిచాడు. యువతపై మతం మత్తుమందు జల్లి వారి అండదండలతో దేశంలో అశాంతి రేపడానికి పన్నాగాలు పన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. అమృత్‌పాల్ భారత్‌కు రావడానికి ముందు జార్జియాలో ఐఎస్ఐ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నాడని ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం ఉంది.

ఐఎస్ఐ ఆదేశాల మేరకే నడుచుకున్న అమృత్‌పాల్ సింగ్

పంజాబ్ యువతలో గన్ కల్చర్ పెంచడానికి పన్నాగాలు

డ్రగ్స్ బానిసలను డీ ఎడిక్షన్ సెంటర్‌లో చేర్పించి వారితో ప్రైవేటు ఆర్మీ

అమృత్‌పాల్ @ ఆ ఏడుగురు...
ఖలిస్తాన్ ఉద్యమం పేరుతో దేశంలో మతకల్లోలం

కిరణ్‌దీప్ కౌర్

అమృత్‌పాల్ సింగ్ భార్య. బ్రిటన్‌కు చెందిన ఎన్నారై. రివర్స్ మైగ్రేషన్ పేరు చెప్పి ఇతర దేశాల్లో ఉన్న ఖలిస్తాన్ సానుభూతిపరుల్ని తిరిగి పంజాబ్ తీసుకురావడానికే ఈమెను అమృత్‌పాల్ పెళ్లి చేసుకున్నట్టుగా తెలుస్తోంది. అమృత్‌పాల్‌కు వివిధ దేశాల నుంచి వచ్చే ఆర్థిక సాయానికి సంబంధించిన లెక్కలన్నీ ఆమెకే తెలుసు.

దల్జీత్ సింగ్ కల్సి

అమృత్‌సర్‌కు చెందిన దల్జీత్ సింగ్ కల్సి అమృత్‌పాల్‌కు ఫైనాన్షియర్. పాకిస్థాన్ నిఘా ఏజెన్సీ ఐఎస్ఐతో కల్సికి సంబంధాలున్నట్టుగా ఆరోపణలున్నాయి. ఐఎస్ఐకి అమృత్‌పాల్‌కి మధ్య సంధానకర్తగా పని చేస్తూ ఉంటాడు. ప్రస్తుతం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

పపల్‌ప్రీత్ సింగ్

అమృత్‌పాల్‌ను వెనుక నుంచి నడిపించేది ఇతనే. ఐఎస్ఐ ఆదేశాల మేరకే పపల్‌ప్రీత్ సింగ్ అమృత్‌సింగ్‌ను వెనుకుండి నడిపిస్తాడన్న వాదనలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పోలీసుల నుంచి పరారీ అవడానికి పపల్‌ప్రీత్ సింగ్ పూర్తిగా సహకరించాడు. వాహనాలు, వేషాలు మార్చడంలో సాయపడ్డాడు. అమృత్‌పాల్ బైక్‌పై వెళుతుండగా దానిని నడుపుతున్న వ్యక్తిని పపల్‌ప్రీత్‌గా పోలీసులు గుర్తించారు. ఐఎస్ఐతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న పపల్‌ప్రీత్ సింగ్ పంజాబ్‌లో ఉద్రిక్తతల్ని సృష్టించడానికి పన్నాగాలు రచించాడు. ఖలిస్తాన్ డిమాండ్‌తో అల్లకల్లోలం సృష్టించాలని భావించాడు. పపల్‌ప్రీత్ సింగ్ సూచనల మేరకే అమృత్‌పాల్ సింగ్ తనని తాను సిక్కు మత ప్రబోధకుడిగా, ఒక సామాన్యుడిగా కనిపించే ప్రయత్నం చేశాడు.

భగవంత్ సింగ్

అమృత్‌పాల్ సింగ్‌కు కుడిభుజం. పంజాబ్‌లో అజ్నాలా పోలీసు స్టేషన్‌లో హింసాకాండకు భగవంత్ సింగ్ బాధ్యుడు. అమృత్‌పాల్ సింగ్‌కు మీడియా, సోషల్ మీడియా సమన్వయకర్తగా ఉన్నాడు. అమృత్‌సింగ్ పరారయ్యాక భగవంత్ సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు అతను సోషల్ మీడియా లైవ్‌లో వచ్చి తమ అనుచరుల్ని రెచ్చగొట్టే ప్రసంగం చేశాడు. దీంతో పోలీసులు అతని ఛానెల్స్ అన్నీ బ్లాక్ చేసి అదుపులోనికి తీసుకున్నారు. జాతీయ భద్రతా చట్టం కింద విచారిస్తున్నారు. ప్రస్తుతం అస్సాం దిబ్రూగఢ్ జైలులో ఉన్నాడు.

గుర్మీత్ సింగ్

అమృత్‌పాల్ సింగ్ అనుచరుల్లో మొట్టమొదట పోలీసులకు చిక్కినవాడు గుర్మీత్ సింగ్ . పోలీసులు అమృత్‌సింగ్‌పై వేట తీవ్రతరం చేశారని తెలిసిన వెంటనే అమృత్‌సర్ నుంచి తప్పించుకోవడానికి స్థానికంగా గుర్మీత్ సింగ్ అన్ని ఏర్పాట్లు చేశాడు. అరెస్టయిన గుర్మీత్ కూడా దిబ్రూగఢ్ జైల్లోనే ఉన్నాడు

లవ్‌ప్రీత్ తుఫాన్ సింగ్

వారిస్ పంజాబ్ దే సంస్థలో కీలక సభ్యుడు. అత్యంత చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తాడు. అమృత్‌పాల్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడని ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసిన నేరానికి పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. లవ్‌ప్రీత్‌ను బయటకి తీసుకురావడం కోసమే అమృత్‌పాల్ ఫిబ్రవరి 24న అజ్నాలా పోలీసు స్టేషన్‌లో విధ్వంసం సృష్టించాడు.

హర్‌జీత్ సింగ్

అమృత్‌పాల్ సింగ్‌కు మామ. ఖలిస్తానీ ఉద్యమానికి గట్టి మద్దతుదారుడు. పోలీసుల కన్నుగప్పి హర్‌జీత్ సింగ్ కారులోనే తొలుత పారిపోయాడు. ఆ తర్వాత హర్‌జీత్ పోలీసులకు లొంగిపోయారు. ఒకప్పుడు హర్‌జీత్ సింగ్ దుబాయ్‌లో రవాణా వ్యాపారంలో చేసేవాడు. అక్కడే అమృత్‌పాల్ కూడా మామతో కలిసి పనిచేశాడు. అక్కడ్నుంచి కెనడాకి మకాం మార్చాడు. గత నెలలోనే హర్‌జీత్ భారత్‌కు తిరిగి వచ్చాడు. అమృత్‌పాల్ దుబాయ్ నుంచి పంజాబ్‌కు వచ్చి ఖలిస్తానీ నాయకుడి అవతారం ఎత్తడం వెనుక హర్‌జీత్ ప్రభావం అధికంగా ఉంది.

సాక్షి, నేషనల్ డెస్క్

అదానీపై జేపీసీ వేయాల్సిందే
అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో పార్లమెంట్ మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలు, అదానీ గ్రూప్‌పై జేపీసీ డిమాండ్ అంశాలు గురువారం కూడా పార్లమెంట్‌ను కుదిపేశాయి. ఉదయం రాజ్యసభ మొదలు కాగానే బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అదానీ గ్రూప్ వ్యవహారంపై చర్చకు అనుమతి ఇవ్వాలంటూ నిబంధన 267 కింద ప్రతిపక్షాలు ఇచ్చిన 12 నోటీసులను ధన్‌ఖడ్ తిరస్కరించారు. దీంతో, ఎవరికి వారు నినాదాలతో సభను హోరెత్తించారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదావేశారు. తర్వాత అదే తీరు కొనసాగడంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది. లోక్‌సభలో కూడా రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల తర్వాత ఇస్తానని స్పీకర్ ఓం బిర్లా చెప్పినా నిరసనలు కొనసాగించారు. దాంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తర్వాతా ఇరు వర్గాలు గందరగోళం కొనసాగించడంతో సాయంత్రం 6 గంటల దాకా వాయిదా పడింది. మళ్లీ సమావేశమయ్యాక డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ అండ్ అప్రోప్రియేషన్ బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఆందోళనల మధ్యే స్పీకర్ గిలాటిన్‌ను ప్రయోగించి అన్నిశాఖల డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌ను ఓటింగ్‌కు పెట్టారు. 2023-24కు రూ.45 లక్షల కోట్ల బడ్జెట్‌కు మూడింట రెండొంతుల మెజారిటీతో సభ ఆమోదం తెలిపింది.

పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్షాల మార్చ్

అదానీ గ్రూపు అవకతవకలపై జేపీసీ వేయాలంటూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు పార్లమెంట్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద నిరసనకు దిగారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లారు. జేపీసీ వేసేదాకా ఆందోళనలు కొనసాగుతాయని ఖర్గే చెప్పారు.

టికెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.కోటి
దక్షిణ రైల్వే మహిళా టీసీ రికార్డు



చెన్నై: టికెట్ లేని ప్రయాణికుల నుంచి ఏకంగా రూ.1.03 కోట్ల జరిమానా వసూలు చేసి దక్షిణ రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ రోజలీన్ అరోకియా మేరీ రికార్డు సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. రైలులో ప్రయాణికుల టికెట్లు చెక్ చేస్తూ, జరిమానాలు వసూలు చేస్తున్న మేరీ ఫొటోను రైల్వే శాఖ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. విధుల పట్ల ఆమె అంకితభావాన్ని కొనియాడింది. ఈ పోస్ట్ వెంటనే వైరలయింది. నెటిజన్లు ఆమె నిబద్ధతపై ప్రశంసల వర్షం కురిపించారు. 'భారత్ మరింత శక్తివంతంగా ఎదగాలంటే ఇలాంటి అంకితభావం కలిగిన మహిళలు అవసరం. రోజలీన్‌కు అభినందనలు' అంటూ ఆమెను పొగిడారు.

హరియాణాకు అమృత్‌పాల్ పరారీ?

అమృత్‌సర్: ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు, ఆరు రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకొని తిరుగుతున్న అమృత్‌పాల్ సింగ్ సరిహద్దులు దాటి హరియాణాకు వెళ్లి ఉంటాడన్న అనుమానాలున్నాయి. ఈ విషయాన్ని పంజాబ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పోలీసు సుకుచిన్ సింగ్ గిల్ గురువారం వెల్లడించారు. బైక్ మీద పారిపోయిన అమృత్‌పాల్ సింగ్, పపల్‌ప్రీత్ సింగ్‌లకు కురుక్షేత్రలోని తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చిందని అనుమానాలున్న మహిళ బల్జీత్ కౌర్‌ని హరియాణా పోలీసులు అరెస్ట్ చేసి పంజాబ్ పోలీసులకు అప్పగించారు.బల్జీత్ కౌర్‌కు గత రెండేళ్లుగా పపల్‌ప్రీత్ సింగ్ తెలుసునని హరియాణా పోలీసులు తెలిపారు. ఇక అమృత్‌పాల్ ఏర్పాటు చేసిన ప్రైవేటు సైన్యంలో సభ్యుడైన తేజీందర్ సింగ్ గిల్‌ను కూడా లూథియానా జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేసింది. తుపాకులకు ఎలాంటి లైసెన్స్ లేకుండా గిల్ సోషల్ మీడియా వేదికల్లో వాటి ఫోటోలను ఉంచేవాడని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు అమృత్‌పాల్ కోసం వేట సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ కనెక్షన్‌పై నిషేధం విధించారు.

రూ.429.28 కోట్లతో మద్నూర్-బోధన్ రోడ్డు విస్తరణ

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని కామారెడ్డి, నిజామాబాద్, మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేలా మద్నూర్- బోధన్ రహదారి విస్తరణకుగాను రూ.429.28 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. ఈ మేరకు గురువారం కేంద్ర మంత్రి ప్రకటన చేశారు. కామారెడ్డి, నిజామాబాద్, నాందేడ్‌లోని ఎన్‌హెచ్-161బీబీలోని మద్నూర్ నుంచి బోధన్ సెక్షన్ వరకు రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించడానికి ఆమోదం తెలిపారు. 39.032 కిలోమీటర్ల పొడవు గల ఈ ప్రాజెక్టును ఇంజనీరింగ్, సేకరణ, నిర్మాణం(ఈపీసీ) పద్ధతిలో 2022-23 వార్షిక ప్రణాళిక కింద అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎన్‌హెచ్-163జీ(ఖమ్మం-విజయవాడ)లో రేమిడిచెర్ల గ్రామం నుంచి జక్కంపూడి గ్రామం (ఎన్‌హెచ్-16లో) వరకు నాలుగు లైన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే సెక్షన్ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 29.709 కిలోమీటర్ల లేఅవుట్‌కు రూ.1,190.86 కోట్లు ఖర్చు అవుతుందని, ఇతర ఎకనామిక్ కారిడార్(ఎన్‌హెచ్(ఒ)) ప్రోగ్రామ్‌ల కింద హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో తెలంగాణలోని ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాల్లో నిర్మిస్తామని తెలిపారు.

'ఈడీ విచారణను సమీక్షిస్తూ కూర్చోవడం దురదృష్టకరం'

సాక్షి, హైదరాబాద్: అధికారికంగా నిర్వహించిన ఉగాది వేడుకలకు సీఎం కేసీఆర్ ఎందుకు ముఖం చాటేశారో చెప్పాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతా పంచాంగ శ్రావణము జరుగుతుంటే కేసీఆర్ కుటుంబం కలిసి ప్రగతిభవన్‌లో కూర్చుని మద్యం కుంభకోణంలో కూతురు కవితపై జరిగిన ఈడీ విచారణను సమీక్షిస్తూ కూర్చోవడం దురదృష్టకరమన్నారు. గతంలో రవీంద్రభారతి వేదికగా జరిగే ఉత్సవాలను ప్రగతి భవన్‌కు మార్చిన కేసీఆర్..ఈసారి ఉగాది ఉత్సవాలను కూడా ప్రగతి భవన్ తలుపులు మూసేసి రవీంద్రభారతిలో జరిపించారని మండిపడ్డారు.

సీఎం కంటితుడుపు పర్యటన

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితకు ఇచ్చిన ఈడీ నోటీసులను ఎలా ఎదుర్కోవాలనే దానిపై సర్కార్ దృష్టంతా పెట్టడంతో రాష్ట్రంలో పాలన పడకేసిందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కేసీఆర్ పర్యటన కంటితుడుపుగానే జరిగిందని ఆరోపించారు. గురువారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. లిక్కర్ స్కాంలో కవిత విచారణకు ఢిల్లీ వెళ్లడం, మళ్లీ దానిపై తదుపరి కార్యాచరణపై ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షలు అనే 'టూ పాయింట్ ప్రోగ్రామ్'మాత్రమే సాగుతోందన్నారు.

మోదీతో రాజకీయాలు మాట్లాడలేదు

- నియోజకవర్గ అభివృద్ధి గురించే మాట్లాడాను
- 20 నిమిషాల పాటు పెండింగ్ సమస్యలపై ప్రధానితో చర్చించా
- కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి



ప్రధాని మోదీతో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే ప్రధాని నరేంద్ర మోదీని కలిశానని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రధానితో జరిగిన భేటీలో నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను మాత్రమే మాట్లాడానని, మా మధ్య ఎలాంటి రాజకీయపర అంశాలపై చర్చ జరగలేదని ఎంపీ కోమటిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో సుమారు 20 నిమిషాల పాటు నరేంద్ర మోదీతో భేటీ అయిన కోమటిరెడ్డి ఏడు అంశాలకు సంబంధించిన విజ్ఞాపనలను ప్రధానికి అందించారు. అనంతరం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 6 లేన్ల రహదారిగా విస్తరించే చర్యలను వెంటనే తీసుకోవాలని ప్రధాని మోదీని కోరానని తెలిపారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్న ఈ రహదారి విస్తరణపై దృష్టి సారించాలన్నారు. కాగా తన వినతిపై స్పందించిన ప్రధాని, అధికారులతో సమీక్ష జరిపి త్వరలో ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ కోమటిరెడ్డి పేర్కొన్నారు.

నేను అడిగినవి ఇవే...

"భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న చేనేత కార్మికులను ఆదుకొనేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా బ్లాక్ లెవెల్ క్లస్టర్ మంజూరు చేయాలని కోరాను 'చేనేత కార్మికులకు ఉపయోగపడే ఆసు యంత్రాలను రెండు విడతల్లో కనీసం 1000 మంజూరు చేయాలి. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకు ఉన్న చేనేత కార్మిక కుటుంబాలను ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశాను. ముఖ్యంగా ఎంఎంటీఎస్-2లో భాగంగా ఘట్ కేసర్ నుంచి రాయగిరి వరకు పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర వాటాగా రూ.120 కోట్లు చెల్లించాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనలేని విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాను. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా ఇచ్చినా, ఇవ్వకున్నా మొత్తం కేంద్రం భరించి ప్రాజెక్టును అమలు చేయాలని... ఈ ప్రాజెక్టును ఆలేరు, జనగాం వరకు పొడగించాలని కోరాను మరోవైపు హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలును ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు విస్తరించాలని ప్రధానిని కోరాను"అని వెంకటరెడ్డి వివరించారు.

అలాగైతే నడ్డాను కలుస్తాను గానీ...

రాజకీయ అంశాలపై అయితే పార్టీ కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలుస్తాను కానీ..పార్లమెంటులో ప్రధాని మోదీని ఎందుకు కలుస్తానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఒక పార్లమెంటు సభ్యునిగా ప్రధానిని అభివృద్ధి పనులపై కలిశానే తప్ప రాజకీయాల గురించి మాట్లాడలేదన్నారు. వడగండ్ల వాన పడి రైతులు నష్టపోయిన ఆరురోజుల తర్వాత పర్యటించేందుకు సీఎంకు తీరిక కుదిరిందా అని కోమటిరెడ్డి ప్రశ్నించారు. వడగండ్లకు సంబంధించిన విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లగా, కేంద్రం తరపున తెలంగాణ ప్రజలను ఆదుకుంటామని ప్రధాని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

సాక్షి CELEBRATING 15 YEARS
ఈ అనుబంధం నిరంతరం

చెప్పుకోలేని బాధ..!



● పాలమూరు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అది. 2,500 మంది విద్యార్థులున్నా.. ఉన్నది ఒకే టాయిలెట్ గది. పైగా సరిగా నీళ్లు కూడా లేని దుస్థితి. దీనితో బాలికలు పడు తున్న గోసపై 2016 నవంబర్ 23న 'సాక్షి'మెయిన్, జిల్లా ఎడిషన్లలో ప్రచురించిన కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

✔ 'సాక్షి'కథనాన్ని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. దీనిపై వివరణ ఇవ్వాలని అప్పటి కలెక్టర్ రొనాల్డ్ రోస్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కథనంపై, కమిషన్ ఆదేశాలపై స్పందించిన కలెక్టర్, అధికారులు వెంటనే కళాశాలలో టాయిలెట్స్ సమస్యను పరిష్కరించారు. అంతేగాకుండా జిల్లాలో స్వచ్ఛ మిషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా బాలికల కళాశాలల్లో టాయిలెట్స్ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించేలా చేయడం గమనార్హం. ప్రభుత్వ కళాశాల విద్యార్థులతోపాటు అధ్యాపకులు 'సాక్షి'కి కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

- పాలమూరు

కొలువని చెప్పి..

స్కాం కేఫ్‌లో ఖైదు చేసి



● ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన షాబాజ్‌ఖాన్, షారూక్‌ఖాన్, హాజీబాబా సయ్యద్, నవీద్ అబ్దుల్, సలీం మహమ్మద్ తదితరులు తాము కంబోడియాలో సైబర్ కేఫ్‌లో ఉద్యోగం కోసమని వెళ్లి నేరగాళ్ల చేతిలో బందీలుగా ఇరుక్కుపోయారు. దీనిపై వారు ఫోన్ ద్వారా 'సాక్షి'ని ఆశ్రయించారు. దీంతో 'సాక్షి' ప్రతినిధులు వారిని కంబోడియాకు పంపిన ఏజెన్సీ వివరాలను, కంబోడియాలో చైనా సంస్థలు నిర్వహిస్తున్న సైబర్ కేఫ్‌కు ఒక్కొక్కరిని 2,500 డాలర్లకు బాధితులను విక్రయించిన విషయాన్ని గుర్తించారు.

✔ 'సాక్షి' ఈ వివరాలతో ప్రత్యేక కథనాలను ప్రచురించడంతోపాటు కరీంనగర్ పోలీస్ కమిషనర్, ఎంపీ బండి సంజయ్, భారత విదేశాంగశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. సైబర్‌కేఫ్‌లలో ఉద్యోగం పేరిట జరుగుతున్న అరాచకాలను వివరించింది. కరీంనగర్ సీపీ ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో బాధిత యువకులను సురక్షితంగా ఇండియాకు తీసుకొచ్చారు. ఈ అంశంలో 'సాక్షి' కృషిని అధికారులు ప్రశంసించగా.. 'సాక్షి' తమకు పునర్జన్మను ఇచ్చిందని బాధిత యువకులు చెప్పారు. 'సాక్షి' కేంద్ర కార్యాలయానికి వచ్చి ఎడిటర్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

- సాక్షిప్రతినిధి, కరీంనగర్

దేశాన్ని కాపాడుకునేందుకు కలసి పనిచేద్దాం

- మోదీని గద్దె దించడమే వామపక్షాలు - బీఆర్ఎస్ లక్ష్యం
- జనచైతన్య యాత్ర సభలో మంత్రి పువ్వాడ, తమ్మినేని



సభలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ. చిత్రంలో తమ్మినేని ఇతర నేతలు

ఖమ్మం మయూరిసెంటర్: ప్రధాని మోదీ రూపంలో దేశానికి పెద్ద సమస్య ఎదురవుతోందని.. ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్తున్న దేశాన్ని కాపాడుకునేందుకు అంతా ఏకం కావాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర గురువారం సాయంత్రం ఖమ్మం చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిస్టుల అవసరం సమాజానికి ఉందని.. దేశం, ప్రజలు సమస్యల్లోకి వెళ్లినప్పుడు కమ్యూనిస్టులు యాత్రలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తారని తెలిపారు. ఇప్పుడు బీజేపీతో ఎదురవుతున్న ప్రమాదం నుంచి ప్రజలను కాపాడేందుకు యాత్రలు చేపట్టడంతో తాము సంఘీభావం ప్రకటించామని చెప్పారు. బీజేపీని ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్.. వామపక్షాలతో కలసి పనిచేస్తుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం, సీపీఐలతో కలసి పదికి పది స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వీరభద్రం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చే ముందు మోదీ ప్రజలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్ని నెరవేర్చలేదని మండిపడ్డారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయకపోగా.. నల్లచట్టాలను తీసుకొచ్చేందుకు కుట్ర చేశారన్నారు. సీఎం కేసీఆర్‌కు బీజేపీ విషయంలో స్పష్టమైన వైఖరి ఉండటంతోనే తాము మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకులను దోచేవారంతా మోదీలే అనడం తప్పా: రవి



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ సీనియర్ నేత రాహుల్ గాంధీ 2019 ఎన్నికల ప్రచారంలో నీరవ్ మోదీ, లలిత్ మోదీలను ఉద్దేశించి బ్యాంకులను దోచేవారంతా మోదీలేనని అనడం తప్పా అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో మల్లు రవి మాట్లాడారు. మోదీపై రాహుల్‌గాంధీ ఎక్కడా కూడా వ్యక్తిగతంగా మాట్లాడలేదన్నారు. మోదీ గురించి మాట్లాడితే జైలు శిక్ష తప్పదని బెదిరిస్తున్నారా అని ప్రశ్నించారు. అదానీ కుంభకోణంపై విచారణ చేయాలని ప్రతిపక్షాలు మొత్తుకున్నా ఎందుకు వేయలేదని ఆయన నిలదీశారు.

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ రీసెర్చ్ కమిటీ చైర్మన్‌గా పోతిరెడ్డి



బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర యూత్ కాంగ్రెస్ రీ సెర్చ్, పాలసీ విభాగం రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ చైర్మన్ వికాస్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులకు రాజశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అధ్వానంగా టీఎస్‌పీఎస్సీ పరీక్షలు: ప్రవీణ్‌కుమార్



ఓయూలో టీ తాగుతున్న ప్రవీణ్

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ పరీక్షలు ఈసారి జరిగినంత అధ్వానంగా ఎన్నడూ జరగలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. మోండా మార్కెట్‌లో సరుకుల కంటే దారుణంగా ప్రశ్నపత్రాలను అమ్ముకున్నారని... అమెరికా నుంచి వచ్చి పరీక్ష రాసిన అభ్యర్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయని ఆయన ఆరోపించారు. గురువారం రాత్రి ఓయూ క్యాంపస్ పరిశోధన విద్యార్థుల ఎన్ఆర్ఎస్ హాస్టల్ వద్ద గల నర్సింహ టీకొట్టు దగ్గర ఓయూ విద్యార్థి నేతలతో ప్రవీణ్‌కుమార్ టీఎస్‌పీఎస్సీలో జరిగిన అక్రమాలపై పిచ్చాపాటిగా మాట్లాడారు. గ్రూప్-1 ప్రశ్నపత్రాల లీకేజీ తదనంతరం జరిగిన పరిణామాలు, ఆందోళనలు, అరెస్టులు, సిట్ దర్యాప్తు, నిందితుల అరెస్ట్, సీఎం కేసీఆర్, ఇతర మంత్రుల తీరు తదితర అంశాలపై సుమారు 2 గంటలపాటు విద్యార్థులతో చర్చించారు. 2016లో జరిగిన గ్రూప్-1పై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను అరెస్ట్ చేయాలన్నారు.

ఏప్రిల్ 3న పోలవరం ముంపుపై సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించేందుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఏప్రిల్ 3న ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో మరో దఫా సమావేశం నిర్వహించనుంది. సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలో ఢిల్లీలో ఈ సమావేశం జరగనుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై గతేడాది సెప్టెంబర్ 29న కేంద్ర జలశక్తి శాఖ చీఫ్ సెక్రటరీల స్థాయిలో సమావేశం నిర్వహించింది. ఈ నేపథ్యంలో సాంకేతికపరమైన అంశాలపై సంప్రదింపుల కోసం సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే సంబంధిత రాష్ట్రాలతో పలు మార్లు సమావేశం నిర్వహించి ముంపు ప్రభావంపై విస్తృత చర్చలు జరిపింది. గత సమావేశాల్లో చర్చకు రాకుండా మిగిలిపోయిన అంశాలపై తదుపరి సమావేశంలో చర్చించనున్నట్టు సీడబ్ల్యూసీ తెలియజేసింది.

29న టీడీపీ 42వ ఆవిర్భావ సభ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 29న తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. గురువారం పార్టీ నాయకులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ మార్చి ఈ ఆవిర్భావ సభకు చంద్రబాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు హాజరవుతారని తెలిపారు.

మాకు పెట్టే భోజనం పశువులు కూడా తినడం లేదు


- రోడ్డెక్కిన మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల విద్యార్థులు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ధర్మసాగర్: 'నీళ్ల కూరలు, చారు, ఉడికీ ఉడకని అన్నం.. మాకు పెట్టే భోజనం కనీసం పశువులు కూడా తినడం లేదు. అంతకన్నా హీనమయ్యామా'అంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల, కళాశాలలో భోజనం మంచిగా లేదని, నీళ్ల కూరలు, చారు, ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని ఆ పాఠశాల, కళాశాల విద్యార్థులు గురువారం హైదరాబాద్-వరంగల్ రహదారిపై బైఠాయించారు. విద్యార్థులు మాట్లాడుతూ మెనూతో సంబంధం లేకుండా కుళ్లిన కూరగాయలు వండుతున్నారని, సాంబారు పేరుతో చింతపండు పులుసుతో వేడి నీళ్లు పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పస్తులతో కడుపు మాడ్చుకొని పడుకుంటున్నామని విలపించారు. బాత్ రూం పైపుల లీకేజీ వల్ల వచ్చే వాసన భరించలేకపోతున్నామన్నారు. అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు వేడుకున్నారు.

బాసర ఆలయ పునర్నిర్మాణానికి నేడు శ్రీకారం




బాసర ఆలయం

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో చదువుల తల్లి సరస్వతీ దేవి కొలువుదీరిన ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం అంకురార్పణ జరగనుంది. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టీఎస్ఐడీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి పనులు ప్రారంభిస్తారని ఆలయ ఈవో విజయరామారావు గురువారం బాసరలో వెల్లడించారు. యాదాద్రి తరహాలో బాసర ఆలయాన్ని నిర్మించాలని భక్తులు ఎన్నో రోజులుగా కోరుతున్నారు. ఇప్పటికే శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి సూచనలతో నూతన ఆలయ నమూనాను రూపొందించారు. గర్భాలయంలో మార్పులు, చేర్పులు, ఇతర విషయాలపై బాసర ఆలయ అర్చక బృందం శృంగేరి పీఠాధిపతితో చర్చించింది. ఈ మేరకు అమ్మవారి గర్భగుడిని కృష్ణశిలలతో అద్భుతంగా నిర్మించాలని నిర్ణయించారు. సరస్వతి అమ్మవారి దర్శనం అనంతరం పక్కనే ఉన్న మహాలక్ష్మి అమ్మవారు భక్తులకు కనిపించేలా మహాద్వారం ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం విడుదల చేసే బడ్జెట్ ఆధారంగా టెండర్లు పిలిచి దశలవారీగా ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



క్లుప్తంగా...

సీఆర్‌పీఎఫ్ సౌత్‌జోన్ కమాండర్‌గా రవిదీప్ సింగ్ సాహి



సాక్షి, హైదరాబాద్: సీఆర్‌పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) సౌత్‌జోన్ కమాండర్‌గా అడిషనల్ డీజీ రవిదీప్ సింగ్ సాహి గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1986 సీఆర్‌పీఎఫ్ బ్యాచ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా సీఆర్‌పీఎఫ్‌లో విధుల్లో చేరిన రవిదీప్ 37 ఏళ్ల సర్వీస్‌లో పలు సందర్భాల్లో తన సమర్థతను నిరూపించుకున్నారు. 2001 డిసెంబర్‌లో పార్లమెంట్‌పై ఉగ్రదాడి తర్వాత లోక్‌సభ సెక్రటేరియట్ సెక్యూరిటీ జాయింట్ డైరెక్టర్‌గా 2002లో రవిదీప్‌ను నియమించారు. 2007 వరకు పార్లమెంట్ భద్రత విధుల్లో ఉన్న రవిదీప్ భద్రత పరంగా పలు కీలక చర్యలు తీసుకున్నారు. సీఆర్‌పీఎఫ్ శ్రీనగర్ సెక్టార్ ఐజీగా పని చేసే సమయంలో ఉగ్రవాదులపై జరిపిన పలు కీలక ఆపరేషన్లలో ఆయన పనిచేశారు. విశిష్ట సేవలకుగానూ రవిదీప్‌కు గ్యాలంట్రీ పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ పోలీస్ మెడల్, పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్, అతి ఉత్కృష్ట సేవా పథకం, డీజీ కమాండేషన్ పతకాలు పొందారు.

ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా గవర్నర్ తీరు

మునిసిపల్ చాంబర్స్ చైర్మన్ రాజు

సాక్షి, హైదరాబాద్: ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా రాష్ట్ర గవర్నర్ పనిచేస్తుండడం బాధాకరమని తెలంగాణ మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు వ్యాఖ్యానించారు. గవర్నర్ తీసుకుంటున్న నిర్ణయాలన్నీ బీజేపీకి అనుకూలంగా, ఆ పార్టీ స్ఫూర్తితో ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర పురపాలక సంఘాల చైర్మన్ల అత్యవసర సమావేశం గురువారం హిమాయత్‌నగర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్ వ్యవహారశైలిని తప్పు పడుతూ సమావేశం తీర్మానించింది. చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ ఏడు నెలల క్రితం మునిసిపల్ బిల్లుతో పాటు పది బిల్లులను శాసనసభ, మండలి ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే పెండింగ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. బీజేపీ విధానాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రగతిని అడ్డుకుంటూ గవర్నర్ అడ్డుగోడలా నిలబడ్డారని విమర్శించారు. రాజకీయ కుట్ర కోణంలో గవర్నర్ వ్యవహరించడం మంచి సంప్రదాయం కాదన్నారు. మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలని ఉద్యమిస్తున్న ఎమ్మెల్సీ కవితను ఢిల్లీ లిక్కర్ స్కాం పేరుతో వేధించడాన్ని చాంబర్స్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కవితకు మద్దతుగా.. అండగా ఉంటామని ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు నర్సింహా గౌడ్, జమున, రజిని, ప్రణీత, గంగాధర్, సుధామహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కష్టాలపై దృష్టి సారించండి

గవర్నర్‌కు టీయూడబ్ల్యూజే వినతి

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల కష్టాలపై దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాజ్‌భవన్‌లో కలసి వినతిపత్రాన్ని సమర్పించింది. మీడియా రంగంపై పాలకుల కుట్రలను నిరసిస్తూ ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఇచ్చిన 'సేవ్ జర్నలిజం' దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా టీయూడబ్ల్యూజే హైదరాబాద్‌లో ఆందోళన చేపట్టింది. అనంతరం ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్‌అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మీడియా స్థితిగతులు, జర్నలిస్టుల సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఐటీ నిబంధనల ముసుగులో డిజిటల్ మీడియాకు సమస్యలు సృష్టించడం సరికాదన్నారు. గవర్నర్ స్పందిస్తూ జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తన సహకారం ఉంటుందని భరోసానిచ్చారు. గవర్నర్‌ను కలసిన వారిలో ఇంకా జర్నలిస్టు నాయకులు వై.నరేందర్‌రెడ్డి, కె.సత్యనారాయణ, శంకర్‌గౌడ్, అబ్దుల్ హమీద్ షౌకత్ ఉన్నారు. అంతకుముందు కవాడిగూడలోని పీఐబీ తెలంగాణ రీజియన్ కార్యాలయం ఎదుట ఐజేయూ ఆందోళన నిర్వహించింది.

పోలవరం పూర్తి చేసేది మేమే

- శాసనసభలో ఏపీ సీఎం వైఎస్ జగన్
- ఈ ప్రాజెక్ట్ పేరు ఎత్తే అర్హత చంద్రబాబుకు లేదు
- చంద్రబాబు, గజదొంగల బ్యాచ్ ప్రాజెక్టును పీల్చి పిప్పి చేశారు
- ఇది చంద్రబాబు ఏటీఎం అని స్వయానా ప్రధానే అన్నారు



సాక్షి, అమరావతి : 'పోలవరం ప్రాజెక్ట్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్వప్నం. పోలవరం అంటే వైఎస్సార్... వైఎస్సార్ అంటే పోలవరం. పోలవరం ప్రాజెక్టును ప్రారంభించింది నాన్నే.. పూర్తి చేసేది ఆయన కొడుకుగా నేనే. మీ జగనే' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 1995 నుంచి 2014 వరకు చంద్రబాబుకు పోలవరం అంటే ఏమిటో తెలియదని, ఆ ప్రాజెక్ట్ పేరు పలకడమే రాదని, అటువంటి చంద్రబాబుకు అసలు పోలవరం ప్రాజెక్ట్ పేరు ఎత్తే అర్హతే లేదని విమర్శించారు. 'పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏటీఎంగా వాడుకున్నారని సాక్షాత్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనే నిర్వచించారని గుర్తు చేశారు. చంద్రబాబు, ఆయన గజ దొంగల ముఠా పోలవరం ప్రాజెక్టును పీల్చిపిప్పి చేసి యథేచ్ఛగా దోచుకున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్ట్ అంశంపై శాసనసభలో గురువారం స్వల్ప కాలిక చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 'పోలవరం ప్రాజెక్ట్‌పై ఎల్లో మీడియాలో ఇటీవల వచ్చిన కథనాన్ని చూశాం. అసలు పనులు చేసింది చంద్రబాబేనంటూ ఒక అభూత కల్పనతో కలరింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. చంద్రబాబు తాను ప్రజలకు మంచి చేసి ఇదిగో ఫలానా మంచి చేశాను అని చెప్పి రాజకీయాలు చేయరు. కేవలం ఒక ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, వీళ్లందరికీ తోడు ఒక దత్తపుత్రుడు.. వీళ్ల మీద ఆధారపడి మాత్రమే చంద్రబాబు రాజకీయాలు చేస్తారు. ఒక అబద్ధాన్ని గొప్పగా వందసార్లు చెప్పించే చెప్పి అదే నిజమేనేమో అని భ్రమ కల్పించేలా గోబెల్స్ ప్రచారం చేయగల గొప్ప వ్యక్తి చంద్రబాబు. మాకున్న ఇబ్బంది, వాళ్లకున్న అనుకూలత ఇదే. అందులో భాగంగానే పోలవరం ప్రాజెక్ట్ పనులు చేసింది చంద్రబాబేనంటూ ఎల్లో మీడియాలో అభూత కల్పన సృష్టించేందుకు యత్నిస్తోంది. పోలవరం అనే పదం పలికే అర్హత చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి.. వీళ్లను మోస్తున్న ఈనాడు దినపత్రిక రామోజీరావుకు ఉందా అని నేను అడుగుతున్నాను' అని అన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరం వైఎస్సార్ డ్రీమ్ ప్రాజెక్టు

- 2004లో నాన్నగారు వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక పోలవరం తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పారు. అంత వరకు వీళ్లకు ఈ ప్రాజెక్టు గురించి తెలుసా? 2004కు ముందు తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఏం వెలగబెట్టారు? చంద్రబాబు 1995లో మొట్టమొదటసారిగా ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి 2014 వరకు అంటే 19 ఏళ్ల పాటు కనీసం ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడారా? అప్పుడు రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 ఏ గాడిదలు కాస్తున్నారు? వీళ్లంతా ఈరోజు పోలవరం ప్రాజెక్టు చంద్రబాబు కట్టారని, ఉరుకులు, పరుకులు తీయించారని కలరింగ్ ఇస్తున్నారు.
- పోలవరం చంద్రబాబు ఒక్కరికే ఏటీఎం కాదు. చంద్రబాబుకు ఒక గజ దొంగల ముఠా ఉంది. దోచుకో, పంచుకో, తినుకో అనే బ్యాచ్. ఈనాడు దినపత్రిక రామోజీరావు కొడుకు వియ్యంకుడుకి కూడా ఇది ఏటీఎం. నవయుగ అనే ఒక సంస్థ రామోజీరావు కొడుకు వియ్యంకుడిది. ఆ సంస్థకు నామినేషన్ పద్ధతిలో పనులిచ్చారు. ఇంకా కొందరు ఉన్నారు. సుధాకర్ యాదవ్.. అప్పట్లో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వియ్యంకుడు. నామినేషన్ పద్ధతిలో పనులు తీసుకుని యథేచ్ఛగా దోచేశారు. వీళ్లు ఏ స్థాయిలో దోచారంటే చివరకి ప్రధాన మంత్రే పోలవరం ప్రాజెక్ట్ వాళ్ల ఏటీఎం అని నిర్వచించారు.

12–18 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం

- మనం అధికారంలోకి వచ్చాక వీటన్నింటినీ రిపేరు చేస్తూ అడుగులు ముందుకు వేశాం. అప్రోచ్ ఛానెల్ మీదుగా స్పిల్ ఛానెల్‌ను, స్పిల్ ఛానెల్ దిగువన పైలెట్ ఛానెల్‌ను పూర్తిగా నిర్మించాం. ఈ రోజు స్పిల్‌వే అన్ని రకాలుగా పూర్తైంది. నీళ్లు కూడా స్పిల్ వే మీదుగా వస్తున్నాయి. 48 గేట్లు పెట్టాం. అందువల్లే గోదావరి వందేళ్ల చరిత్రలో రెండో అతిపెద్ద వరద వచ్చినా సమర్థవంతంగా స్పిల్‌వే ద్వారా వరదను నియంత్రించగలిగాం.
- వర్షాకాలం వచ్చినా మెయిన్ డ్యామ్ నిర్మిస్తున్నాం. 2022 నవంబర్‌లో తిరిగి దిగువ కాఫర్ డ్యామ్ పనులు మొదలుపెట్టాం. 2023 ఫిబ్రవరి 14 నాటికి దిగువ కాఫర్ డ్యామ్ పనులను విజయవంతంగా పూర్తి చేశాం. ఎన్‌హెచ్‌పీసీ వారి ద్వారా డయాఫ్రం వాల్ టెస్టులు చేసి, ఆ రిపోర్టులను సీడబ్ల్యూసీకి, డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్‌కు పంపించాం. వాళ్లు ఈ ఏడాది మార్చి 3, 4 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి సమావేశం నిర్వహించారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రదేశాలలో సమాంతరంగా డయాఫ్రం వాల్ కట్టాలని నిర్ణయించాం. అ పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరో 12 నెలల నుంచి 18 నెలల వ్యవధిలో ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ వేగవంతం చేశాం.

పోలవరం కోసమే ప్రధానితో సమావేశం

- సాంకేతికంగా అన్ని రకాల అనుమతులు లభించినందున ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేస్తాం. అందుకు అవసరమైన కేంద్ర ప్రభుత్వం సహకారం కోరేందుకే నేను ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశాను. ప్రధానికి వివరించిన అజెండాలో ఈ పాయింట్ కూడా ఉంది.

> పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన ప్రాజెక్టు. దీనికోసం కేంద్రం నిధులిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వానిది పర్యవేక్షణ బాధ్యత. అయితే డబ్బులు రావడంలో ఆలస్యమవుతోందన్న కారణంతో పనులు ఆగిపోకూడదని భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కోసం మన డబ్బులు రూ.2,600 కోట్లు ఇచ్చాం. అవి కేంద్రం నుంచి తెచ్చుకోవడం కోసం వాళ్ల చుట్టూ తిరుగుతున్నాం. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా ఎల్లో మీడియా ఏ రకంగా దుష్ప్రచారం చేస్తుందో, ఎవరెవరి హయాంలలో ప్రాజెక్టు కోసం ఏం చేశారో గమనించాలి. ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేసేది మీ జగనే. - సీఎం వైఎస్ జగన్

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ అనుబంధం నిరంతరం



- ఎక్కడో పుట్టి పెరిగి.. మతిస్థిమితం తప్పి కోదాడలో చెత్తకుప్పల మధ్యకు చేరిన అభాగ్యురాలు ఆముద. తానెవరో, ఇలా ఎందుకు మారిందో తెలియని ఆమెను అక్కడే చెప్పులు కుట్టుకునే పల్లె వెంకటేశ్వర్లు ఆదరించి ఇంటికి తీసుకెళ్లాడు. 'సాక్షి' దీనిపై 'మానవత్వం పరిమళించింది.. ఓ మోడు చిగురించింది' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఇది చూసిన దాతలు వెంకటేశ్వర్లు కృషికి సాయం అందించారు. ఆముదను హైదరాబాద్‌కు తీసుకెళ్లి మెరుగైన వైద్యం చేయించడంతో మామూలు మనిషిగా మారింది. కానీ ఆమె ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండటంతో 'సాక్షి' మళ్లీ కథనాలు రాయగా.. మంత్రి హరీశ్‌రావు స్పందించి ఆముదకు కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో ఔట్‌సోర్సింగ్ అటెండర్‌గా ఉద్యోగం ఇప్పించారు. అంతేకాదు సాక్షి కథనాల ఆధారంగా కొందరు ఆమె జీవిత చరిత్రను సినిమాగా తీశారు. ఈ విషయాన్ని కూడా 'వీధి నుంచి వెండితెరకు' శీర్షికన సాక్షి కథనం ప్రచురించింది.
- ✔ ఆముద గత సంవత్సరం కేన్సర్ బారినపడింది. చెప్పులు కుడుతూ జీవించే వెంకటేశ్వర్లు ఆమెకు చికిత్స చేయించలేని పరిస్థితి. ఈ విషయాన్ని కూడా 'ఆపదలో ఆముద' శీర్షికన ప్రచురించడంతో.. మనసున్న దాతలు స్పందించి సాయం చేయడంతో కొంతకాలం బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కేన్సర్ చికిత్సలు చేస్తున్న ఓ కేరళ వైద్యుడి వద్ద చికిత్స పొందుతోంది. ఆయన ఉచితంగా చికిత్స చేస్తున్నా.. మందుల భారం తప్పడం లేదు. చెత్తకుప్పల మధ్య ఉన్న ఆముదను తాను ఆదరించినా.. ఆమెను మనిషిగా చేసింది 'సాక్షి' సాయమేనని వెంకటేశ్వర్లు చెబుతున్నాడు. దాతలు ఆదుకోవాలని కోరుతున్నాడు.

- కోదాడ

44 మందికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాలు



నాంపల్లి: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేషమైన సేవలందించిన 44 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2020వ సంవత్సరానికి కీర్తి పురస్కారాలను ప్రకటించింది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీ ప్రముఖులను పురస్కార గ్రహీతలుగా ఎంపిక చేసింది.

పురస్కారాల విజేతలు వీరే...

డాక్టర్ సముద్రాల వెంకటరంగ రామానుజాచార్యులు(ఆధ్యాత్మిక సాహిత్యం), పుత్తా పుల్లారెడ్డి(ప్రాచీన సాహిత్యం), డాక్టర్ వి.వి.రామారావు (సృజనాత్మక సాహిత్యం), టి.వి. ప్రసాద్ (కాల్పనిక సాహిత్యం), వారాల ఆనంద్ (అనువాద సాహిత్యం), ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి(బాల సాహిత్యం), డాక్టర్ ఎ.వి.వీరభద్రాచారి(వచన కవిత), కొరుప్రోలు మాధవరావు(తెలుగు గజల్), జి.వి.కృష్ణమూర్తి(పద్యరచన), డాక్టర్ మాదిరాజు బ్రహ్మానందరావు(పద్యరచన), డాక్టర్ పసునూరి రవీందర్(కథ), వేముల ప్రభాకర్(నవల), ఆర్.సి.కృష్ణస్వామిరాజు (హాస్య రచన), జి.భగీరథ(జీవిత చరిత్ర), తాళ్లపల్లి మురళీధరగౌడ్(వివిధ ప్రక్రియలు), చిలువేరు రఘురాం(నాటక రచయిత), డాక్టర్ వి.వి.వెంకటరమణ(జనరంజక విజ్ఞానం), ఎస్.వి.రామారావు (పరిశోధన), అన్నవరపు బ్రహ్మయ్య(పత్రికారచన), రాళ్లపల్లి సుందర్‌రావు(భాష), ఘట్టమరాజు అశ్వత్థామనారాయణ(సాహిత్య విమర్శ), కాటేపల్లి లక్ష్మీ నరసింహమూర్తి(అవధానం), పి.వి.సాయిబాబ (లలిత సంగీతం), డాక్టర్ కె.శేషులత(శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు), ఎం.డి.రజియా(జానపద కళారంగం), పస్తం కొమురమ్మ(జానపద కళలు), డాక్టర్ పొనుగోటి సరస్వతి(ఉత్తమ రచయిత్రి), శైలజామిత్ర(ఉత్తమ రచయిత్రి), నాగమణి(ఉత్తమనటి), మాలెల అంజిలయ్య(ఉత్తమ నటుడు) ప్రొఫెసర్ భాస్కర్ శివాల్కర్ (నాటక రంగంలో కృషి), పేరిణి ప్రకాశ్(పేరిణి), డాక్టర్ రుద్రవరం సుధాకర్(కూచిపూడి నృత్యం), డాక్టర్ గెల్లి నాగేశ్వరరావు(సంఘసేవ), పేరలింగం(హేతువాద ప్రచారం), బండారు విజయ(మహిళాభ్యుదయం), డాక్టర్ ముదిగంటి సుధాకర్‌రెడ్డి (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం (గ్రంథాలయకర్త), ఆకృతి సుధాకర్(సాంస్కృతిక సంస్థ నిర్వహణ), శ్యామ్ (ఇంద్రజలం), నారు (కార్టూనిస్ట్), డాక్టర్ ఎ.ఎస్.ఫణీంద్ర (జ్యోతిషం), ఎజాజ్ అహ్మద్ (ఉత్తమ ఉపాధ్యాయుడు), ప్రొఫెసర్ ప్రీతి సంయుక్త(చిత్రలేఖనం) తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ నెల 28, 29వ తేదీలలో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రూ.5,116 నగదు, పురస్కారపత్రంతో సత్కరిస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

అధికార పక్షానికి 6

ఏపీలో క్రాస్ ఓటింగ్‌తో ఒక ఎమ్మెల్సీ నెగ్గిన టీడీపీ

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచినది వీరే..



మర్రి రాజశేఖర్ (వైఎస్సార్‌సీపీ) | బొమ్మి ఇజ్రాయెల్ (వైఎస్సార్‌సీపీ) | సూర్యనారాయణ రాజు (వైఎస్సార్‌సీపీ)



జయమంగళ వెంకట రమణ(వైఎస్సార్‌సీపీ) | పోతుల సునీత (వైఎస్సార్‌సీపీ) | చంద్రగిరి ఏసురత్నం (వైఎస్సార్‌సీపీ) | పంచుమర్తి అనురాధ (టీడీపీ)

సాక్షి, అమరావతి: ఏపీలో ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఆరు స్థానాలను సాధించింది. టీడీపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175 కాగా వైఎస్సార్‌సీపీకి 151 మంది ఎమ్మెల్యేల బలముంది. టీడీపీ నుంచి 23 మంది గెలుపొందినా చంద్రబాబు పోకడలు నచ్చక నలుగురు సభ్యులు ఆదిలోనే ఆ పార్టీకి దూరమయ్యారు. పవన్ కళ్యాణ్ వ్యవహార శైలితో ఆ పార్టీకి ఉన్న ఒకే ఒక సభ్యుడూ జనసేనకు దూరమయ్యారు. వీటిని పరిగణలోకి తీసుకుంటే టీడీపీకి సాంకేతికంగా 19 మంది సభ్యులే ఉన్నట్లు స్పష్టమవుతోంది. టీడీపీకి దూరమైన నలుగురు ఎమ్మెల్యేలు, జనసేనకు దూరమైన ఒక ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానాన్ని దక్కించుకోవాలంటే 22 మంది ఎమ్మెల్యేల మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. వైఎస్సార్ సీపీకి శాసనసభలో స్పష్టమైన ఆధిక్యత ఉండటంతో ఏడు స్థానాలకూ అభ్యర్థులను పోటీకి పెట్టింది. తమకు సంఖ్యాబలం లేకపోయినప్పటికీ ప్రలోభాలకు తెర తీస్తూ ఒక స్థానం నుంచి అభ్యర్థిని చంద్రబాబు బరిలోకి దింపారు.

మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఆరుగురు విజయం..

ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శాసనసభ కమిటీ హాల్ నెంబర్–1లో పోలింగ్ నిర్వహించారు. అనంతరం మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పెన్మత్స వీవీ సూర్యనారాయణరాజు, పోతుల సునీత, బొమ్మి ఇజ్రాయెల్, చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్‌లకు 22 ఓట్లు చొప్పున వచ్చాయి. టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు లభించాయి. దీంతో వారు మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు జయమంగళ వెంకటరమణ, కోలా గురువులకు 21 చొప్పున మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. వారిద్దరికీ మొదటి ప్రాధాన్యత ఓట్లు సమానంగా రావడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు అత్యధికంగా వచ్చిన జయమంగళ వెంకటరమణ గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

గడప గడపకూ విఫలమైన వారే లక్ష్యంగా..

నిర్విఘ్నంగా కొనసాగుతున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజాదరణ నానాటికీ పెరుగుతోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు మెజార్టీతో విజయం సాధించడమే అందుకు తార్కాణం. మూడేళ్లుగా చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలు, అందిస్తున్న సుపరిపాలనను ప్రతి ఇంటికీ వివరిస్తూ ప్రజల ఆశీస్సులు కోరేందుకు 2022 మే 11న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై సమస్యలు పరిష్కరిస్తూ ఆశీస్సులు పొందాలని ఆదిలోనే ఎమ్మెల్యేలకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించడంలో వెనుకబడ్డ ఎమ్మెల్యేలను పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచిస్తున్నారు. ఆ మేరకు గడప గడపకూ సమర్థంగా నిర్వహించలేక.. ప్రజలతో మమేకమవ్వలేక వైఎస్సార్‌సీపీకి దూరమైన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డికి తోడు మరో ఇద్దరు ఎమ్మెల్యేలను రూ.కోట్లు వెదజల్లి సంతలో పశువుల్లా కొనుగోలు చేసి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొడ్డిదారిన విజయం సాధించాలని చంద్రబాబు వ్యూహం రచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో విఫలమైన వారితోపాటు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ టికెట్ దక్కదనే సంకేతాలున్న ఎమ్మెల్యేలే లక్ష్యంగా ప్రలోభాలకు చంద్రబాబు తెరతీశారు. ఈ క్రమంలో ఇద్దరు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి టీడీపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ చేయించారు. దీంతో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు వచ్చాయి.

ఎంఎస్‌ఎంఈ పెట్టుబడుల్లో 150% వృద్ధి

తాజా నివేదికలో ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎంఎస్‌ఎంఈ రంగంలో కొత్త పెట్టుబడులు 2021–22లో 150 శాతం మేర పెరగ్గా కొత్తగా 60 వేల ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన జరిగినట్లు ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ వెల్లడించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆర్గానిక్ ఫుడ్ ప్రొడక్ట్స్, మార్కెటింగ్ ఏజెన్సీల భాగస్వామ్యంతో ఎంఎస్‌ఎంఈ ఈపీసీ 'తెలంగాణ పెట్టుబడులు, అభివృద్ధి' పేరిట తాజాగా చేసిన అధ్యయన నివేదికను సంస్థ చైర్మన్ డాక్టర్ డీఎస్ రావత్ గురువారం విడుదల చేశారు. ప్రైవేటు రంగంలో 2020–21లో రూ. 14,882.35 కోట్ల విలువైన పెట్టుబడులు రాగా 2021–22లో ఏకంగా రూ. 60,618 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సూక్ష్మ, అనుబంధ యూనిట్ల స్థాపన ఎక్కువగా జరిగినట్లు అధ్యయనంలో తేలింది. 26 లక్షల ఎంఎస్‌ఎంఈలలో 56 శాతం గ్రామీణ, 44 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉన్నట్లు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో స్థానికులు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నట్లు అధ్యయనంలో తేలింది.

టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు..

ఏఐ, బ్లాక్ చెయిన్, క్లౌడ్ అడాప్షన్, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్తు రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతున్నట్లు నివేదికలో వెల్లడైంది. ప్రభుత్వ ఎగుమతి ప్రోత్సాహక విధానాలతో ఐటీ ఎగుమతులు రూ. 1.45 లక్షల కోట్లకు, ఉద్యోగుల సంఖ్య 7 లక్షలకు చేరింది. రాష్ట్రంలో పర్యాటకం, మెడికల్ టూరిజం పెరిగిందని... ఈ ఏడాది 25 శాతం, 2024లో 35 శాతం మేర పెరిగే అవకాశముందని అంచనా వేసింది. కరోనా సమయంలో దేశ జీడీపీ 1.4 శాతం మేర తగ్గగా రాష్ట్రం మాత్రం 2.2 శాతం వృద్ధిరేటు సాధించిందన్నారు. ప్రస్తుత ధరలతో పోలిస్తే 2020–21లో 12.4 శాతం, 2021–22లో 9.09 శాతం వృద్ధిని తెలంగాణ సాధించిందన్నారు.

పద్మ అవార్డు గ్రహీతలను సన్మానించిన 'సేవా'

సాక్షి, న్యూఢిల్లీ: పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన తెలుగు ప్రముఖులు సంకురాత్రి చంద్రశేఖర్, మోదడుగు విజయగుప్తాలను సమైక్య తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(సేవా) సత్కరించింది. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న వీరిద్దరిని సేవా ప్రధాన కార్యదర్శి జీవీఆర్ మురళి శాలువాతో సత్కరించారు. అనంతరం సేవా ప్రతినిధులు దామోదరరావు, అర్జున్, చంద్రశేఖర్‌లు అవార్డు గ్రహీతలను కొనియాడారు.

ఆర్టీసీ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో 'డైనమిక్ ప్రైసింగ్'

- ఈ నెల 27 నుంచి 46 సర్వీసుల్లో అమలు
- టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి



మాట్లాడుతున్న టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి. చిత్రంలో ఎండీ వీసీ సజ్జనార్


సాక్షి, హైదరాబాద్: ప్రైవేటీ పోటీని తట్టుకునేలా, సంస్థను లాభాలబాట పట్టించేలా ఆర్టీసీ కొత్త విధానాలకు శ్రీకారం చుడుతోంది. ప్రజలకు అనువైన విధానాల కోసం వెతుకుతోంది. అందులో భాగంగా ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో 'డైనమిక్ ప్రైసింగ్' విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) సూత్రప్రాయంగా నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టుగా బెంగళూరు మార్గంలో నడిచే 46 సర్వీసుల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. గురువారం ఇక్కడి బస్‌భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీఎస్‌ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం నుంచి బెంగళూరుకు వెళ్లే సర్వీసుల్లో ఈ నెల 27 నుంచి డైనమిక్ ప్రైసింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. విమానాలు, హోటళ్లు, ప్రైవేట్ బస్ ఆపరేటర్ల బుకింగ్‌లో ఇప్పటికే అమల్లో ఉన్న డైనమిక్ ప్రైసింగ్‌ను త్వరలోనే ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయమున్న సర్వీస్‌లన్నింటిలోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ఆ సంస్థ యాజమాన్యం కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. సర్వీస్ ప్రారంభమయ్యే గంటముందు వరకు ఆన్‌లైన్ టికెట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. రద్దీ తక్కువగా ఉన్నరోజుల్లో ప్రయాణికులను ఆకర్షించేందుకు డైనమిక్ ప్రైసింగ్ విధానం దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం 60 రోజుల వరకు కల్పిస్తున్నామని గుర్తుచేశారు. సంస్థ అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.in లో టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. ప్రయాణికులకు నాణ్యమైన, మెరుగైన సేవలను అందించాలనే ఉద్దేశంతోనే డైనమిక్ ప్రైసింగ్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు గోవర్ధన్, సజ్జనార్ తెలిపారు.

డైనమిక్ ప్రైసింగ్ అంటే...

ప్రయాణికుల రద్దీని బట్టి టికెట్ ధరల్లో హెచ్చుతగ్గులు జరగడమే డైనమిక్ ప్రైసింగ్ విధానం. రద్దీ తక్కువగా ఉంటే సాధారణచార్జీ కంటే తక్కువగా ఈ విధానంలో టికెట్ ధర ఉంటుంది. డిమాండ్ ఎక్కువగా ఉంటే ఆ మేరకు చార్జీలుంటాయి. డైనమిక్ ప్రైసింగ్ విధానంలో అడ్వాన్స్‌డ్ డేటా అనాలసిస్ అండ్ మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ మార్కెట్‌లోని డిమాండ్‌ను బట్టి చార్జీలను నిర్ణయిస్తాయి. ప్రైవేట్ ఆపరేటర్లు, ఇతర రాష్ట్రాల ఆర్టీసీ బస్సుల బుకింగ్‌లతో పోల్చి టికెట్ ధరను వెల్లడిస్తాయి. ఆన్‌లైన్ బుకింగ్ విధానం ద్వారా ప్రయాణికులు తమకు నచ్చిన సీటును బుక్ చేసుకోవచ్చు. ఈ విధానంవల్ల రద్దీ తక్కువగా ఉన్నప్పుడు సాధారణచార్జీ కన్నా 20 నుంచి 30 శాతం వరకు టికెట్ ధర తక్కువగా ఉంటుంది. ఒకవేళ రద్దీ ఎక్కువగా ఉంటే సాధారణ చార్జీ కన్నా డిమాండ్ బట్టి 25 శాతం వరకు ఎక్కువగా టికెట్ ధర ఉంటుంది.

రాష్ట్రంపై క్షయ పంజా

- 2022 సంవత్సరంలో 72,911 మందికి టీబీ
- అందులో 1,892 మంది మృత్యువాత
- తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ నివేదిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై క్షయ పంజా విసురుతోంది. దేశవ్యాప్తంగా అధిక కేసులు నమోదు అవుతుండటంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మందులకు బ్యాక్టీరియా లొంగకపోవడం, పాలకులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చకపోవడం తదితర కారణాలతో ఈ వ్యాధి తీవ్రత పూర్తిస్థాయిలో తగ్గడం లేదని క్షయ మరణాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో 2022లో టీబీ కారణంగా ఏకంగా 1,892 మంది మరణించారు. 2021లో 2,055 మంది, 2020లో 2,300 మంది చనిపోయారు.

2022లో 72,911 కేసులు...

రాష్ట్రంలో టీబీ పూర్తి నియంత్రణకు రావడం లేదు. 2017లో 44,644 టీబీ కేసులను గుర్తిస్తే, 2018లో 52,269 మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. 2019లో 71,665 మందికి వ్యాపించింది. 2020లో 63,243 మందికి, 2021లో 60,796 మందికి వ్యాధి సోకింది. 2022లో కేసుల సంఖ్య భారీగా పెరిగింది. గత ఏడాది ఏకంగా 72,911 మంది టీబీ బారినపడ్డారు. రాష్ట్రంలో టీబీ కేసులు ఎక్కువగా హైదరాబాద్‌లోనే నమోదవడం గమనార్హం. 2022లో మొదటి ఏడు నెలల్లో హైదరాబాద్‌లో అత్యధికంగా 6,235 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత మేడ్చల్ జిల్లాలో 2,356 కేసులు, రంగారెడ్డి జిల్లాలో 2,294 నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలో 1,409 కేసులు, ఖమ్మం జిల్లాలో 1,299 కేసులు నమోదయ్యాయి. అత్యంత తక్కువగా ములుగు జిల్లాలో 232 టీబీ కేసులు నమోదయ్యాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.

86.5 శాతం మందికి ఆర్థిక సాయం...

నేరుగా నగదు బదిలీ (డీబీటీ) పద్ధతిలో క్షయవ్యాధిగ్రస్తులకు నెలకు రూ.500 కేంద్రం ఇస్తుంది. అందులో కేంద్రం వాటా 60 శాతం కాగా, రాష్ట్ర వాటా 40 శాతం. అయితే రాష్ట్రంలో కొందరు క్షయ రోగులకు ఆ ఆర్థిక సహకారం పూర్తిస్థాయిలో అందడం లేదు. వారికి బలవర్ధకమైన పోషకాహారాన్ని అందించేందుకు ఇస్తున్న ఈ సొమ్ము రాకపోవడంతో అనేకమంది పేద రోగులు ఆవేదన చెందుతున్నారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నుంచి స్పందన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే గతం కంటే ఇది కాస్త మెరుగుపడిందని రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారులు అంటున్నారు. 2020లో క్షయ వ్యాధిగ్రస్తుల్లో 72 శాతం మందికి ఆర్థిక సాయం అందగా, 2021లో 83 శాతం మందికి, 2022లో 86.5 శాతం మందికి డీబీటీ పద్ధతిలో ఆర్థిక సాయం అందింది. 2022లో 68,965 మంది ఆర్థికసాయానికి అర్హులు కాగా, 59,677 మందికి మాత్రమే ఆర్థికసాయం అందింది. మిగిలిన వారికి రాలేదని అధికారులు చెబుతున్నారు



తెలంగాణలో క్షయ మరణాలు ఏళ్ల వారీగా

సంవత్సరం	మరణాలు
2018	1,460
2019	1,850
2020	2,300
2021	2,055
2022	1,892



నేడు విద్యార్థి నిరుద్యోగ మార్చ్

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి గన్ పార్క్ వరకు విద్యార్థి నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నట్లు టీఎస్ జాక్ పేర్కొంది.



'గుడ్ స్కూల్ యాప్' ప్రారంభం

మాదాపూర్: విద్యార్థులకు గుడ్ స్కూల్ యాప్ ఎంతో ఉపయోగకరమని సినీ నటుడు అడివి శేష్ పేర్కొన్నారు. గురువారం మాదాపూర్‌లో ఆయన గుడ్‌స్కూల్ యాప్‌ను ప్రారంభించారు.



శుక్రవారం ఇఫ్తార్	శనివారం సహర్
సా.06:55	ఉ.04:55



సుందరంగా మెట్లబావి



సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్‌లోని చారిత్రక కోనేరు బావి (మెట్లబావి) చెత్తా చెదారం, వ్యర్థాల డంప్‌తో అస్తవ్యస్తంగా మారిన దుస్థితిపై 'అలనాటి అద్భుత కట్టడం కోనేరు బావి' శీర్షికన 2014లో 'సాక్షి' మొదటి కథనం ప్రచురించింది. పాలకుల నిర్లక్ష్యంతో నిరాదరణకు గురవుతోందని హెచ్చరించింది. అంతటితో ఆగిపోకుండా 'మసకబారుతున్న చారిత్రక వైభవం' పేరిట మరిన్ని కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక కట్టడాల పరిరక్షణకు నడుం బిగించింది. 2022 సంవత్సరంలో హెచ్ఎండీఏ ద రెయిన్ వాటర్ ప్రాజెక్టుతో కలిసి కోనేరు బావి సుందరీకరణకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.10 కోట్లతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

రూ.15 కోట్ల సర్కారు స్థలానికి రక్షణ

గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న రూ.15 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంపై కన్నేసిన ఓ వ్యక్తి.. దాని చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశాడు. ఈ కబ్జా బాగోతాన్ని 'సాక్షి' 5 జూన్ 2022న వెలుగులోకి తెచ్చింది. 'ఎవరేం చేసినా నేనింతే' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చి సదరు స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చివేసి ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు.

'డబుల్' సంతోషం.. సాక్షితోనే..

ఎన్నో ఏళ్లుగా అగ్గిపెట్టెల్లాంటి ఇరుకు ఇళ్లలో పేదలు దుర్భర జీవనం సాగిస్తున్నారనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఐడీహెచ్ కాలనీలో సాక్షి జనసభ నిర్వహించింది. కార్యక్రమంలో ఐడీహెచ్ కాలనీవాసులు గళమెత్తారు. శిథిలమైన ఇళ్లలో తమ జీవితాలు దినదిన గండంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సాక్షి దినపత్రిక చర్చకు తెరలేపడంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014లో ఐడీహెచ్ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కదలిక ప్రారంభమైంది. సెప్టెంబర్ 1, 2014న సీఎం కేసీఆర్ ఐడీహెచ్ కాలనీలో పర్యటించి ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. 396 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి 2015 నవంబర్ 17న సీఎం కేసీఆర్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు.



040-21111111

'సాక్షి' ఫోన్‌ఇన్‌తో అందుబాటులోకి జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్

ప్రజల పక్షాన గళమెత్తిన 'సాక్షి' : సోమేశ్‌కుమార్

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'సాక్షి' ఆధ్వర్యంలో కమిషనర్‌తో గతంలో 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వెల్లువెత్తిన ఫిర్యాదులకు స్పందిస్తూ అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ప్రజలందరికీ తేలిగ్గా గుర్తుండిపోయేలా 24 గంటలు పనిచేసే కాల్‌సెంటర్ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అలా అందుబాటులోకి వచ్చిందే జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్ నంబర్ 040–21 11 11 11. అంతేకాదు.. ఆ రోజు ప్రజల నుంచి వచ్చిన పలు ఫిర్యాదులతో పాటు కొన్ని సూచనలూ ఉన్నాయి. అలా అందిన సూచనల్లోంచి అమలు చేస్తున్నవే తడి–పొడి చెత్త వేరు చేయడం, కొన్ని మొక్కలైనా పెంచాలని ఇంటి నిర్మాణ అనుమతుల నిబంధనల్లో పొందుపరచడం తదితరమైనవి. ఏయే ప్రాంతంలో పారిశుద్ధ్య బాధ్యతలెవరివో ప్రజలందరికీ తెలిసేలా స్థానికంగా బోర్డులు ఏర్పాటు చేస్తామనీ అప్పుడే ప్రకటించారు. నగరంలోని శ్మశాన వాటికల్లో దశలవారీగా మెరుగైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. అలా ఏర్పాటైందే నగరంలోని మొదటి 'మహాప్రస్థానం'. ఇప్పుడు అన్ని జోన్లలోనూ మహాప్రస్థానాలు అందుబాటులోకి వస్తున్నాయి. కోవిడ్ తరుణంలో కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసిన వారికి ఇళ్లవద్దకే అన్నపూర్ణ భోజనాలు పంపిణీ చేశారు. అలా ఆపత్కాలంలో లక్షల మందికి ఆకలి బాధ తీరింది.

నిర్మొహమాటంగా..

పారిశుద్ధ్యం తదితర అంశాల్లో అధికారుల పనితీరు బాగాలేదని సైతం ఆనాటి కార్యక్రమంలో ప్రజలు నిర్మొహమాటంగా కుండబద్దలు కొట్టారు. ఆయా సమస్యలపై గళమెత్తారు. అన్నింటినీ సావధానంగా విన్న అప్పటి కమిషనర్ 'నేను సోమేశ్‌కుమార్‌ను మాట్లాడుతున్నాను' అంటూ ప్రజలతో కలిసిపోయారు. ఇలాంటి వేదికల ద్వారానే ప్రజాభిప్రాయం తెలుస్తుందని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఫిర్యాదులతో పాటు సూచనలు కూడా రావడం ముదావహమన్నారు. ప్రజాభిప్రాయానికనుగుణంగా తగిన చర్యలు చేపట్టారు.

ఆనాడే వినియోగంలోకి..

- ప్రస్తుతం గ్రేటర్ నగరంలో ఏ సమస్యకైనా, ఫిర్యాదుకైనా ప్రజలు ఫోన్ చేస్తున్న నెంబర్ ఆనాడు వినియోగంలోకి తెచ్చిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్లపై చెత్త నుంచి వెలగని వీధి దీపాలు, ఆహార కల్తీ, రోడ్లపై గుంతలు, దోమలు, వరద ముంపులు.. ఇలా సమస్య ఏదైనా కార్యాలయాల దాకా వెళ్లకుండా ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు అందుబాటులో ఉన్న నెంబర్. ఫిర్యాదును స్వీకరించే సిబ్బంది సంబంధిత అధికారులకు సమస్య చేరవేస్తారు. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. ప్రజలు తమ గోడు తెలిపేందుకు ఒక మార్గం లభించింది. అనంతరం మొబైల్ యాప్ వంటివి సైతం తీసుకొచ్చారు.



అందరికీ ప్రయోజనకరంగా

ప్రజల కోసం 'సాక్షి' దినపత్రిక ఎన్నో మంచి కార్యక్రమాలు తలపెట్టింది. ప్రజా సమస్యలను ఎన్నోసార్లు లేవనెత్తింది. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చాలా వార్తా కథనాలు ఇచ్చింది. వివిధ స్థాయిల్లో ఫోన్ ఇన్ వంటి కార్యక్రమాలు నిర్వహించింది. వీటితో ప్రజలకు చాలా ప్రయోజనం కలిగింది. ఫోన్ ఇన్ సందర్భంగానే నేను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్నప్పుడు అందరికీ సులభంగా గుర్తుండే.. 24 గంటలపాటు పని చేసే కాల్‌సెంటర్ నెంబర్ 040–2111 11 11 అందుబాటులోకి తెచ్చాం. ప్రస్తుతం అన్ని సమస్యలకు, ఫిర్యాదులకు ప్రజలందరికీ తెలిసిన నెంబర్‌గా మారింది.

– సోమేశ్‌కుమార్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి



సాక్షి, నెట్‌వర్క్: భాగ్యనగరానికి జనగళమై నిలిచింది. పట్నవాసుల సమస్యలకు పట్టం కట్టింది. పాలక పక్షాలను ప్రశ్నించే అక్షర శస్త్రాలను సంధించింది. గుండె గొంతుకలోని గోడును ప్రతిబింబించింది. నగర జీవన శైలిని కళ్లకు కట్టింది. యువ తరానికి కరదీపికలా మారింది. నవతరానికి నాందీ వాచకమైంది. అతివలకు అండగా నిలిచింది. అసహాయులకు ఆలంబన అయింది. అధికార యంత్రాంగానికి సింహ స్వప్నమైంది. మానవీయ కథనాలకు మూలస్థానమైంది. బాధామయ గాథలను వెలుగులోకి తెచ్చింది. వాస్తవికతను ప్రోది చేసి స్ఫూర్తిదాయకమైంది. సిటీ గళసీమపై హారంలా నిలిచి.. ఇలా ఎన్నో.. అంశాలను గుదిగుచ్చి.. 15 వసంతాలుగా నిత్యనూతనమైన వార్తా కథనాలతో నగరవాసుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది 'సాక్షి'. సిటీజనుల మనస్సాక్షి!

రూ.20 కోట్ల విలువైన భూమిని కాపాడి..

దశాబ్దాల తరబడి కబ్జాదారుల కబంధహస్తాల్లో చిక్కుకున్న చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ భూమి ఆక్రమణలపై దర్జాగా ఆలయ భూమి కబ్జా అనే ప్రత్యేక కథనం 2013లో 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన న్యాయస్థానం 'సాక్షి' కథనాన్ని సుమో టోగా స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమణదారుడిపై కేసు నమోదు చేయమని ఆదేశారులు జారీ చేసింది. దీంతో రెవెన్యూ అధికారులు స్వామివారి భూమిని సర్వే చేయించగా రూ.20 కోట్ల విలువైన 15 గుంటల భూమి ఆక్రమణకు గురైందని నిగ్గు తేల్చారు.

గప్‌చిప్‌గా ట్యాంపరింగ్

పెట్రోల్ బంక్‌ల్లో హైటెక్ టెక్నాలజీ ట్యాంపరింగ్‌తో మెజర్‌మెంట్‌లో మోసాలకు జరుగుతున్నాయంటూ సాంకేతిక ఆధారాలతో క్షేత్రస్థాయి పరిశోధనాత్మక కథనం 2021 జూలై 5న ప్రచురితం కావడంతో తూనికలు, కొలతల శాఖ అధికారులు స్పందించారు. పలు పెట్రోల్ బంక్‌లపై దాడులు జరిపారు. డిస్పెన్సరీ యూనిట్ల టెక్నాలజీకి అనుగుణంగా అప్‌డేషన్ మెకానిజంతో ట్యాంపరింగ్ జరిగినట్లు మొదటిసారి గుర్తించారు. అప్పటి నుంచి పెట్రోల్ బంక్‌ల టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. దీంతో కొంత మేరకు ఆధునిక సాంకేతిక మోసాలకు కట్టడి పడింది.

కథనాలతో కదలిక!

సరోగసీపై ఆంక్షలకు పురుడు..

- జమైకాకు చెందిన తండ్రి, అమెరికాకు చెందిన తల్లి నగరంలోని ఓ ప్రముఖ ఫెర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ ద్వారా బిడ్డకు జన్మనిచ్చారు. పుట్టిన బిడ్డకు పాస్‌పోర్ట్ ఇవ్వడానికి అధికారులు నిరాకరించారు. దీంతో పాపను తల్లిదండ్రులు పాస్‌పోర్ట్ ఆఫీసులోనే వదలివెళ్లారు. ఈ ఘటనపై 'సాక్షి'లో ఈ బిడ్డది ఏ దేశం? అంటూ.. ప్రత్యేక కథనం ప్రచురితమైంది. సరోగసీ ప్రసవాలపై 'సాక్షి' కథనం అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత విదేశీయులు ఇక్కడ సరోగసీ ద్వారా బిడ్డకు జన్మనిచ్చే అంశాన్ని ప్రభుత్వం నిషేధించింది. స్థానిక సరోగసీ ప్రసవాలపై కూడా అనేక ఆంక్షలు విధించింది. అద్దెకు అమ్మ కడుపు శీర్షికన కూడా 'సాక్షి' ప్రత్యేక కథనాలను ప్రచురించింది.

పసికందులపై క్లినికల్ ట్రయల్స్..

- నిలోఫర్ ఆస్పత్రిలో పసికూనలపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్న అంశాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఇదే అంశంపై అప్పట్లో పెద్ద చర్చ కూడా జరిగింది. ప్రభుత్వం చిన్నారులపై నిర్వహించే క్లినికల్ ట్రయల్స్‌పై ఆంక్షలు విధించింది.

ఆస్పత్రుల్లో అవినీతిపై..

- ఉస్మానియా సహా నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో జరుగుతున్న అవినీతిని వెలుగులోకి తెచ్చింది. అప్పట్లో గౌరీ శానిటేషన్ ఏజెన్సీని రద్దు చేసి, కేసు నమోదు చేసి, జైలుకు కూడా పంపింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య ఉద్యోగుల హాజరుపై ఆ తర్వాత అనేక సంస్కరణలు చేపట్టడంలో 'సాక్షి' చూపిన చొరవ అనుపమానం.

డిస్కంలో బకాయిలపై..

- డిస్కంలో ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించని యూనియన్ల తీరును బకాయి.. లడాయి శీర్షికన ప్రత్యేక కథనంతో ఎండగట్టింది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లించే వరకు వరుస కథనాలు ప్రచురించింది. అంతేకాదు కొత్త కనెక్షన్ల మంజూరు, ప్యానల్ బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు తదితర అంశాలపై ప్రత్యేక కథనం ప్రచురించింది. ముగ్గురు ఏడీఈలు, నలుగురు ఏఈలపై వేటుకు 'సాక్షి' దోహదపడింది.

అనైతిక వైద్యాన్ని నిలదీసి..

- నిఖిల్‌రెడ్డికి ఎత్తు పెంపు సర్జరీ అంశాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వెలుగు చూస్తున్న అనైతిక వైద్యంపై రాసిన కథనం వైద్యారోగ్య శాఖను అప్పట్లో ఓ కుదుపు కుదిపివేసింది. సర్జరీ చేసిన వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆంక్షలు విధించింది. అయిదేళ్ల పాటు వారి ప్రాక్టీస్‌ను సస్పెండ్ చేసింది.

ఆణిముత్యాలకు అండగా..

- పేద కుటుంబంలో పుట్టి టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ఆణిముత్యాలకు సాక్షి అండగా నిలిచింది. దాతలను సమీకరించి.. వారికి ఉన్నత చదువులు చదివించే విషయంలో అండగా నిలిచింది.

గాంధీ పాదం.. భాగ్యపథం

నగరంలో మహాత్ముడి అడుగుజాడలపై ఆయన 150వ జయంతి సందర్భంగా రాసిన ఈ కథనంలో మహాత్మాగాంధీ హైదరాబాద్‌కు ఎన్నిసార్లు వచ్చారు. ఎక్కడ బస చేశారు. ఏయే సభల్లో ప్రసంగించారు అనే వివరాలతో ఇచ్చిన కథనం ప్రత్యేకంగా ఆకట్టుకుంది.

అశ్రు తడి.. ఆశ్రమ ఒడి

వృద్ధాప్యంలో ఎదురయ్యే సమస్యలపై వెలువరించిన మానవీయ కథనం ఇది. కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు. ఒంటరితనంతో డిప్రెషన్‌కు లోనవుతున్నారు. తమ రెక్కల కష్టంతో కట్టించిన ఇల్లే తరిమేస్తున్నాయి. చివరకు వృద్ధాశ్రమాల్లో చేరి అయిన వారికందరికీ దూరంగా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న దైన్యం కథనం ఇది.

చేతులు కలిశాయి.. ఆకలి తీర్చాయి..

కోవిడ్ కాలంలో మానవత్వం మహా సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో పట్టెడన్నం కోసం వేలాది మంది పడిగాపులు కాశారు. ఆకలితో అల్లాడిపోయారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ముందుకు వచ్చి కోవిడ్ బాధితులకు, వలస కూలీలకు నగరమంతటా తిరిగి ఆహారం, నీళ్లు అందజేశారు. ఈ సహాయం ఎంతో గొప్పగా నిలిచింది. ఈ పరిణామాలపై ఇచ్చిన కథనం ఎంతోమందిని కదిలించింది.



నగర జీవన శైలికి అద్దం పట్టిన కథనాలు

ప్రజా గొంతుకై ప్రశ్నించిన అక్షర శరాలు

15 వసంతాలుగా 'పట్నం' హృదయసీమపై చెరగని ముద్ర

సంక్షేమ హాస్టళ్ల 'విజిట్'

సమస్యలకు నిలయంగా మారిన సంక్షేమ హాస్టళ్లపై 2014లో 'సాక్షి' విజిట్ నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లింది. చంపాపేట, ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌ను విజిట్ చేసి శిథిలావస్థకు చేరిన అద్దె భవనాలు, ఇరుకు గదులు, అస్తవ్యస్తంగా మారిన బాత్‌రూమ్‌లు తదితర సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో విద్యార్థులు సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అఘాయిత్యంలో ఎమ్మెల్యే కొడుకు..

జూబ్లీహిల్స్ అమ్నీషియా పబ్‌లో రొమేనియా దేశానికి చెందిన బాలికను పరిచయం చేసుకొని బెంజ్ కారులో తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై సాక్షి వరుస కథనాలు ప్రచురించి ఓ ఎమ్మెల్యే కొడుకు ఉన్నట్లు వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో ఆ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. రంగంలోకి దిగిన పలు బృందాలు వెంటనే నిందితులను అరెస్టు చేశాయి.

పేలుడు పదార్థాల రవాణాపై..

మన రాష్ట్రంతో పాటు ఆయా రాష్ట్రాలకు ఇష్టానుసారంగా పేలుడు పదార్థాలు సరఫరా అవుతున్నాయి. నగర శివారుల్లోని పరిశ్రమల్లో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను తయారు చేసి డీలర్లకు వారి నుంచి రిటైలర్లకు విక్రయిస్తున్నారు. దాంతో ఇష్టానుసారంగా పేలుడు పదార్థాలను వినియోగిస్తుండటంతో కార్మికులు మృతి చెందుతున్నారని, దాంతో పాటు మావోయిస్టులకు సైతం పేలుడు పదార్థాలు అందుతున్నాయని సాక్షి ప్రత్యేక కథనాలు ప్రచురించింది.

పండుటాకును చిదిమేశారని..

- రాజధాని నగరంలో రియల్ ఎస్టేట్ బూమ్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ నేపథ్యంలో జరిగిన అనేక నేరాలు వెలుగులోకి వచ్చాయి. ఫోర్జరీలు, కిడ్నాప్‌లు, హత్యలు, హత్యాయత్నాలు, దాడులు వంటి తీవ్రమైన నేరాలు పోలీసు రికార్డుల్లోకి ఎక్కాయి. వీటిని తలదన్నుతూ పక్కా సినీ ఫక్కీలో దగా, మోసం, హత్య చిక్కడపల్లి ఠాణా పరిధిలో కేవలం రూ.3 కోట్ల విలువైన స్థలం కోసం చోటు చేసుకుంది. సమాజానికి ఎంతో కీలకమైన, సేవ చేయాల్సిన డాక్టర్, లాయర్, సబ్–రిజిస్ట్రార్, పోలీసు, ఫోరెన్సిక్ వైద్యుడు ఓ రౌడీషీటర్‌తో కలిసి చేసిన భారీ కుట్రతో జరిగిన ఈ హత్యోదంతాన్ని 2013 ఫిబ్రవరిలో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. 'పండుటాకును చిదిమేశారు', 'క్లోరోఫామ్‌తో చంపేశారు' శీర్షికతో రెండు రోజులు సీరియల్‌గా ప్రచురించింది.

కమలాకర్ నేర బాటపై..

- విజయవాడకు చెందిన అతడి పేరు కమలాకర్.. చిన్నతనంలోనే నేరబాటపట్టాడు.. గురువు బ్యాగ్‌తోనే చోరీలు మొదలెట్టాడు.. మెళకువల కోసం ఓ దొంగల క్షేత్రంలో శిక్షణ పొందాడు.. 'సొంత తెలివి'తో ఘరానా దొంగగా మారాడు.. నేరగాళ్ల ఆక్షన్‌లో రూ.20 లక్షల రేటు పలికాడు.. పలువురిని వెంటేసుకుని నేరాలు చేస్తూ 'ఆదుకుంటున్నాడు'.. తెలుగు రాష్ట్రాల్లో వందకు పైగా నేరాలు చేసిన ఈ దొంగనా దొంగ వ్యవహారశైలిపై 'సాక్షి' 2015లో వరుస కథనాలు అందించింది. 'కిక్ కమలాకర్', 'వేలం దొంగకు వెర్రెత్తే రేటు' శీర్షికలతో ఇవి ప్రచురితమయ్యాయి.

వేలికి నకిలీ ముద్ర

వేలిముద్రల ఆధారంగా పని చేసే బయోమెట్రిక్ విధానాలు అత్యంత భద్రమైన మార్గంగా భావిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు అవలంభిస్తున్నాయి. విశిష్ట గుర్తింపు సంఖ్యగా పిలిచే 'ఆధార్' గోప్యతపై దేశవ్యాప్తంగా భారీ చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కరీంనగర్ సమీపంలోని పెద్దపల్లి జిల్లా ధర్మారానికి చెందిన యువకుడు పాత సంతోష్ కుమార్ ఈ రెండు వ్యవస్థలకూ సవాల్ విసిరాడు. రిజిస్ట్రేషన్స్ శాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన వివరాలతో అడ్డదారిలో నకిలీ వేలిముద్రలు తయారు చేసి, ఆధార్ ఈ–కేవైసీ విధానాన్నే ఏమార్చి వరుసపెట్టి సిమ్‌కార్డులు యాక్టివేట్ చేసుకుంటూ వెళ్లారు. దీన్ని వెలుగులోకి తెస్తూ 2018లో 'సాక్షి'.. 'వేలికి నకిలీ ముద్ర' శీర్షికన కథనం అందించింది.

క్షిపణుల డేటా.. దేశం దాటిందని..

అత్యంత గోప్యంగా ఉండాల్సిన దేశ రహస్యాలు పాకిస్థాన్, చైనా దేశాలకు చేరాయి. హనీట్రాప్‌లో చిక్కుకున్న నగరానికి చెందిన డీఆర్‌డీఓ ఆధీనంలోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ కాంప్లెక్స్(ఆర్సీఐ) ఇంజినీర్ మల్లికార్జున్‌రెడ్డి అత్యంత కీలకమైన డేటాను దేశం దాటించాడని కేంద్ర నిఘా వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో డీఆర్‌డీవో, ఆర్సీఐలో భద్రతా లోపాలపై నిఘా వర్గాలు హెచ్చరించాయని సాక్షి కథనం ప్రచురించింది.

ఓయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉన్నత విద్య, సుస్థిర అభివృద్ధి అంశంపై నిర్వహించనున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ వీసీ ప్రొ.తిరుపతిరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. సుస్థిర అభివృద్ధి సాధించడంలో ఆర్థికశాస్త్రం, పర్యావరణం, సామాజిక సమానత్వం ముఖ్య పాత్రలు పోషించాలని మాజీ వీసీ ప్రొ. వర్గీస్ తన కీలకోపన్యాసంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఈపీ మాజీ డైరెక్టర్ ప్రొ.ఆర్కే మిశ్ర, సదస్సు కన్వీనర్ ప్రొ.చంద్రునాయక్, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, ప్రొ.చెన్న బసవయ్య, ప్రొ.రమా మెల్కొటే, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు



మీర్‌పేట: వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన మీర్‌పేటలో చోటు చేసుకుంది. వివరాలివీ... ఆర్ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన వెంకటేష్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య మేఘా, జున్ను(18) నెలల కుమారుడు ఉన్నారు. ఉగాది పండగకు మీర్‌పేట కేశవరెడ్డినగర్‌లో ఉంటున్న మేఘా తల్లిగారింటికి వచ్చారు. గురువారం ఉదయం ఇంటి వరండాలో చిన్నారి జున్నును తల్లి ఆడిస్తూ దుస్తులు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లింది. ఆ సమయంలో గేటు తెరిచే ఉండటంతో లోపలికి వచ్చిన కుక్కలు జున్నుపై దాడి చేయగా చెవి, ముక్కు, వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చిన్నారిని నారాయణగూడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక కార్పొరేటర్ అక్కి మాధవి చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాలనీలో ఇది రెండో సంఘటన అని అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపించారు.

త్రైమాసిక పన్నుల్లో మాయాజాలం

- కాలపరిమితిలో తప్పుడు లెక్కలు..
- పన్ను చెల్లింపుల్లో ఏజెంట్‌ల చేతివాటం
- కోవిడ్ కాలం నుంచి పన్ను చెల్లించని వాహనాలు

సాక్షి, సిటీబ్యూరో : వాహనాల త్రైమాసిక పన్నుల్లో మాయాజాలం నెలకొంది. కోవిడ్ కాలం నుంచి పన్ను చెల్లించని వాహనాల నుంచి త్రైమాసిక పన్ను వసూళ్ల కోసం రవాణాశాఖ ఒక వైపు పెద్ద ఎత్తున ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తుండగా మరోవైపు కొందరు ఏజెంట్‌లు ఆర్టీఏ సిబ్బంది సహకారంతో తప్పుడు లెక్కలతో ఫీజు చెల్లింపులకు గండి కొడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని వాహనాలు రెండేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో పెండింగ్ బకాయిలను రాబట్టేందుకు ఫిబ్రవరి నుంచి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు ఈ డ్రైవ్ కొనసాగనుంది. కొందరు వాహనదారులు స్వచ్ఛందంగా వచ్చి పన్ను చెల్లిస్తుండగా మరి కొందరు చెల్లింపులపైన ఇంకా జాప్యం చేస్తున్నారు. దీంతో మోటారు వాహన తనిఖీ అధికారుల బృందాలు అలాంటి వాహనాలను గుర్తించి జప్తు చేస్తున్నాయి. ఇలా స్వాధీనం చేసుకున్న వాటిపై 200 శాతం వరకు పెనాల్టి చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే పలుచోట్ల ఏజెంట్‌లు జోక్యం చేసుకుని వాహనదారులకు లబ్ధి చేకూర్చేందుకు ఒప్పందం చేసుకుంటున్నారు. నిబంధనల మేరకు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నుతో పాటు పెనాల్టి మొత్తంలో కోత విధిస్తున్నారు. పలుచోట్ల ఆర్టీఏ సిబ్బంది సహకారంతో తప్పుడు లెక్కలు సృష్టిస్తున్నట్లు సమాచారం. దీంతో రవాణాశాఖకు లెక్క ప్రకారం రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారు.

లెక్కల్లో తేడాలు...

ఉదాహరణకు 2020 నుంచి పన్ను చెల్లించకుండా తిరుగుతున్న ఒక మ్యాక్సీక్యాబ్ 6 నుంచి 8 త్రైమాసిక ఫీజులు చెల్లించాల్సి ఉండగా ఒకటి, రెండు త్రైమాసికాలను తగ్గిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సుమారు రూ.65 వేల వరకు చెల్లించాల్సిన ఫీజు ఏకంగా రూ.50 వేలకు తగ్గుతుంది. ఇలా తప్పుడు లెక్కలతో ఏజెంట్‌లు ఒక్కో వాహనంపైన రూ.5000 నుంచి రూ.10 వేల వరకు కోత పెట్టేస్తున్నారు. భారీ వాహనాలపైన ఇది ఇంకా ఎక్కువగానే ఉంటుంది. వాహనదారులకు లబ్ధి చేకూర్చడంతో కొంత మొత్తాన్ని కమీషన్ రూపంలో వసూలు చేస్తున్నారు. బకాయిల వసూళ్ల కోసం రవాణాశాఖ ఎంవీఐలకు టార్గెట్‌లు విధించింది. ప్రతి రోజు కనీసం రూ.7 లక్షల వరకు రాబట్టాలని సూచించింది. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రంగంలోకి దిగినా టార్గెట్‌లను పూర్తి చేయలేకపోతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక అధికారి పేర్కొన్నారు. 'ఎన్ని వెహికల్ రిపోర్టులు రాసినప్పటికీ టార్గెట్ పూర్తి కావడం లేదు. వాహనాల నుంచి పన్ను వసూలుకు సంబంధించిన కాలపరిమితిని తగ్గించడం వల్లనే పెనాల్టీలు భారీగా తగ్గుతున్నట్లుగా ఉంది.' అన్నారు. తాము రాసే వెహికల్ చెక్ రిపోర్టుల్లో వాహనం వివరాలతో పాటు 'వితౌట్ ట్యాక్స్' అని నమోదు చేస్తామని, ఎన్ని త్రైమాసికాలు అనేది తేల్చాల్సింది కింది స్థాయి సిబ్బంది విధి అని చెప్పారు.

పన్ను చెల్లించని వాహనాలు వేలల్లో....

రవాణా వాహనాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ కోవిడ్ కాలం నుంచి కనిష్ఠంగా 3 నెలల కాలపరిమితి నుంచి గరిష్ఠంగా 18 నెలల వరకు పన్ను చెల్లించాల్సిన వాహనాలు వేలల్లోనే ఉన్నాయి. రెండేళ్లుగా త్రైమాసిన పన్ను ఎగవేత వాహనదారుల జాబితా భారీగా పెరిగినట్లు అంచనా. వీటిలో ఎక్కువ శాతం వస్తు రవాణా వాహనాలే. ఈ క్రమంలో రవాణాశాఖ తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టి సారించింది. గ్రేటర్‌లోని మూడు జిల్లాలతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన మోటారు వాహన తనిఖీ అధికారులకు టార్గెట్‌లు విధించారు.

నగరంలో నేడు

- రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, తిరుమల బ్యాంక్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 10 గంటల వరకు రవీంద్రభారతిలో సీల్‌వెల్ సినీ సుస్వరాలు–32 కార్యక్రమం జరుగుతుంది.
- హైటెక్ సిటీ హెచ్ఐసీసీలో ఉదయం 11.30 గంటల నుంచి మిల్లెట్స్ కాన్ఫరెన్స్–2023 జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని డాగ్ పార్క్‌లో ఉదయం 7.45 గంటలకు డాగ్ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుంది.

నకిలీ ఫ్రాంఛైజీ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: ఫ్రాంచైజీలు, డీలర్ షిప్‌లు ఇప్పిస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నకిలీ వెబ్ సైట్లు సృష్టించి ఫ్రాంచైజీలు, డీలర్ షిప్‌లు ఇప్పిస్తామని ఫేస్‌బుక్, గూగుల్, యూ ట్యూబ్‌లలో ప్రకటనలు ఇస్తున్నారు. ఈ క్రమంలో బాచుపల్లికి చెందిన వ్యక్తి కేఎఫ్‌సీ ఫ్రాంచైజీ కోసం వెబ్ సైట్లో సంప్రదించాడు. ఫ్రాంచైజీ, అగ్రిమెంట్, ఎన్ఓసీ ఫీజులు, ఇంటీరియర్, మౌలిక వసతుల పేరిట అతడి నుంచి రూ.94.95 లక్షలు వసూలు చేశారు. నెలలు గడిచినా ఫ్రాంచైజీ విషయమై ఎవరూ స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నోయిడా కేంద్రంగా ఈ దందా నడుస్తున్నట్లు గుర్తించారు. రాకేష్ కుమార్ అలియాస్ ఆదిత్య సింగ్, మహ్మద్ ఖాలీద్, యోగేందర కుమార్, పంకజ్ సరస్వత్, సరిత, రోషిని సింగ్ గౌతమ్‌లు ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వీరు 28 నకిలీ వెబ్ సైట్లు సృష్టించి మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 7 సెల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 5 సీపీయూలు, ఎల్ఈడీ ప్రొజెక్టర్, చెక్ బుక్‌లు, డెబిట్, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కల్మేశ్వర్, సైబర్‌క్రైమ్ ఏసీపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సు రద్దులో జాప్యం చేయొద్దు

ఆర్టీఏ అధికారులకు ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జి.సుధీర్‌బాబు సూచన



జేటీసీ రమేష్‌తో సమీక్షిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జి.సుధీర్‌బాబు

హిమాయత్‌నగర్: డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చిన, ఇతర కారణాలతో డ్రైవింగ్ లైసెన్సులు రద్దయిన వారిని ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గుర్తించాల్సిన అవసరం ఉందని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జి.సుధీర్‌బాబు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో రవాణా శాఖ జాయింట్ కమిషనర్ సి.రమేష్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ..వివిధ కారణాలతో డ్రైవింగ్ లైసెన్సులు రద్దయిన వారు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నారన్నారు. వారిని కట్టడి చేసేందుకు ట్రాఫిక్, ఆర్టీఏ అధికారులు సంయుక్తంగా డ్రైవ్ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. లైసెన్సు రద్దు కోసం ట్రాఫిక్ పోలీసులు సిఫార్సు చేసిన వెంటనే సదరు వాహనదారుడి లైసెన్సు రద్దు చేయాలని సూచించారు. ఈ విషయంలో జాప్యం చేయరాదన్నారు. రద్దీ వేళల్లో భారీ వాహనాలు నగరంలోకి రాకుండా నియంత్రించాలన్నారు. పర్మిట్ లేకుండా వస్తున్న ఇతర ప్రాంతాలకు చెందిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇరు శాఖలు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌పై ప్రతి నెల సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మైలవరపు శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న రమణాచారి

చిక్కడపల్లి: వంశీ సంస్థ చేపట్టిన ఉగాది కళా సాహితీ పురస్కారాల ప్రదానం మహాయజ్ఞ తుల్యమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఇంటర్నేషనల్ నిర్వహణలో వంశీ శుభోదయం, శోభకృత్ నామ సంవత్సర ఉగాది సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ కాలం దైవంతో సమానమని, దానిని సద్వినియోగం చేసుకున్న వారు ఉత్తములన్నారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ భాషకు సంబంధించి చేసుకునే ఏకైక పండుగ ఉగాది అన్నారు. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ ఏర్పాటు చేసిన ఉత్తమ కథా రచయితలు పురస్కారాన్ని ఊహ, సురేంద్ర, శీలం , నాంగేంద్ర కాశీ, ఉమామహేష్‌లకు వీరేంద్రనాథ్ అందజేశారు. తొమ్మిది మందిని ఆదర్శదంపతులు పురస్కారంతో సత్కరించారు. వంశీ శుభోదయం పురస్కారాన్ని ప్రముఖ ప్రవచన కర్త మైలవరపు శ్రీనివాసరావు దంపతులకు డాక్టర్ రమణాచారి అందజేశారు. కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, బొల్లినేని కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

'బలగం'లాంటి సినిమాలు మరిన్ని రావాలి

ఆర్. నారాయణమూర్తి



సాక్షి, సిటీబ్యూరో: 'బలగం' లాంటి సినిమాలు మరిన్ని రావాలని సినీ నటుడు, దర్శక– నిర్మాత ఆర్.నారాయణ మూర్తి అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ హీరో హీరోయిన్లుగా నటుడు వేణు ఎల్దండి దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'బలగం'. 'దిల్' రాజు ప్రొడక్షన్స్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలై, సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శితమౌతుంది. చిన్న సినిమాగా విడుదలై, పెద్ద విజయం సాధించిన 'బలగం' చిత్రం యూనిట్‌ను తెలుగు సినిమా వేదిక ఉగాది నంది సత్కారంతో సత్కరించారు. ఈ వేడుకలో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన నటులు కాదంబరి కిరణ్, రామ్ రావిపల్లి, రవికాంత్, నిర్మాతలు కూనిరెడ్డి శ్రీనివాస్, మోహన్ గౌడ్, గల్ఫ్ వాసు, అని ప్రసాద్, ప్రవీణ నాయుడు, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురిని ఉగాది నంది పురస్కారంతో సత్కరించారు. 'బలగం' చిత్ర నిర్మాతలు హర్షిత్ రెడ్డి, హర్షిత, దర్శకుడు వేణు, హీరో ప్రియదర్శి, హీరోయిన్ కావ్య కల్యాణ్ రామ్, ఇతర నటీ నటులు సాంకేతిక నిపుణులను ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, ఆర్ నారాయణ మూర్తి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ రుద్రరాజు పద్మరాజు నంది పురస్కారంతో సత్కరించారు. ఉగాది రోజున 'బలగం' చిత్రయూనిట్ మొత్తాన్ని సత్కరించిన తెలుగు సినిమా వేదిక అధ్యక్షులు విజయ్ వర్మ పాకలపాటి, చిత్రనిర్మాతలు హర్షిత్ రెడ్డి, హన్షితలతో పాటు చిత్రయూనిట్ కృతజ్ఞతలు తెలిపారు. 'బలగం' లాంటి చిత్రాలు మరిన్ని రావాలని, ఈ చిత్రం ఒక దృశ్యకావ్యమని నటుడు దర్శక–నిర్మాత ఆర్. నారాయణమూర్తి, రుద్రరాజు పద్మ రాజు కొనియాడారు. త్వరలో 'సింహా' పేరుతో పురస్కారాలు ఇచ్చే యోచనలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని అనిల్ కుర్మాచలం వెల్లడించారు.

టాస్క్‌లు ఇచ్చి రూ.43 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: ఉద్యోగం కోసం గూగుల్‌లో సెర్చ్ చేసిన ఇద్దరు యువకులకు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఒకరిని టెలిగ్రామ్ ద్వారా, మరొకరితో వాట్సాప్ ద్వారా పరిచయం చేసుకుని వారి నుంచి రూ.లక్షలు కాజేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం బాధితులిద్దరూ సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..షేక్‌పేటకు చెందిన యువకుడిని ఉద్యోగం ఇస్తామంటూ టెలిగ్రాం ద్వారా ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. టూరిస్టులకు సంబంధించిన పోస్టులను ప్రమోట్ చేయాలని..అలా చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించాడు. 30 టాస్కులు చేయాలని కోరడంతో బాధితుడు రూ.28 లక్షలతో వాటిని పూర్తి చేశాడు. అయితే ఒక్క రూపాయి లాభం ఇవ్వకపోగా ఉన్న వాటిని బ్లాక్ చేశారు. మలక్‌పేటకు చెందిన యువకుడిని వాట్సాప్ ద్వారా పరిచయం చేసుకున్న వ్యక్తి వరల్డ్ డెఫ్ కాయిన్ అనే వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెట్టించి రూ.15లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

అంకితభావంతో సేవలందించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి

రాంగోపాల్‌పేట్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రి ఆడిటోరియంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రజలు ఆరోగ్యవంతులుగా జీవిస్తారన్నారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలు, వ్యాధి నిరోధక టీకాలు, సాంక్రమిక వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు, కంటి వెలుగు, టెలీమెడిసిన్ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీకళ, బస్తీ దవాఖానా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుక్మారెడ్డి, డాక్టర్ ఆశితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అందరికీ శిక్షణ

ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా సడన్ కార్డియాక్ అరెస్టులతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గుండె అకస్మాత్తుగా ఆగిపోవడం వలన శ్వాస ఆగిపోయి వ్యక్తి స్పృహ కోల్పోయి మరణానికి కారణం అవుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వ్యక్తికి కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) చేయడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పని చేస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు అందరికీ సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు దోహదపడుతుందన్నారు.

ఓయూలో హైటెన్షన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పేపర్ లీకేజీ వ్యవహారంపై ఐక్య విద్యార్థి సంఘాలు శుక్రవారం మహా నిరసన దీక్ష, ప్రగతిభవన్‌కు నిరుద్యోగ మార్చ్ చేపట్టనున్నాయి. వీటికి తోడు వర్సిటీలో ఓయూ ఆధ్వర్యంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు జరగనున్నాయి. అయితే నిరుద్యోగుల మహానిరసన దీక్షకు అనుమతి లేదని అధికారులు పేర్కొంటున్నారు. రేవంత్‌రెడ్డి దీక్షకు హాజరైతే అడ్డుకుంటామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు చెబుతుండగా, దీక్ష నిర్వహించి తీరుతామని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేయడంతో టెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేశారు.

హైటెన్షన్ వైర్లు తగిలి మహిళ మృతి

ఉప్పల్: ఇంటిపైన ఆరవేసిన దుస్తులు తీసుకునే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన వికాస్ పాటిల్, పూనమ్ పాటిల్(32) దంపతులు ఉప్పల్ కళ్యాణ్‌పురి కాలనీలో నివాసం ఉంటున్నారు. గురువారం పూనమ్ పాటిల్ ఇంటిపై దుస్తులు ఆరవేసింది. వాటిని తీసుకునేందుకు వెళ్లిన ఆమె వాటిలో కొన్ని హైటెన్షన్ వైర్లకు తగులుకుని ఉండటంతో ఇనుప రాడ్ సహాయంతో వాటిని తీసేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలింది. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- రోడ్డుపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- కుటుంబ కలహాలే కారణంగా గుర్తింపు



గాయపడిన సురేష్

చైతన్యపురి: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జానకిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్బీనగర్ ఎన్టీఆర్ కాలనీకి చెందిన కంచె సురేష్(35) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను తరచూ భార్య మమతతో గొడవ పడేవాడు. దీంతో ఏడాదిన్నరగా ఆమె ఇద్దరు పిల్లలతో సహా విడిగా ఉంటోంది. అప్పటి నుంచి సురేష్ ఒంటరిగా ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి కొత్తపేట చౌరస్తాకు వచ్చిన అతను తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీనిని గమనించిన స్థానికులు మంటలు ఆర్పి పోలీసులు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. 40 శాతం కాలిన గాయాలతో సురేష్ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

అమ్మవార్ల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం.4లోని గాంధీపుర బస్తీలో శ్రీపోచమ్మ-ఎల్లమ్మ అమ్మవార్ల ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం గోపూజ, విఘ్నేశ్వరపూజ, రక్షాబంధనం, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ పూజలు, అగ్నిప్రతిష్ఠ, తదితర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మూలమంత్ర అనుష్ఠానాలు వైభవంగా జరిగాయి. ఈ పూజల్లో పాల్గొనేందుకు బస్తీవాసులతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

రజక సంఘం మహాసభను విజయవంతం చేయండి

రహమత్‌నగర్: ఎల్లారెడ్డిగూడ పీజేఆర్ కమ్యూనిటీ హాల్లో మార్చి 26న జరిగే తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జోన్ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం నగర అధ్యక్షుడు రాపర్తి అశోక్ పిలుపు నిచ్చారు. ఎస్పీఆర్ హిల్స్, బోరబండ ప్రాంతాల్లో శుక్రవారం సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, సామాజిక పీడన, కుల వివక్షకు గురైన రజక వృత్తిదారులను రక్షించుకునేందుకు మహాసభను ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని రజక కులస్తులందరూ మహాసభకు హాజరై ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. నగర నాయకులు భిక్షపతి, యాదగిరి పాల్గొన్నారు.

వాహనం నడిపేవారికి లైసెన్స్ ఉండాలి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని టెనెట్ డయాగ్నిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గురువారం రోడ్డు భద్రతా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేగంపేట టీటీఐ ఏసీపీ జి. శంకర్‌రాజు ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ ఎలా చేస్తారు అన్న విషయంపై మాట్లాడారు. వాహనాలు అతి వేగంగా నడపడం ప్రమాదకరమని అన్నారు. క్రమశిక్షణగా డ్రైవింగ్ చేయాలని, అది తమతో పాటు ఇతరులకు కూడా రక్షణగా ఉంటుందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది వెంకట ప్రసాద్, నర్సింహతో పాటు సంస్థ డీఎం ఎం. నాగరాజు, బషీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు



మసీద్‌లకు మంచినీటి సౌకర్యం

అవసరమైన ప్రాంతాలకు ఉచితంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా

- సీవరేజ ఓవర్‌ఫ్లో లేకుండా పర్యవేక్షణ
- వాల్వ్‌లు, మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు
- రంజాన్ నేపథ్యంలో జలమండలి అధికారుల నిర్ణయం



జలమండలి సెక్షన్ మేనేజర్లతో సమావేశమైన జీఎం హరి శంకర్

బంజారాహిల్స్: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానుండటంతో మసీద్‌ల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు సీవరేజి ఓవర్‌ఫ్లో, మ్యాన్‌హోళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులు నిర్ణయించారు. రంజాన్ సందర్భంగా మసీద్‌ల వద్ద ఏర్పాట్లు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై జలమండలి జీఎం హరిశంకర్ నేతృత్వంలో సెక్షన్ మేనేజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు.

- తాగునీరు, సీవరేజీ వంటి సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయి. వాటిని ఎలా పరిష్కరించాలనే అంశాలపై సమావేశంలో చర్చించారు.
- మసీద్‌ల వద్ద, పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలు లేకుండా చూసుకోవాలని, ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని మేనేజర్లను జీఎం ఆదేశించారు.
- మసీద్‌లకు, అవసరమైన వారికి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.
- మసీద్‌లకు వెళ్లే అన్ని మార్గాల్లోనూ లీకేజీలను అరికట్టడం, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్తగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళ్‌రావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 118 మసీద్‌ల వద్ద నెల రోజుల పాటు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయనున్నట్లు జీఎం హరిశంకర్ తెలిపారు.
- ఏదైనా మసీద్ కమిటీ తాగునీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తే వెంటనే స్పందించాలని మేనేజర్లకు ఆయన సూచించారు.
- ఉచిత తాగునీరు అందించేందుకు ట్యాంకర్లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు.
- జూబ్లీహిల్స్ సెక్షన్ మేనేజర్ రాజేందర్, బంజారాహిల్స్ మేనేజర్ శివకుమార్, తట్టికాన మేనేజర్ రాంబాబు, ఫిలింనగర్ మేనేజర్ పవన్‌కుమార్ తో పాటు ఎల్లారెడ్డిగూడ, వెంగళ్‌రావునగర్, ఎర్రగడ్డ బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎస్ఆర్‌నగర్, ఫతేనగర్, సోమాజిగూడ సెక్షన్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
- తమ సెక్షన్ల పరిధిలో ఉన్న మసీద్‌ల జాబితాను తీసుకున్నారు. సీవరేజి ఓవర్‌ఫ్లో కాకుండా డీసిల్టింగ్ చేయాలని కూడా తక్షణం ఈ నిర్ణయాలను అమలు చేయాలని నిర్ణయించారు.
- ప్రతిరోజూ మసీద్ ప్రాంతాలను సందర్శించి అక్కడ పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు.
- ఉపవాస దీక్షలు, నమాజ్‌లు చేసే వారికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక రోజు ముందు నుంచే ఆయా ప్రాంతాల్లో పర్యటించాలని జీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కేటీఆర్‌కు నోటీసులు ఎందుకివ్వలేదు

- పోలీసులను ప్రశ్నించిన కార్పొరేటర్ విజయారెడ్డి
- సిట్ కార్యాలయం వద్ద నిరసన, అరెస్టు



విజయారెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

హిమాయత్‌నగర్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్‌కు నోటీసులు ఎందుకివ్వలేదని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పోలీసుల్ని ప్రశ్నించారు. గురువారం ఆమె కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి హిమాయత్‌నగర్ స్ట్రీట్-19లో ఉన్న సిట్ కార్యాలయం వద్దకు వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఆమె కొంతసేపు అక్కడ నిరసన తెలిపారు. పోలీసులు ఆమెను అరెస్టు చేసి సుల్తాన్‌బజార్ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ..లీకేజీ వ్యవహారంలో కేటీఆర్ పీఏ తిరుపతి ఉన్నాడంటూ రేవంత్‌రెడ్డి అంటే ఆయనకు నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు... ఆ శాఖకు మంత్రిగా ఉండి ఒక్కోసారి ఒక్కో రకమైన వ్యాఖ్య చేసిన కేటీఆర్‌కు నోటీసులు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని, ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని విజయారెడ్డి డిమాండ్ చేశారు.

ఎన్నాళ్లీ నిర్బంధ కాండ?



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న రోహిణ్‌రెడ్డి

- పోలీసులపై డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి ఫైర్

బంజారాహిల్స్: అనవసరమైన విషయాల్లో తమను హౌస్ అరెస్ట్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి పోలీసులపై విరుచుకుపడ్డారు. గురువారం సిట్ కార్యాలయానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరైన నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే ప్రధాన కాంగ్రెస్ నేతలను ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు హౌస్ అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో నివసించే రోహిణ్‌రెడ్డి ఇంటికి వచ్చిన పోలీసులను ఇదెక్కడి తీరు అని నిలదీశారు. ఎన్నాళ్లీ నిర్బంధ కాండను కొనసాగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రచారాలకు, ఇతర పనులకు వెళ్లకూడదా అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి సిట్ దర్యాప్తుకు వెళ్తే తమను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారంటూ ప్రశ్నించిన ఆయన బయటికి వెళ్లడానికి యత్నించగా సెక్టార్ ఎస్ఐ హరీశ్వర్‌రెడ్డితో పాటు పోలీసులు ఆయన్ను అడ్డుకొని గృహ నిర్బంధంలోఉంచారు.

ప్రధాన నేతల హౌస్ అరెస్ట్..

రేవంత్‌రెడ్డి సిట్ కార్యాలయానికి హాజరయ్యేందుకు వెళ్తున్న నేపథ్యంలో ఆయన వెంట వెళ్లకుండా పోలీసులు గురువారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన నేతలను గృహ నిర్బంధం చేశారు. బంజారాహిల్స్ పోలీసులు రోహిణ్‌రెడ్డితో పాటు అనిల్‌కుమార్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేయగా, జూబ్లీహిల్స్ పోలీసులు షబ్బీర్ అలీ, మల్లు రవి, రాగిడి లక్ష్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు.

భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



నిమ్స్‌లో భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేశ్ తదితరులు



భగత్‌సింగ్ విగ్రహం వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఆమ్‌ఆద్మీ నాయకులు

లక్డీకాపూల్: సర్దార్ భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం నిమ్స్ ఆరోగ్యశ్రీ ఓపీ కార్డు కౌంటర్ వద్ద ఆయన చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ.నరసింహ, మాజీ ప్రధాన కార్యదర్శి బాలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

యోధుల త్యాగాలను మరువరాదు..

లిబర్టీ: దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన యోధుల త్యాగాలను మరువరాదని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పుల్లూరు వెంకటరాజేశ్వరావు అన్నారు. దేశం కోసం ఆత్మబలిదానం చేసిన వారి స్ఫూర్తితో దేశం కోసం పాటుపడాలని కోరారు. స్వాతంత్ర పోరాటయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా గురువారం లోక్‌దళ్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో వారి చిత్రపటాలకు పూలమాలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సంకీర్త, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

'ఆమ్ ఆద్మీ' కాగడాల ప్రదర్శన

లిబర్టీ: స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఏవీ కాలేజీ వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహం నుంచి లిబర్టీ చౌరస్తా వరకు ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా భగత్‌సింగ్ ఆశయాలు సాధిస్తాం.. అమర్‌రహే భగత్‌సింగ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం లిబర్టీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆమ్ ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ, భగత్ సింగ్ యువతలో పోరాట స్ఫూర్తిని రగిలించడంతో పాటు చైతన్యాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. రాముగౌడ్, నాయకులు రాకేష్‌సింగ్, అప్పాన పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యయాతి పద్యనాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఫిలింనగర్: ఆదరణ కోల్పోతున్న రంగస్థల కళాకారులను, కళలను ప్రోత్సహించేందుకు ఫిలింనగర్‌లోని రామానాయుడు కళామండపంలో నిర్వహిస్తున్న ఉగాది నాటకోత్సవాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నాటకోత్సవాల్లో భాగంగా గురువారం ఖమ్మం జిల్లా మధిరకు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యయాతి పద్యనాటకం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. శారదా ప్రసన్న రచించిన ఈ నాటకంలో యయాతిగా చిలువేరు శాంతయ్య, వృషపర్వుడిగా డాక్టర్ నిభనుపూడి సుబ్బరాజు, శుక్రాచార్యుడిగా ఈ. వసంత్‌కుమార్, మంత్రిగా పంచాది రమణారావు, శర్మిష్టగా గుడివాడ లహరి, దేవయానిగా అమృతవర్షిణి, ఇతర పాత్రధారులు అద్భుతంగా నటించి నాటకాన్ని రక్తికట్టించారు. ఈ ఉగాది నాటకోత్సవాలకు స్థానికుల నుంచి మంచి స్పందన లభిస్తోందని నిర్వాహకుడు పొత్తూరి వెంకట సుబ్బారావు తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు ఈ నాటకోత్సవాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

ఆలయాన్ని అభివృద్ధి చేయండి



ఎమ్మెల్యే నాగేందర్‌తో సమావేశమైన గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ గురుబ్రహ్మనగర్ బస్తీలోని రామాలయంతో పాటు లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని బస్తీవాసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు విజ్ఞప్తి చేశారు. బస్తీలోని ఎంతో పురాతనమైన రామాలయం నిధులు లేక శిథిలమైపోతున్నదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆలయాభివృద్ధికి ప్రణాళిక రూపొందించి తన వద్దకు తీసుకొస్తే తన వ్యక్తిగత నిధులతో ఆలయాన్ని అందంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బస్తీవాసులు రాజయ్య, రాజేందర్, ఈశ్వర్‌రావు, వినోద్ రాములు, నాగరాజు, శివకుమార్, కిషోర్, డివిజన్ బీసీ సెల్ ప్రెసిడెంట్ నాగరాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలికల అదృశ్యం

ఫిలింనగర్‌లో 7వ తరగతి విద్యార్థిని..



శిరీష

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వి.శిరీష (12) అనే బాలిక అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైంది. అయితే తమ కుతురిని డబ్బు కోసం కిడ్నాప్ చేశారంటూ తండ్రి వి.కృష్ణ ఆరోపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్‌లో నివసించే వి.శిరీష స్థానికంగా ఏడో తరగతి చదువుతోంది. ఈ నెల 12న ఉదయం తల్లిదండ్రులు జీహెచ్ఎంసీలో పనులకు వెళ్లగా, ఇంట్లో ఉన్న సోదరి కనిపించడం లేదంటూ కొడుకు నరేష్ తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. హుటాహుటిన ఇంటికి చేరుకున్న కృష్ణ, సుజాత దంపతులు అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. తనకు వరుసకు మేనల్లుడు వి.మల్లేష్ (22) కూడా కనిపించడం లేదని, అతడిపైనే తమకు అనుమానం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కృష్ణ పేర్కొన్నాడు. డబ్బుల కోసం తన కుతురిని కిడ్నాప్ చేశారని, సీసీ కెమెరా ఫుటేజీలో మల్లేష్ తల్లి సరోజమ్మ తన కూతురిని తీసుకెళ్తున్న దృశ్యం కనిపించిందన్నారు. మల్లేష్ ఇటీవల తనను రూ. 50 వేలు అడిగాడని, తాను లేవని చెప్పడంతో కక్ష పెంచుకొని తన కూతురికి మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశారని ఆరోపించారు. బంజారాహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నారు. శిరీష ఆచూకీ తెలిసిన వారు 8712660458 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

బంజారాహిల్స్‌లో 9వ తరగతి విద్యార్థిని..

బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో 9వ తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్ నం 10లోని నూర్‌నగర్‌లో నివసించే అఫ్రీన్ బేగం(14) సెయింట్ నిజామియా హైస్కూల్‌లో చదువుతోంది. ఈ నెల 21న జహీరానగర్‌లోని షాహిన్ కన్వెన్షన్ హాల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీకి హాజరైంది. రాత్రి 11 గంటల ప్రాంతంలో సోదరుడు హనీఫ్ ఫోన్ చేయగా కార్యక్రమం ఇంకా జరుగుతున్నదని, కొద్దిసేపట్లో వస్తానని తెలిపింది. అయితే సోదరుడు కొంత సమయం తర్వాత హాల్ వద్దకు వచ్చి చూడగా కనిపించలేదు. రాత్రి ఒంటిగంట వరకు బంధుమిత్రుల ఇళ్లల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో షాహిన్ కన్వెన్షన్ హాల్ నుంచి రాత్రి 11.30 గంటల ప్రాంతంలో తన చెల్లెలు అదృశ్యమైందని పోలీసులకు హనీఫ్ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగి డ్రైవింగ్ చేసిన తొమ్మిది మందికి జైలు

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గురువారం నాంపల్లిలోని నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వీరిలో యూసుఫ్‌గూడకు చెందిన ఎం.మల్లేష్‌కు ఐదు రోజులు, శ్రీనగర్ కాలనీకి చెందిన రమణమూర్తికి మూడు రోజులు, పశ్చిమగోదావరిజిల్లాకు చెందిన ఎస్ఆర్ఎస్ వర్మకు మూడు రోజులు, కడపకు చెందిన దివ్య స్వరూప్‌కు ఆరు రోజుల జైలు శిక్ష విధించారు. బంజారాహిల్స్‌కు చెందిన మోజంకు ఐదు రోజులు, ఖైరతాబాద్‌కు చెందిన జగన్నాథదాసుకు నాలుగు రోజులు, అంబర్‌పేటకు చెందిన సతీష్‌రెడ్డికి రెండు రోజులు, కుంట్లూరుకు చెందిన గోపీచంద్‌కు రెండు రోజులు, బోడుప్పల్‌కు చెందిన వంశీకి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మొత్తం 30 మందిని న్యాయస్థానంలో హాజరుపర్చగా..ఇందులో తొమ్మిది మందికి జైలు శిక్షతో పాటు మిగతా వారికి జరిమానాలు విధించారని, వీరి నుంచి రూ. 65,400 జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ సీఐ నర్సింహరాజు తెలిపారు.

జూబ్లీహిల్స్ పరిధిలో ఐదుగురికి..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రెంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మంది మందుబాబులను గురువారం నాంపల్లిలోని నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరిలో 28 మందికి జరిమానా విధించిన మేజిస్ట్రేట్ మరో ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

'కేసీఆర్ హామీని నిలబెట్టుకోవాలి'

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తాము అధికారంలోకి వస్తే వక్ఫ్ భూములను రక్షించడమే కాకుండా వక్ఫ్ బోర్డుకు ప్రత్యేక కమిషనరేట్ ఏర్పాటు చేస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాజీ ఎంపీ అజీజ్ పాషా డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలిండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముఖ్తార్ హుస్సేన్, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్ధిఖీ, మహమ్మద్ అలీలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రత్యేక కమిషనరేట్ ఏర్పాటు చేయాలన్నారు. వక్ఫ్ భూములను రక్షించాలని, వక్ఫ్‌బోర్డ్‌కు కమిషనరేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే సంతకాల సేకరణ చేపడతామన్నారు. తమతో కలిసి వచ్చే పార్టీలు, సంఘాలతో ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడతామన్నారు.

మోయా.. మోయా వ్యాధికి 'టీఎక్స్'లో చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్, నరేష్‌కుమార్

బంజారాహిల్స్: ఆరు నెలలుగా కర్ణాటకకు చెందిన అశ్విని అనే మహిళ మోయా.. మోయా అనే అరుదైన వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు బంజారాహిల్స్ రోడ్ నం.12లోని టీఎక్స్ హాస్పిటల్‌కు చెందిన వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ఆరోగ్యవంతురాలిగా మార్చింది. ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రెయిన్ అండ్ స్పైయిన్ సర్జన్ డాక్టర్ నరేష్ కుమార్ గజ్జెల, సీఓఓ డాక్టర్ శ్రీకాంత్ వొడ్నాల, డాక్టర్ అస్నా, డాక్టర్ ఎ.రాజేష్ మాట్లాడుతూ, ప్రధానంగా ఈ వ్యాధిబారిన పడ్డవారికి తరచూగా మూర్ఛరావడం, మెదడులో ఓ వైపు రక్తప్రసరణ తగ్గి శరీరం ఎడమభాగం లేదా కుడి భాగంలో నీరసంగా ఉండటం లాంటివి జరుగుతాయన్నారు. వంశపారంపర్యంగా సక్రమించి ఈ జబ్బుకు హైదరాబాద్‌లోని అతి తక్కువ ఆస్పత్రుల్లో చికిత్స అందుబాటులో ఉందన్నారు. డైరెక్ట్ వాస్క్యులర్ అనస్టోమోసిస్ అనే క్లిష్టమైన ప్రక్రియ ద్వారా తాము ఈ వ్యాధిని నయం చేసి, రోగి ఆసుపత్రిలో చేరిన ఐదు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశామన్నారు.

భగీరథకు తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం



బంజారాహిల్స్: మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా సీనియర్ జర్నలిస్టు భగీరథ రాసిన 'మహానటుడు, ప్రజానాయకుడు- ఎన్‌టీఆర్' పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం ప్రకటించింది. జీవిత చరిత్ర విభాగంలో ఈ పుస్తకాన్ని ఎంపిక చేసినట్టు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ కిషన్ రావు గురువారం ప్రకటించారు. ఈనెల 29న తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందజేస్తామన్నారు. ఇప్పటికే 'మహానటుడు, ప్రజానాయకుడు – ఎన్‌టీఆర్' పుస్తకానికి కమలాకర కళాభారతి, ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ ఎన్టీఆర్ అవార్డులు లభించాయి. ఎన్‌టీ రామారావు నెలకొల్పిన తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఆయన జీవితంపై రాసిన ఈ పుస్తకానికి కీర్తి పురస్కారం ప్రకటించడం ఊహించలేదని భగీరథ ఆనందం వ్యక్తం చేశారు.

మేకప్‌పై అవగాహన



మేకప్ మెళకువలు నేర్పిస్తున్న నిపుణులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని కతియావర్ స్టోర్‌లో గురువారం అంతర్జాతీయ మేకప్ ఆర్టిస్ట్ జోర్హైన్ మేకప్ అవగాహన తరగతులు నిర్వహించారు. ఒక రోజు పాటు నిర్వహించిన ఈ మేకప్ తరగతుల కోసం వివిధ నగరాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. అంతర్జాతీయ మేకప్, నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకునేందుకు, మెళకువలు నేర్చుకోవడానికి హాజరైన వారికి బెంగళూరుకు చెందిన జోర్హైన్ స్టూడియో అధినేత జోర్హైన్ తగిన శిక్షణ ఇచ్చారు. మేకప్ కళాకారులు, సెలూన్ యజమానులు, బ్యూటీషియన్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిపుణులు కపిల్, సచిన్ దోషి, మయూర్ దోషి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ స్థలం జీహెచ్ఎంసీకి అప్పగింత

వెంగళరావునగర్: త్వరలోనే జవహర్‌నగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మించనున్నట్లు స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ ఎ.రమేష్ తెలిపారు. స్థానిక జవహర్‌నగర్ బస్తీలో ఉన్న 1024 చదరపు గజాల రెవెన్యూ స్థలాన్ని ఫంక్షన్‌హాల్ నిర్మాణం కోసం గురువారం ఖైరతాబాద్ తహసీల్దారు అన్వర్ హుస్సేన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ సమక్షంలో డీఎంసీ రమేష్‌కు అప్పగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ మంజు భార్గవి పాల్గొన్నారు.

ఉపవాస దీక్షల పాకెట్ కేలెండర్ ఆవిష్కరణ

రహమత్‌నగర్: రంజాన్ ఉపవాస దీక్షలతో దైవానుగ్రహంతో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ సీనియర్ నాయకుడు ఇంతియాజ్ ఖాన్ అన్నారు. శ్రీరాంనగర్‌లో స్థానిక యువకులు రుపొందించిన రంజాన్ ఉపవాస దీక్షల పాకెట్ కేలండర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇస్లాం మతంలో రంజాన్ ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, రంజాన్ మాసంలో చేసే ప్రార్థనలకు రెట్టింపు పుణ్యఫలం వస్తుందన్నారు. నాయకులు ఫెరోజ్ ఖాన్, ఇలియాజ్ ఖాన్, సయ్యద్ జమీల్, అలీతో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఒకరిద్దరి తప్పిదాన్ని వ్యవస్థకు ఆపాదించొద్దు

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల అంశంలో మంత్రి కేటీఆర్‌పై విపక్షాలు బురద చల్లడం సరికాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం శాసనమండలిలో తన చాంబర్‌లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. పేపర్ లీకేజీ ఘటనలో ఒకరిద్దరి తప్పిదాన్ని మొత్తం వ్యవస్థకు ఆపాదించడం సరికాదన్నారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ఉద్దేశమని, ఎనిమిదేళ్లుగా ఎలాంటి తప్పులకు తావులేకుండా సంస్థ పనిచేస్తోందన్నారు. సీబీఐ విచారణ చేయాలని తప్పుడు వాదన చేస్తూ పోలీసు వ్యవస్థను తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు. 'సిట్' విచారణలో బాధ్యులకు శిక్ష పడుతుందని సుఖేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పాసైన పది బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ పెండింగ్‌లో పెట్టడంతో పాలనకు ఆటంకం కలుగుతోందని విచారం వ్యక్తం చేశారు. బిల్లులకు సవరణలు ఏవైనా ఉంటే ప్రభుత్వానికి సూచించి ప్రజల అవసరాలు తీర్చేవిధంగా, చట్టసభల గౌరవాన్ని కాపాడేవిధంగా గవర్నర్ వ్యవహరించాలని సూచించారు. దర్యాప్తు సంస్థలతో రాష్ట్రాల నాయకత్వాన్ని కేంద్రం వేధిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అధిపత్యం కోసమే రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారన్నారు.

16.8 కోట్ల మంది డేటా చోరీ!

▶ మొదటి పేజీ తరువాయి

డేటా చోరీకి పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును సైబర్‌క్రైం పోలీసులు రట్టు చేశారు. దేశవ్యాప్తంగా 16.80 కోట్ల మందికి చెందిన వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని దొంగిలించి విక్రయిస్తున్న కేటుగాళ్ల ఆటకట్టించారు. ఢిల్లీ శివార్లలోని నోయిడా కేంద్రంగా ఈ దందా సాగిస్తున్న ముఠాలోని ఏడుగురు సభ్యులను అరెస్టు చేశారు. గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఈ కేసు వివరాలను వెల్లడించారు. రక్షణ శాఖలోని వివిధ హోదాల్లో పనిచేసే అధికారులు, నీట్ విద్యార్థులు, డీమ్యాట్ ఖాతాదారులు, ఐటీ సంస్థల ఉద్యోగులు, వాట్సాప్, ఫేస్‌బుక్ వినియోగదారులు, టెలికం, ఫార్మా కంపెనీలు, సీబీఎస్ఈ 12వ తరగతి విద్యార్థుల డేటా సహా మొత్తం 140 కేటగిరీలకు చెందిన సమాచారాన్ని నిందితులు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. రక్షణ శాఖకు చెందిన (డిఫెన్స్ ఫోర్స్ ఢిల్లీ ఎన్‌సీఆర్ డేటాబేస్)కు చెందిన 2.55 లక్షల మంది డేటా సైతం చోరీకి గురికావడంతో దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డేటా చోరీలో జస్ట్ డయల్ అనే సెర్చ్ ఇంజన్ పాత్ర ఉందని, ఈ కేసులో ఆ సంస్థ వారినీ విచారిస్తామని ఆయన పేర్కొన్నారు.

నిందితులు వీరే...

యూపీ పరిధిలోకి వచ్చే నోయిడాలో డేటా మార్ట్ ఇన్ఫోటెక్, గ్లోబల్ డేటా ఆర్ట్స్, ఎంఎస్ డిజిటల్ గ్రో అనే కంపెనీల (కాల్‌సెంటర్లు) ద్వారా నిందితులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రధాన నిందితుడు ఏ1 కుమార్ నితీష్ భూషణ్‌తోపాటు టెలికాలర్ కుమారి పూజ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుశీల్ తోమర్, క్రెడిట్ కార్డుల డేటా విక్రయించే అతుల్ సింగ్, ఎంఎస్ గ్రో కంపెనీలో సేకరించిన డేటాను విక్రయించే ముస్కాన్ హసన్, గ్లోబల్ డేటాఆర్ట్స్‌లో జస్ట్ డయల్ ద్వారా డేటాను విక్రయించే సందీప్ పాల్, బల్క్ మెసేజ్‌లు పంపే జియా ఉర్ రెహమాన్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 12 సెల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 సీపీయూలు, 140 కేటగిరీలలో డేటా చోరీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కార్యాలయాల్లో ప్రజల పాన్, మొబైల్, టెలికం, ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ శాఖ, పెట్రోలియం కంపెనీలు, బ్యాంకుల డేటా, వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్ల డేటాను పోలీసులు కనుగొన్నారు. నిందితులు ఇప్పటివరకు సుమారు 100 మంది సైబర్ క్రిమినల్స్‌కు డేటాను విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. అలాగే 50 వేల మంది పౌరులకు చెందిన సమాచారాన్ని కేవలం రూ. 2 వేలకు విక్రయించినట్లు గుర్తించామన్నారు. డేటా చోరీపై సైబర్‌క్రైం పోలీసులకు అందిన పలు ఫిర్యాదుల ఆధారంగానే దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నామన్నారు.

భారీగా డేటా చోరీ...

నిందితులు చోరీ చేసిన డేటాలో 1.47 కోట్ల కార్ల యజమానుల, డొమైన్ వాయిస్ డేటాబేస్ 3.47 కోట్లు, మొబైల్ నంబర్ల డేటాబేస్ 3 కోట్లు, స్టూడెంట్ డేటాబేస్ 2 కోట్లు, వాట్సాప్ యూజర్లు 1.2 కోట్ల మంది డేటా చోరీ గుర్తైంది. అలాగే జాబ్ సీకర్స్ డేటాబేస్ 40 లక్షలు, సీబీఎస్ఈ 12వ తరగతికి చెందిన 12 లక్షల మంది విద్యార్థులు, సివిల్ ఇంజనీర్ల వివరాలు 2.3 లక్షలు, డెబిట్ కార్డుల సమాచారం 8.1 లక్షలు, సీనియర్ సిటిజన్స్ 10.6 లక్షలు, వెబ్‌సైట్ ఓనర్స్ 17.4 లక్షలు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ డేటా చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు.

గుర్తించిన అంశాలు...

- పలు ఆర్థిక సంస్థలు, సోషల్ మీడియా, జస్ట్ డయల్ వంటి సంస్థలు ప్రజల అనుమతి లేకుండానే డేటాను సేకరిస్తున్నాయి.
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో సేవలందించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు, వ్యక్తుల ద్వారా డేటా చోరీకి గురవుతున్నట్లు పోలీసులు గుర్తించారు.
- గోప్యంగా ఉంచాల్సిన డేటా భద్రంగా ఉందోలేదో సర్వీసు ప్రొవైడర్లు తనిఖీ చేయట్లేదని తేలింది.
- జస్ట్ డయల్ లాంటి సంస్థల్లో డేటా విక్రయానికి అందుబాటులో ఉంది.

పోలీసుల సూచనలు...

- మీ డేటాను ప్రైవేటు కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిస్తే మాకు ఫిర్యాదు చేయండి.
- క్రెడిట్ కార్డులు, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు, సంస్థలకు చెప్పొద్దు.
- మొబైల్, కంప్యూటర్, యాప్‌లు ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

కేసు దర్యాప్తు సిట్‌కు బదిలీ


దేశ భద్రతకు సంబంధించిన సమాచారం ముడిపడి ఉన్నందున డేటా చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్లు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఇందుకోసం డీసీపీ (క్రైమ్స్) కల్మేశ్వర్ నేతృత్వంలో 'సిట్'ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ టీమ్‌లో సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ రితిరాజ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఇతర అధికారులు ఉంటారని తెలిపారు.

క్రెడిట్ కార్డుదారుల డేటా చోరీ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: బ్యాంకుల్లో డేటా చోరీ చేసే ముఠాను సైబర్‌క్రైం పోలీసులు అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. క్రెడిట్ కార్డుల వెరిఫికేషన్ చేస్తున్న థర్డ్ పార్టీకి చెందిన సిబ్బంది డేటాను చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన 1,780 మంది కస్టమర్ల డేటాతోపాటు ఎస్‌బీఐకి చెందిన 140 మంది కస్టమర్ల డేటా చోరీకి గురైందన్నారు. ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న ఈ దందాలో ప్రధాన నిందితుడు కఫిన్ అహ్మద్, మహ్మద్ సమాల్, మహ్మద్ అసీఫ్, చిరాగ్, విరేంద్ర సింగ్, ప్రదీప్ వాలియా, ఆకాశ్‌నిర్వాన్, విరాట్ పురి, అతీత్ దాస్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 13 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, క్రెడిట్ కార్డుల డేటా స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ అనుబంధం నిరంతరం



- 2017 ఆగస్టులో ఆదిలాబాద్ జెడ్పీ సమావేశం జరుగుతోంది. అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మంచిర్యాలలో భూకబ్జాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ మహజీలో నమోదై ఉందని అన్నారు. ఇది గమనించిన 'సాక్షి' ప్రతినిధి అలాంటి రెవెన్యూ బాగోతాలపై పరిశోధన చేశారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తండ్రి లక్ష్మణరావు పేరిట 57.04 ఎకరాల ప్రభుత్వ భూమి నమోదై ఉన్నట్టు ఆధారాలు లభించాయి. ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసిన తర్వాత 'నడిపెల్లి లక్ష్మణరావు @ 57.04 ఎకరాలు' శీర్షికన 2017 ఆగస్టు 21న 'సాక్షి' వార్తా కథనం ప్రచురించింది.

✔ రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ వార్తతో అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో కదలిక వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు వెంటనే స్పందించి ఆ భూమికి తనకు ఎలాంటి సంబంధం లేదని, వెంటనే స్వాధీనం చేసుకోవాలని హైదరాబాద్‌లో సీసీఎల్ఏను కలిసి విన్నవించారు కూడా. అదొక 'సాంకేతిక సమస్య' అని అప్పటి ఆర్డీఓ మీడియాతో చెప్పారు. దీనిపై పరిశోధన సాగించిన 'సాక్షి' రిజిస్ట్రేషన్‌లో లింక్ చేసిన ఆధార్ వివరాలు సేకరించి.. అదే నెల 27న మరో కథనాన్ని ప్రచురించింది. నడిపెల్లి లక్ష్మణరావు 2003లోనే చనిపోగా.. అలాంటి పేరు గల నడిపెల్లి లక్ష్మీకాంతరావు ఆధార్‌ను పెట్టి, 2010 సంవత్సరం తర్వాత ఈ భూమిని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించిన విషయాన్ని ఆధారాలతో సహా ప్రచురించింది.

- సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

మసివాగుపై తాత్కాలిక వంతెన



- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.. ఇల్లెందు మండలంలోని మిట్టపల్లి గ్రామం పరిధిలో మసివాగు ఉంటుంది. చిన్నవాన పడ్డా వాగు ఉప్పొంగి మిట్టపల్లి మీదుగా ఇల్లెందు, బయ్యారం మండలాల్లోని పదిహేను గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. గిరిజనులు వాగుపై చెట్ల తీగలు, కొమ్మలు, చెక్కలతో వంతెనలా ఏర్పాటు చేసుకున్నా.. అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు వీలయ్యేదికాదు. ఈ కష్టాలను వివరిస్తూ.. 2010 సెప్టెంబర్ 8న 'చెట్లపై నిచ్చెన మెట్లు.. ఎన్నాళ్లీ ఇక్కట్లు' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. ఆ మరునాడే మిట్టపల్లికి చెందిన బానోత్ జమ్కా(50) అనే మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వాగు దాటలేక, చికిత్స అందక మృతి చెందింది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అదే నెల 12న 'మసివాగు వంతెన.. శ్రమదానంతోనైనా నిర్మిస్తాం' అని గిరిజనుల వాయిస్‌తో మరో కథనం ప్రచురితమైంది.

✔ 'సాక్షి' కథనాలతో అప్పటి ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్పీ క్రాంతి రాణా మిట్టపల్లి వెళ్లి గిరిజనుల ఇక్కట్లను పరిశీలించారు. స్థానిక డీఎస్పీ, యాదగిరిరెడ్డి అనే వ్యాపారి సహకారంతో మసివాగుపై తాత్కాలికంగా ఇనుప వంతెన నిర్మించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 2011 మేలో శాశ్వత వంతెన పనులు మొదలుపెట్టింది. 2013 మార్చి 24న ప్రారంభించింది. ఇప్పుడు పల్లె వెలుగు బస్సులు పరుగులు తీస్తుండడంతో పదిహేను గ్రామాల ప్రజల ఇక్కట్లు తీరిపోయాయి.

- ఇల్లెందు

ఎల్బీనగర్ లాడ్జిలో ఎవరెవరు కలిశారు?

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలోని తమ ఇంటికి తీసుకువెళ్లారు. రెండు రోజుల పాటు అక్కడే ఉంచి పరీక్షలకు సిద్ధం చేశారు. ఈ నెల 4 రాత్రి నీలేష్, గోపాల్, డాక్యాలతో పాటు అతడి సమీప బంధువు రాజేందర్ రెండు వాహనాలపై ఎల్బీనగర్‌కు వచ్చారు. అక్కడి ఓ లాడ్జిలో బస చేశారు. మర్నాడు సరూర్‌నగర్‌లోని పరీక్ష కేంద్రంలో నీలేష్, గోపాల్‌తో పరీక్ష రాయించారు. అయితే వీళ్లు లాడ్జిలో ఉండగా కొందరు వచ్చి కలిసినట్లు సిట్ అధికారులకు ఆధారాలు లభించాయి. దీంతో వాళ్లు అభ్యర్థులేనా? కొన్ని ప్రశ్నలు లేదా ప్రశ్నపత్రాన్ని నీలేష్, గోపాల్ వారితో పంచుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సాంకేతిక ఆధారాలతో పాటు సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్ ఆధారంగా ముందుకు వెళ్తున్నారు. 9 మంది నిందితుల్ని మరో నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

జైలుకు మరో ముగ్గురు నిందితులు...

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష లీకేజీ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీలో పని చేస్తున్న, చేసిన వారి పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. 2013లో గ్రూప్–2 ద్వారా ఎంపికై, ప్రస్తుతం కమిషన్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న షమీమ్ అనే మహిళకు రాజశేఖర్ ద్వారా గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష పత్రం అందింది. దీని ఆధారంగా పరీక్ష రాసిన ఆమె ఏకంగా 127 మార్కులు పొందింది. కమిషన్‌కు చెందిన ఓ సభ్యుడి వద్ద పీఏగా పని చేస్తున్న డి.రమేష్ కుమార్‌తో పాటు మాజీ ఉద్యోగి సురేష్‌కు ప్రవీణ్ ద్వారా ఈ క్వశ్చన్ పేపర్ చేరింది. వీరిలో రమేష్‌కు 122 మార్కులు, సురేష్‌కు 107 మార్కులు వచ్చినట్లు సిట్ గుర్తించింది. ఈ ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వీరిని వారం రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ శుక్రవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

25 మంది అభ్యర్థులకు నోటీసులు..

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షల్లో 100కు పైగా మార్కులు సాధించిన 25 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. నిర్ణీత తేదీల్లో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. విడతల వారీగా మొత్తం 121 మందికి నోటీసులు ఇవ్వనున్నారు. టీఎస్‌పీఎస్సీ కస్టోడియన్ శంకరలక్ష్మిని మరోసారి విచారించాలని నిర్ణయించారు.

తెరపైకి రాజశేఖర్ బంధువు

ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో రెండో నిందితుడిగా ఉన్న రాజశేఖర్ సమీప బంధువు ప్రశాంత్ పేరు తాజాగా వెలుగులోకి వచ్చింది. కొన్నేళ్లుగా న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ప్రశాంత్ గ్రూప్–1 పరీక్షకు దరఖాస్తు చేసుకున్నాడు. గతేడాది అక్టోబర్‌లో నగరానికి వచ్చి ప్రిలిమినరీ పరీక్ష రాసి వెళ్ళాడు. ఈ పరీక్షలో క్వాలిఫై అయిన ప్రశాంత్ 100కు పైగా మార్కులు పొందినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఇతడికి లీకైన గ్రూప్–1 పేపర్ అందిందా? అని అనుమానిస్తున్న సిట్ అధికారులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పశు పోషకులకు తక్కువ ధరలకే నాణ్యమైన పశువుల జనరిక్ మందులను అందించే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ పశు ఔషధ నేస్తం పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నామని ఏపీ పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 52 పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడలోని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రాన్ని గురువారం మంత్రి అప్పలరాజు ప్రారంభించారు.

నగర వార్తలు

మసీదులకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ మాసం సందర్భంగా అవసరమైన చోట్ల మసీదులకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు ఐదు వేలపైకు పైగా మసీదులు ఉంటాయన్నది అంచనా. సాయంత్రం దీక్ష విరమించే ఇఫ్తార్ సమయంలో మంచి నీరు తప్పని సరి అవసరం ఉంటుంది. వేసవి కాలం కావడంతో మంచి నీటి వినియోగం అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. దీంతో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన చోట ముందుస్తుగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. మసీదు కమిటీలు స్థానిక జలమండలి అధికారులను సంప్రదిస్తే ఉచితంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. మరోవైపు మసీదులున్న ప్రాంతాల్లో ఎక్కడా సీవరేజి ఓవర్ ఫ్లో వంటి ఇబ్బందులు కాకుండా చర్యలు చేపట్టారు. ముందుస్తుగా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనికోసం డివిజన్‌కొక మినీ జెట్టింగ్ మిషన్‌ను కేటాయించారు.


హోటల్ ఫుడ్ తిని 16 మందికి అస్వస్థత

- 12 మంది డిశ్చార్జి.. మరో నలుగురికి కొనసాగుతున్న చికిత్స
- హోటల్ సీజ్ చేసిన అధికారులు



వివరాలు సేకరిస్తున్న ఏఎంఓహెచ్ భార్గవ నారాయణ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీవెంకాలు

సనత్‌నగర్: మాషా అల్లా హోటల్‌లో ఆహారం తిని 16 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో అస్వస్థతకు గురైన వారిలో 12 మంది కోలుకోగా మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సనత్‌నగర్‌లోని మాషా అల్లా హోటల్‌లో బుధవారం రాత్రి 16 మంది మటన్ మండీ తిన్నారు. ఆ తరువాత అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ భార్గవ్ నారాయణ్, సర్కిల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ శ్రీవెంకాలు గురువారం మధ్యాహ్నం సిబ్బందితో కలిసి హోటల్‌లోని ఆహార పదార్థాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హోటల్‌ను సీజ్ చేశారు.





రంజాన్ శోభ

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని చారిత్రాత్మక మక్కా మసీదును రంగు రంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. శుక్రవారం ఉదయం సహార్ ప్రార్థనలతో రంజాన్ మాసం మొదటి రోజు ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి మక్కా మసీదులో ఇషాకీ నమాజ్ పూర్తి చేసిన అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

- చార్మినార్

కేంద్రంపై సమరభేరికి బీసీలు సిద్ధం కావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

లాలాపేట: దేశ వ్యాప్తంగా బీసీ జన గణన చేపట్టాలని, జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28, 29తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా, బీసీ జనగణన దీక్ష చేపట్టినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దీనికి సంబంధించి బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన చలో ఢిల్లీ పోస్టర్‌ను గురువారం తార్నాకలోని ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కుల గణన నిర్వహిస్తామని మాట ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ మాట తప్పిందన్నారు. గత తొమ్మిది సంవత్సరాల బీజేపీ పాలనలో బీసీల సంక్షేమానికి చేసింది శూన్యమన్నారు. కేంద్రంలో కనీసం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలేకపోయారని విమర్శించారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్రంలోని ప్రభుత్వాలకు కనీసం చలనం లేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వంపై సమరభేరి మోగించడానికి దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 28న మహాధర్నా, 29న బీసీ గణన దీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ పాల్గొన్నారు.

సమన్వయంతో శోభాయాత్రను విజయవంతం చేద్దాం

అఫ్జల్‌గంజ్ : ఈ నెల 30న నిర్వహించే శ్రీరామ నవమి శోభాయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని వివిధ శాఖల అధికారులు, పార్టీ, సంఘాల నాయకులతో పోలీసు ఉన్నతాధికారులు కోరారు. సిద్దిఅంబర్ బజార్‌లోని తారా ఇంటర్నేషనల్ హోటల్‌లో నిర్వహించిన సమావేశానికి శోభాయాత్ర నిర్వాహకులు డాక్టర్ భగవంత్‌రావు, గోవింద్ రాఠి, ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్, వెస్ట్‌జోన్ డీసీపీ కర్నె ప్రభాకర్ హాజరై పలు సూచనలు చేశారు. శోభాయాత్రను పరస్పర సహకారంతో విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. గోషామహల్ ఏసీపీ సతీష్, సుల్తాన్ బజార్ ఏసీపీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్

ఈసీఐఎల్ సేవలు ప్రశంసనీయం

మంత్రి హరీష్‌రావు



మంత్రి హరీష్‌రావుకు ల్యాప్రొస్కోపిక్ యంత్రాలను అందజేస్తున్న ఈసీఐఎల్ సిబ్బంది

కుషాయిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) చేపడుతున్న సేవాకార్యక్రమాలు ప్రశంసనీయమని ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రశంసించినట్లు గురువారం సంస్థ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రూ. 69.66 లక్షల విలువైన ల్యాప్రోస్కోపిక్ రెండు అధునాతన యంత్రాలను సిద్దిపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావుకు అందజేశారు. సిద్దిపేట, గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ యంత్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీఐఎల్ ఏజీఎం మునికృష్ణ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. వేణుబాబు, పర్సనల్ ఆఫీసర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్



క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మూడు రోజులపాటు సాగే క్రీడోత్సవాలు (5వ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2023) గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, జాయింట్ కమిషనర్ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ్ నాయక్, ఇతర అధికారులతో కలిసి బెలూన్లను ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సీనియర్ ఆఫీసర్లు మొదలుకొని సిబ్బంది వరకు అందరూ ఏదో ఒక ఈవెంట్‌లో పాల్గొని క్రీడోత్సవాలను విజయవంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. జాయింట్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ నిత్యం జీవితంలోనూ వ్యాయామాన్ని భాగం చేసుకోవాలన్నారు. సైబరాబాద్ పోలీసు అధికారులు యోగేష్ గౌతమ్, సింగర్ కల్మేశ్వర్ పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయండి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, విద్య, ఉద్యోగాల్లో క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ జరిపిన గ్రూప్ 1 సర్వీసు పరీక్షలలో జరిగిన అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.రామును నియమిస్తూ నియామకపు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, కోల జనార్ధన్ పాల్గొన్నారు.

రాహుల్ సిప్లిగంజ్‌కు మంత్రి తలసాని శుభాకాంక్షలు



సనత్‌నగర్: ఆస్కార్ అవార్డు పొందిన ఆర్ఆర్ఆర్ చిత్రంలోని నాటు నాటు పాట పాడిన రాహుల్ సిప్లిగంజ్ గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాహుల్‌కు మంత్రి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవేదికపై తెలుగు వారి సత్తా చాటిన సినిమా ఆర్ఆర్ఆర్ అని ఈ సందర్భంగా మంత్రి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా...

దేశాన్ని లూటీ చేస్తున్న బీజేపీ

బీవీ రాఘవులు



ఎదులాపురం: సంక్షేమాన్ని పక్కన బెట్టి దేశాన్ని లూటీ చేయడమే లక్ష్యంగా బీజేపీ పాలన సాగిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం సీపీఎం జన చైతన్య యాత్రను ఆయన ప్రారంభించారు. పట్టణంలో బైక్ ర్యాలీ అనంతరం ఆర్ అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట జరిగిన ప్రారంభసభలో మాట్లాడారు. విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేస్తూ నిరుద్యోగాన్ని మరింత పెంచిందని ఆరోపించారు. నాడు విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి దేశ ప్రజలకు పంచుతానని మోదీ హామీ ఇచ్చారని, నేడు దేశ సంపదను విదేశాలకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో మూతపడిన ప్రభుత్వ రంగ సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను పునఃప్రారంభించేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు గంధ్రాత్ సుజాత, సాజిద్ ఖాన్, బీఆర్ఎస్ నాయకులు అడ్డి భోజారెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు వీరయ్య, బండారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేకత భయంతోనే సీఎం పరామర్శలు

సీఎం కేసీఆర్‌పై బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని గ్రహించిన సీఎం కేసీఆర్, పిట్టల దొరలా టోపీ పెట్టుకుని తూతూ మంత్రంగా పరామర్శలకు బయలుదేరారని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి సంవత్సరం రైతులు ఏదో రూపంలో నష్టపోతున్నారని... ఈ 9 సంవత్సరాలలో సీఎం కేసీఆర్ ఒక్క రోజు కూడా రైతులను పరామర్శించలేదని గుర్తు చేశారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మర్రి శశిధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పంట నష్టంపై కేంద్రాన్ని విమర్శించేందుకే కేసీఆర్ పర్యటనకు బయలుదేరారని ధ్వజమెత్తారు. తెలంగాణలో రైతుల పరిస్థితి ఏ విధంగా ఉంది... రైతులను ఏ విధంగా రాష్ట్ర ప్రభుత్వం వంచిస్తోందనేది అందరూ గమనించాలని కోరారు. రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగండ్ల వల్ల జరిగిన వాస్తవ నష్టాన్ని కేసీఆర్ కేంద్రానికి పంపితే కేంద్రం సకాలంలో ఆదుకుంటుందన్నారు. అంతేగానీ తప్పుడు నివేదికలతో కేంద్రాన్ని తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.

నిరుద్యోగుల జీవితాలను చిదిమేశారు: షర్మిల



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల జీవితాలను చిదిమివేసిన మహామోసగాడుగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. కేసీఆర్ సర్కార్ పాల్పడుతున్న అక్రమాల్లో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ సముద్రంలో నీటిబొట్టు లాంటిదని గురువారం ఆమె ఒక ప్రకటనలో విమర్శించారు. 'ఏడాది క్రితం మార్చి 9న అసెంబ్లీలో కేసీఆర్.. ఏడాది లోపల 80 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. జాబ్ కేలెండర్లు, ఇక కొలువులే కొలువులు అని పాలాభిషేకాలు చేయించుకున్నారు. ఇప్పటివరకు 26 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. మిగతా 54 వేల ఉద్యోగాల ఊసు లేదు' అని ధ్వజమెత్తారు. బిశ్వాల్ కమిటీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1.91 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీల ఫలితంగా పరీక్ష రాసిన 10 లక్షలమంది నిరుద్యోగులను క్షోభకు గురి చేశారన్నారు. సెప్టెంబర్‌లో ఎన్నికల షెడ్యూల్ జారీ కానుండటంతో నియామకాల్లో ఆలస్యం జరిగితే ఎన్నికల కోడ్ సమయంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వడం కుదరదన్నారు. పేపర్ లీకేజీలపై వెంటనే సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని, దీనివెనుక మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నా కచ్చితంగా శిక్షించాల్సిందేనన్నారు. ఈ అంశంపై వైఎస్సార్‌టీపీ తీవ్రస్థాయిలో ఆందోళన చేపట్టనున్నట్లు షర్మిల తెలిపారు.

'రైతులకు మేలు చేయాలన్న ఆలోచన సీఎంకు లేదు'



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచే బీజేపీ నేతలు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించటాన్ని బీజేపీ నేత, తమిళనాడు సహ ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఖండించారు. గురువారం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ సీఎం పంట నష్ట పరిశీలన సందర్భంగా బీజేపీ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రైతులకు మేలు చేయాలన్న ఆలోచన ఉంటే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ, కిసాన్ మోర్చా నాయకుల అక్రమ అరెస్టులు సీఎం కేసీఆర్ ఆత్మ న్యూనతాభావాన్ని సూచిస్తున్నాయని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు.



వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పొలంలో సీఎం కేసీఆర్. చిత్రంలో ఎర్రబెల్లి, నిరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి



కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్, రామచంద్రాపురంలో దెబ్బతిన్న కలబంద పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న సీఎం

కడుపులో పెట్టుకుంటం



మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం రెడ్డి కుంటతండాలో మిర్చి పంటను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎర్రబెల్లి, నిరంజన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

రావినూతల, గార్లపాడు గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డికుంట తండాలో మొక్కజొన్న, మిర్చి, మామిడి తోటలను, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురంలో వరి, టమాటా పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. అడవిరంగాపురంలో పంట నష్టం చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సందర్శించారు. పలుచోట్ల మీడియాతో మాట్లాడారు.

కేంద్రానికి చెప్పినా దున్నపోతు మీద వాన పడినట్టే..

'తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేశాం. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇటువంటి పరిస్థితిలో గాలి దుమారం, వడగళ్ల వాన రైతులను నిండా ముంచేసింది. మొక్కజొన్న 1,29,446 ఎకరాల్లో, వరి 72,709, మామిడి 8,865, ఇతర పంటలు 17,238 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. నర్సంపేటలాంటి ప్రాంతాల్లో పంటలు గుర్తుపట్టలేనంతగా పాడయ్యాయి. కరీంనగర్‌లో 100 శాతం దెబ్బతిన్నాయి. నేను హైదరాబాద్ నుంచే ఎకరానికి రూ.3 వేలు చెల్లిస్తామని చెప్పి చేతులు దులుపుకోవచ్చు. కానీ రైతుల కష్టాలు నాకు తెలుసు. రైతులు బాధ తెలిసిన వాళ్లంగా రైతుల వద్దకు వచ్చి భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడున్న కోడ్ ప్రకారం.. కేంద్ర ం నుంచి డబ్బులు పెద్దగా రావు. ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం మరీ దుర్మార్గంగా, దౌర్భాగ్యంగా ఉంది. వారికి రాజకీయాలు తప్ప ప్రజలు లేరు.. రైతులు లేరు అనే పరిస్థితి ఉంది. చీఫ్ సెక్రటరీ, మేము పంటల నష్టంపై రాస్తే కేంద్ర బృందం వస్తుంది. ఎప్పుడు వస్తుందో.. ఏం సంగతో దేవునికి ఎరుక. వచ్చినా.. దొంగలు పడిన తర్వాత ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా ఆరు నెలలకు కాని రూపాయి రాదు. కేంద్రం ఇస్తే మహద్భాగ్యంగా.. మొక్కజొన్నకు ఎకరానికి రూ.3,333, వరికి రూ.5,400, మామిడి తోటలు ధ్వంసం అయితే రూ.7,200.. ఇదీ ఉన్నటువంటి స్కేల్. ఇది ఏ మూలకూ సరిపోదు. గతంలో పంపినదానికి ఒక్క రూపాయి కూడా కేంద్రం ఇవ్వలేదు. ఈ విధానాలకు నిరసనగా మేం కేంద్రానికి పంట నష్టంపై నివేదిక పంపదలుచుకోలేదు. చెప్పదలుచుకోలేదు.. చెప్పినా దున్నపోతు మీద వానపడినట్టే. భగవంతుడు తెలంగాణకు ఆర్థిక శక్తి ఇచ్చాడు. మా రైతులను మేమే కాపాడుకుంటాం. వందశాతం మేమే ఆదుకుంటాం..' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

రబ్బరు బంతిలా తిరిగి ఎగరాలి

'ఖమ్మం జిల్లా జిల్లాలో కౌలు రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. వీరిని కూడా ఆదుకునేలా సీఎస్‌కు చెప్పి.. జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ఆదేశాలు ఇప్పిస్తాం. డబ్బు రైతుకు ఇవ్వకుండా కౌలు రైతులను ఆదుకునేలా లిఖితపూర్వక ఆదేశాలు ఇస్తాం. పంట నష్ట పరిహారం విషయంలో 2015 నాటి జీవోను కూడా సడలిస్తాం. అయితే మొత్తానికి కాకుండా ప్రస్తుతం కౌలు రైతులకు జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని జీవోను రివైజ్ చేస్తాం. తెలంగాణ ప్రభుత్వమే రైతు ప్రభుత్వం. ఎట్టి పరిస్థితుల్లో రైతులు నిరాశకు గురి కావద్దు. ధైర్యం కోల్పోవద్దు. రబ్బరు బంతిలా తిరిగి ఎగిరే విధంగా, జరిగిన నష్టానికి ఏమాత్రం చింతించకుండా భవిష్యత్తులో ఉన్నతమైన పంటలు గొప్పగా పండించే ఆలోచనకు పోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. వానల ముప్పు ఇంకా తొలగిపోలేదు. మరో 2,3 రోజుల్లో వడగళ్లు మళ్లీ పడవచ్చు. అయినా అధైర్య పడొద్దు..' అని సీఎం అన్నారు.

దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ

'ఇప్పటికీ వ్యవసాయం దండగనే మూర్ఖులు, కొందరు మూర్ఖ ఆర్థికవేత్తలు ఉన్నారు. వ్యవసాయంతో ఏమీ రాదని చెప్పే వాళ్లూ ఉన్నారు. కానీ ఈ రోజు తెలంగాణ తలసరి ఆదాయం దేశంలోనే నంబర్ వన్‌గా ఉంది. జీఎస్‌డీపీ పెరిగితేనే తలసరి ఆదాయం పెరుగుతుంది. జీఎస్‌డీపీ పెరుగుదలలో వ్యవసాయం పాత్ర చాలా పెద్దగా ఉంది. లక్షలాదిమంది పొట్ట పోసుకోవడానికి, అనేక రకాల ఉపాధులు కల్పించేలా వ్యవసాయం రంగం ఉంది. ఒక అద్భుతమైన వ్యవసాయ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దినం. రాష్ట్రంలో వ్యవసాయం అత్యున్నత స్థితిలో ఉంది. వలస వెళ్లిన రైతును తిరిగి రప్పించి, రైతుబంధు, రైతుబీమా, ఉచిత నీరు, ఉచిత విద్యుత్తు, నీటితీరువా రద్దు తదితర సదుపాయాలు కల్పించాం. ఈ రోజు దేశం మొత్తం మీద చూస్తే తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాలన్నింట్లో వరి 50 లక్షల ఎకరాలు ఉంటే.. ఒక్క తెలంగాణలోనే 56 లక్షల్లో ఈ పంట ఉంది. ఇది మనందరికీ గర్వకారణం. రైతులు ఏమాత్రం నిరాశకు గురి కావద్దు. ప్రభుత్వం అండగా ఉంటుంది. అద్భుతమైన వ్యవసాయ రాష్ట్రంగా రూపుదాల్చుతాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

కొత్త వ్యవసాయ పాలసీ రావాలి

'దేశంలో ఒక పద్ధతి..పాడు అంటూ లేదు. ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభం కలిగించే బీమాలే ఉన్నాయి తప్పితే.. పంట నష్టం జరిగినప్పుడు రైతుకు లాభం చేసే బీమాలు, కేంద్ర ప్రభుత్వ పాలసీలు లేవు. గత కేంద్ర ప్రభుత్వాలూ అంతే. ఇప్పుడున్న ప్రభుత్వమైతే చెవిటోడి ముందు శంఖం ఊదినట్టే ఉంది. వాళ్లకు చెప్పినా.. గోడకు చెప్పినా ఒకటేలా అన్నట్లు పరిస్థితి ఉంది. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత ఒక మాట చెబుతున్నాం. కొత్త వ్యవసాయ పాలసీ రావాలి..' అని కేసీఆర్ అన్నారు. మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ కార్యదర్శి స్మిత సబర్వాల్, సీఎంఓ అధికారి రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వరరెడ్డి, ఎంపీలు సంతోష్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఎం, సీపీఐ కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

బస్సులోనే మధ్యాహ్న భోజనం..

సమయం తక్కువగా ఉండడంతో సీఎం ఎక్కడా విరామం లేకుండా పర్యటించారు. ఖమ్మం నుంచి మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డి కుంట తండాకు వచ్చిన కేసీఆర్.. ఉన్నతాధికారులు, మంత్రులు, ఎంపీలతో కలిసి బస్సులోనే మధ్యాహ్న భోజనం చేశారు. ముఖ్యమంత్రికి మంత్రి ఎర్రబెల్లి పెరుగన్నం వడ్డించారు.

ధైర్యం చెప్పేందుకే వచ్చా..

కేసీఆర్ మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డికుంట తండాలో రైతు సోమ్లా నాయక్ పంటను పరిశీలించారు. అనంతరం ఆయనతో మాట్లాడారు.

సీఎం: అరే...మిర్చి పంటంతా పాడైంది కదా.. ఈ చేను ఎవరిది?

రైతు: నాదే అయ్యా...నా పేరు సోమ్లా నాయక్.

సీఎం: ఎన్ని ఎకరాల్లో మిర్చి వేసినవ్...ఎంత కాలంగా సాగు చేస్తున్నావు?

రైతు: ఈ ఏడు రెండెకరాల్లో వేసినా. పదేళ్ల నుంచి మిర్చి సాగు చేస్తున్నా.

సీఎం: మిర్చి మీద లాభాలు వస్తున్నాయా?

రైతు: పోయినేడు నష్టమే వచ్చింది. ఈ సంవత్సరం ధర మంచిగానే ఉంది. క్వింటాల్‌కు రూ.20 వేలకు పైగా పలుకుతుందనుకుంటే మాయదారి రాళ్ల వాన నట్టేట ముంచింది.

సీఎం: అవును ఈ ఏడు మిర్చికి బాగానే ధర ఉంది. కానీ పంటంతా నష్టపోయావు. ఇలాంటి పరిస్థితిలోనే మనసు నిబ్బరం చేసుకోవాలి. నీకు ప్రభుత్వం అండగా ఉంటుంది. భవిష్యత్‌లో మరింత మెరుగ్గా వ్యవసాయం చేసుకునే విధంగా సౌకర్యాలు కల్పిస్తా.

రైతు: అవును అయ్యా.. తెలంగాణ వచ్చిన తర్వాతే కరెంటు, నీళ్ల తిప్పలు పోయినయి.

సీఎం: (రైతు భుజంపై చేయి వేసి) ఇది మన ప్రభుత్వం. రైతు ప్రభుత్వం. అందుకోసమే మీకు ధైర్యం కల్పించేందుకు వచ్చా. బాధ పడకండి..భయపడకండి.

అటు తమ్మినేని.. ఇటు కూనంనేని..

కేసీఆర్ ఖమ్మం జిల్లా పర్యటనకు సీపీఎం, సీపీఐ కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. రావినూతల, గార్లపాడు గ్రామాల్లో ఇద్దరు నేతలు సీఎం వెంటే ఉండి పంటల పరిశీలనలో పాల్గొన్నారు. జిల్లాలో పంట నష్టం వివరాలను తెలియజేయడంతో పాటు రైతులు, కౌలు రైతుల ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. సీఎం విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు కుడి, ఎడమ సీట్లలో కూర్చున్నారు. రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.



రావినూతలలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న కేసీఆర్. చిత్రంలో తమ్మినేని, కూనంనేని

శనగ సేకరణకు రూ. 702 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శనగ పంట సేకరణకు మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా ప్రకటిస్తూ వ్యవసాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. చిన్న, సన్నకారు రైతులు నష్టపోకుండా కేంద్రం అనుమతించిన 50,328 మెట్రిక్ టన్నులకు అదనంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల శనగ సేకరణకు అనుమతించాలని నిర్ణయించింది. అదనపు సేకరణకు రూ. 702.2 కోట్లు అందించేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అదిప్పుడు ఏ మూలకూ సరిపోదు

ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామంలో పంటల పరిశీలన సందర్భంగా కౌలు రైతు వట్టికొండ రామకృష్ణ మొక్కజొన్న చేనును సీఎం పరిశీలించారు. రైతుతో సంభాషించారు.

కేసీఆర్: పంట ఎంత వేశావు?

రామకృష్ణ: 35 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశా.

కేసీఆర్: పంట నష్టం ఎంత జరిగింది?

రామకృష్ణ: 80 శాతం పంట పోయింది.

కేసీఆర్: నష్టంపై ఏమి చేస్తే బాగుంటుంది?

రామకృష్ణ: అందరికీ ఉపయోగపడేలా ఎకరానికి రూ.30 నుంచి 40 వేలు ఇస్తే బాగుంటుంది.


కేసీఆర్: రైతుబంధు ఇస్తున్నాం కదా కౌలు తగ్గిస్తున్నారా?

రామకృష్ణ: కౌలు తగ్గించటం లేదు.

(దీంతో కేసీఆర్.. గతంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఎంత ఇచ్చేవారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మలను ప్రశ్నించారు. ఎకరానికి రూ.3,333 అని ఆమె సమాధానం ఇచ్చారు. దీంతో బ్రిటిష్ కాలం నాటి ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పుడు రైతుకు ఏ మూలకూ సరిపోతుందని ప్రశ్నించారు.

పంటనష్టంపై విస్తృత సర్వే

- బాధిత రైతులు, కౌలు రైతులను గుర్తించాలి
- ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- వారం, పది రోజుల్లో అందజేత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా జరిగిన పంటనష్టంపై సర్వే చేపట్టాలని ప్రభుత్వం వ్యవసాయశాఖను ఆదేశించింది. ఈ మేరకు గురువారం విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఒక్కసారికి సాయం అందించేందుకు గ్రామాలవారీగా, సాగుదారులవారీగా పంటనష్టంపై సవివరమైన సర్వే చేపట్టాలని వ్యవసాయ శాఖకు సూచించారు. నష్టాన్ని చవిచూసిన రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ.10 వేల ఆర్థికసాయం అందించాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీల మధ్య ఉరుములు, వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురియడంతో అన్నిరకాల పంటలకు నష్టం కలిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహా అధికారుల బృందం పంటలకు నష్టం జరిగిన వివిధ ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని అధ్యయనం చేసిందన్నారు. పంట చేతికొచ్చేదశలో ఉందని, ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల వందశాతం నష్టం వాటిల్లిందని, దీంతో రైతు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాగా, పంటనష్టాన్ని గ్రామాల్లో అంచనా వేయాలని, లబ్ధిదారులను గుర్తించాలని వ్యవసాయ శాఖ వ్యవసాయ విస్తరణాధికారు(ఏఈవో)లను ప్రభుత్వం ఆదేశించింది.

2.28 లక్షల ఎకరాల్లో పంటనష్టం

రాష్ట్రవ్యాప్తంగా 2.28 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. అయితే వాస్తవంగా ఇది ఐదు లక్షల వరకు ఉంటుందని రైతు సంఘాలు, కిందిస్థాయి నుంచి సమాచారం వస్తోంది. కాగా, ప్రభుత్వం వేసిన నష్టం అంచనా ప్రకారం మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాలు, ఇతర పంటలు అన్ని కలిసి 17,238 ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రభుత్వం గుర్తించింది. తాజాగా చేయబోయే సర్వేలో ఇంకేమైనా అదనంగా నష్టం వెలుగుచూడవచ్చని అధికారులు భావిస్తున్నారు. నష్టపరిహారంగా దీన్ని పేర్కొనకూడదని, సహాయ, పునరావాస చర్యలు అని పిలవాలని ముఖ్యమంత్రి పేర్కొన్న సంగతి తెలిసిందే. రైతులు మళ్లీ పుంజుకుని, వ్యవసాయం చేసేందుకు వీలుగా సహాయసహకారాలు అందించాలని ఆయన తెలిపిన సంగతి తెలిసిందే. సీఎం ప్రకటించిన రూ.10 వేల సాయాన్ని వారం, పది రోజుల్లో రైతులకు అందజేస్తామని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. పంటకు పెట్టుబడి పెట్టింది కౌలు రైతులే కాబట్టి వాళ్లకు న్యాయం జరిగేలా చూస్తామని ప్రభుత్వం తెలిపింది.

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ అనుబంధం నిరంతరం



పట్టా తప్పింది!

● జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం పరిధిలోని సుమారు 900 సర్వే నంబర్ల పరిధిలో 2,505 మంది రైతులకు సుమారు 5వేల ఎకరాల పట్టా భూమి ఉంది. 2007లో అప్పటి రెవెన్యూ అధికారులు ఆ భూములను అసైన్డ్‌గా మార్చారు. రైతులు అనేక పోరాటాలు చేసినా ఫలితం రాలేదు. రైతులకు అన్యాయం జరిగిందని రెవెన్యూ అధికారులకు తెలిసినా.. ధరణి పోర్టల్ వచ్చాక అసైన్డ్‌గానే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రైతులు మళ్లీ ఆందోళనకు దిగారు. 'సాక్షి' వారి పక్షాన నిలిచి.. 2021 జూలైలో వరుస కథనాలు ప్రచురించింది. సమస్యను కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అప్పటి రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు దృష్టికి తీసుకెళ్లింది.

✔ అధికారులు అదే ఏడాది అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేశారు. వరంగల్ భూపరిపాలన విభాగం నుంచి 1954 నాటి కాస్రా, 1963 సేత్వార్‌ను తీసుకువచ్చి రైతులకు అందించారు. కాస్రా, సేత్వార్, ఆరు నెలల పహాణీతో కలిపి 2వేల మంది రైతులు, 2,873 ఎకరాలకు సంబంధించి మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. వీటి ఆధారంగా అధికారులు అసైన్డ్ ఆప్షన్ తొలగిస్తూ హైదరాబాద్‌లోని కమిటీకి ప్రతిపాదన పంపారు. అక్కడా గ్రీన్‌సిగ్నల్ రావడంతో రైతులకు న్యాయం జరిగింది. 'సాక్షి' కథనాలతో 14 ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించిందని, పత్రికకు, యాజమాన్యానికి జీవితాంతం రుణపడి ఉంటామని రైతులు చెప్తున్నారు.

- జనగామ

● హైదరాబాద్ శివార్లలోని జల్‌పల్లి గ్రామ పంచాయతీ (మున్సిపాలిటీ కాకముందు) పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న పశుమాంస కోల్డ్ స్టోరేజీలు, రోడ్లపై అక్రమంగా పడేస్తున్న పశువ్యర్థాలతో జనం తీవ్రంగా ఇబ్బందిపడేవారు. విపరీతమైన దుర్వాసన, అంటు రోగాలతో సతమతం అయ్యేవారు. ఆ ఇబ్బందులపై 'సాక్షి' 2014 సెప్టెంబర్ 14న 'వ్యర్థం..ప్రాణసంకటం' శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. పండ్ల నిల్వ పేరిట అనుమతులు తీసుకుని మాంసం నిల్వ చేస్తున్న తీరును బయటపెట్టింది. అప్పటికే ఇబ్బందుల్లో ఉన్న గ్రామస్తులు ఈ కథనంతో చైతన్యం పొందారు. సమస్య పరిష్కారం కోసం ఆందోళనకు దిగారు. అదే సమయంలో పశు మాంసంతో కోల్డ్ స్టోరేజీకి వెళుతున్న డీసీఎం వ్యాన్‌ను కొందరు అడ్డుకొని అద్దాలు ధ్వంసం చేశారు. గరిగుట్ట రోడ్డులో ఉన్న కోల్డ్ స్టోరేజీలపై దాడికి ప్రయత్నించినా.. పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు.



వ్యర్థం..ప్రాణసంకటం..

✔ అయితే కోల్డ్ స్టోరేజీపై దాడులకు పాల్పడ్డారంటూ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎంపీటీసీ యంజాల జనార్దన్, మరో ముగ్గురిని పోలీసులు సెప్టెంబర్ 16న తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. దీనితో వందలాది మంది గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. దీనితో ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజలకు మద్దతుగా వచ్చారు. ఆ మరునాడే అధికారులు మూడు కోల్డ్ స్టోరేజీలకు అనుమతులను రద్దు చేశారు.

- పహాడీషరీఫ్

రూ.10 వేల సాయం ఏ మూలకు సరిపోతుంది?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం కంటితుడుపు చర్యే అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. రైతులకు ఈ సాయం ఏ మూలకు సరిపోదని, అయినా అదే గొప్ప అన్నట్లుగా కేసీఆర్ చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎనిమిదేళ్లుగా అకాల వర్షాలతో పంటలు దెబ్బతింటున్నా ఏనాడూ పట్టించుకోని కేసీఆర్ ఎన్నికలు సమీపించడంతో ఈసారి పొలాలను సందర్శించి రైతులపట్ల ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నారని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షలకుపైగా ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేయగా, సీఎం మాత్రం 2.28 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందనడం విడ్డూరమన్నారు. ఈ విషయమై రైతుసంఘాల విజ్ఞప్తులను స్వీకరించకుండా రైతు నాయకులను గృహనిర్బంధాలకు పరిమితం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. పంటనష్టంపై కేంద్రప్రభుత్వానికి ఇప్పటివరకు కనీసం నివేదిక పంపని కేసీఆర్ కేంద్రాన్ని అడగడమే దండగంటూ బద్నాం చేయడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా కేసీఆర్ కేంద్రాన్ని విమర్శించడం మానుకుని రాష్ట్ర రైతాంగాన్ని పూర్తిగా ఆదుకోవాలని, తక్షణమే పంటనష్టంపై సమగ్ర నివేదిక తెప్పించుకోవడంతోపాటు వాస్తవిక నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి తన చేతగానితనాన్ని కేంద్రంపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అన్నీ కేంద్రం ఇచ్చాక, ఇక సీఎంగా ఉండి కేసీఆర్ చేసేదేమిటో అని ప్రశ్నించారు. రైతుల పక్షాన పోరాడాల్సిన కమ్యూనిస్టు పార్టీలు అధికారపార్టీకి భజన చేయడం విచారకరమన్నారు. ప్రగతిభవన్, ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్ అహంకారాన్ని అణచివేసి ధర్నాచౌక్, రైతుల వద్దకు తీసుకురాగలగడం బీజేపీ విజయమేనని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీకి శిక్ష దిగ్భ్రాంతికరం

సూరత్ కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానాలకు వెళతాం: రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీనేతలు పరువు నష్టం కేసులు వేసి రాహుల్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని గురువారం ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాయని విమర్శించారు. రాహుల్ గాంధీ 2019 పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో చేసిన వ్యాఖ్యలపై మోదీ ప్రభుత్వం ఆయనపై పరువు నష్టం దావా వేసి కుట్రకు పాల్పడిందని అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకులు, గాంధీ కుటుంబం ఇలాంటి చర్యలకు భయపడదని పేర్కొన్నారు. సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లి పోరాటం చేస్తామన్నారు. దేశం కోసం, ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కుంభకోణం విచారణలో తాను సాక్షిగా వెళుతున్న సమయంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులను హౌస్ అరెస్టులు, చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం కేసీఆర్ ఖమ్మం, మహబూ బాబాద్ జిల్లాలలో పంటనష్టాన్ని పరిశీలించేందుకు వెళ్తుంటే కూడా ఆయా జిల్లాల కాంగ్రెస్ నాయకులను అరెస్టులు చేశారని ధ్వజమెత్తారు.

గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల మౌనదీక్ష

రాహుల్‌కు జైలు శిక్షపై నిరసన

సాక్షి, హైదరాబాద్: బ్యాంకులను దోచేవారంతా మోదీలేనన్న ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై పరువు నష్టం దావా కేసులో సూరత్ కోర్టు రెండేళ్ల జైలు విధించడంపై గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు మౌనదీక్ష చేపట్టారు. ఇది ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతునొక్కడమేనని అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో నీరవ్ మోదీ, లలిత్ మోదీలను ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశారన్నారు. రాహుల్ గాంధీ చేసిన తప్పేంటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలకు భయపడేది లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసి ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావిద్, మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, వీ హనుమంతరావు, సీనియర్ నేతలు మహేష్ కుమార్‌గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, మల్లు రవి, నిరంజన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రోహిన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీసీలను అణగదొక్కుతున్నారు

బీసీ మంత్రులు బాడీగార్డులుగా పని చేస్తున్నారు: మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలను అణగదొక్కాలనే రహస్య ఎజెండాతో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని బీజేపీనేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ అవినీతి, అణచివేత పాలనలో అత్యధికంగా నష్టపోయింది బీసీ సామాజికవర్గమేనని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం బీసీలతోపాటు రెడ్డి సామాజికవర్గాన్ని టార్గెట్ చేస్తూ వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొడుతోందని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ కేబినెట్‌లో బీసీ మంత్రులను చూస్తుంటే బాడీగార్డులు గుర్తుకొస్తున్నారన్నారు. వారికి తమశాఖ అంటే ఏమిటో, హోదా ఏమిటో తెలియదని ఎద్దేవా చేశారు. ప్రగతిభవన్ పునాదులు కదలడంతో మొసలికన్నీళ్లు కారుస్తూ, కార్యకర్తలే బలం, బలగమంటూ మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ నేతృత్వంలో ఢిల్లీకి ప్రతినిధి బృందాన్ని తీసుకెళ్లి మహిళా రిజర్వేషన్లలో బీసీలకు మూడోవంతు కోటా వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఏప్రిల్ 6 నుంచి 14 దాకా 'పల్లెపల్లెకు ఓబీసీ–గడపగడపకు బీజేపీ'పేరిట వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్ తెలిపారు. బీసీ వర్గాలు అన్నిరంగాల్లో అణచివేతకు గురవుతున్నారని అన్నారు.

● యంగ్ టాలెంట్

చిన్న వయసులోనే యూనిక్ ఫొటో ప్రాజెక్ట్‌లతో 'వావ్' అనిపించుకుంటోంది ఇండియన్-అమెరికన్ జైరా రే. 'లెన్స్' భాష తెలిసిన జైరా భారతీయ కుటుంబ బంధాలను ఛాయాచిత్రాలలోకి తర్జుమా చేస్తోంది.

విజువల్ ఐ


జైరా

జైరా రే ఇండియన్-అమెరికన్ ఫొటోగ్రాఫర్, విజువల్ ఆర్టిస్ట్. న్యూయార్క్ నగరంలో పుట్టిన రే పద్నాలుగు సంవత్సరాల వయసులో ఫొటోలు తీయడం మొదలు పెట్టింది. హైస్కూల్ రోజుల్లో నగర అన్వేషణ తనకు ఇష్టమైన పని. ఆ అన్వేషణలో ప్రతి శబ్దం, నిశ్శబ్దం, ప్రతి దృశ్యం తన మనసులో ముద్రించుకు పోయేవి.

కంపోజిషన్, లైటింగ్, స్కేల్‌పై ఒక అవగాహన రావడానికి 'విజువల్ ఐ'ని డెవలప్ చేసుకోవడానికి ఆ సంచారం తనకు ఉపయోగపడింది.

ఫొటోగ్రఫీ అంటే కెమెరా క్లిక్ అనిపించడం కాదు. దాని మర్మం ఏమిటో అనుభవంతో తెలుసుకోవాలి.

ఆ లెక్కన జైరా చాలా తెలుసుకుంది. కమర్షియల్ వర్క్స్ కోసం కెనాన్ షూటర్‌ని వాడే జైరా వ్యక్తిగత అభిరుచి కోణంలో సోనీ మిర్రర్ లెస్ కెమెరా వాడుతుంది. ఏ లెన్స్‌ను ఎప్పుడు ఉపయోగించాలి అనే విషయంలోనూ తనకు స్పష్టత ఉంది. మామియా 645లో 45 ఎం.ఎం. లెన్స్, 85 ఎంఎం లెన్స్ అంటే ఇష్టం. ఇష్టమైన ఫిల్మ్‌స్టాక్‌లు పోర్ట్రా 400, కోడాక్ గోల్డ్.

మొన్నటి వరకు జైరా అభిరుచికి మాత్రమే పరిమితమైన ఫొటోగ్రఫీ భవిష్యత్‌లో కెరీర్‌గా మారనుంది. దీనికి తొలి అడుగు... బ్రౌన్ లవ్!


తన ప్రాజెక్ట్ వర్క్ కోసం 'బ్రౌన్ లవ్' థీమ్‌ను ఎంచుకుంది జైరా. దక్షిణ ఆసియా డయాస్పోరాలోని కుటుంబ బంధాలు, ప్రేమను డాక్యుమెంట్ చేసే ప్రాజెక్ట్ ఇది. కోవిడ్ వల్ల న్యూయార్క్‌కు మాత్రమే పరిమితమైన ఈ ప్రాజెక్ట్ ఆ తరువాత భారతదేశంలోని ఢిల్లీ, కోల్‌కత్తా.... మొదలైన నగరాలకు కూడా విస్తరించింది. అమెరికాలో హాలీవుడ్ సినిమాల కంటే బాలీవుడ్ సినిమాలు చూస్తూ పెరిగిన జైరాకు భారతీయ కుటుంబ వ్యవస్థలోని విలువలు, అనుబంధాల గురించి బాగా తెలుసు. అందుకే 'బ్రౌన్ లవ్' అనేది జైరా మనసుకు దగ్గరైన ప్రాజెక్ట్ అయింది.

జైరా చిత్రాలలో ఆర్టిస్టిక్ యాంగిల్ అనేది సంతకమై మెరుస్తుంది. 'ఆర్ట్ అనేది కథలను మోసుకెళుతూ వాటి గురించి చెప్పే అద్భుత వాహిక. నా ఫొటో ప్రాజెక్ట్‌ల ద్వారా ఎన్నో కథలు చెప్పాలనుకుంటున్నాను' అంటుంది జైరా రే.

● సక్సెస్ స్టోరీ

చిన్న వయసులో ఉన్నప్పుడు ఇండోర్ (మధ్యప్రదేశ్)లో జరిగిన మ్యాజిక్ షోకు వెళ్లాడు రాజ్ షమని. మెజిషియన్ టోపి నుంచి కుందేలు పిల్లను బయటికి తీశాడు. మంత్రదండం నుంచి పూలవర్షం కురిపించాడు. ఈ అబ్బురాలను చూసి 'మెజిషియన్ అయితే ఎన్ని అద్భుతాలు సాధించవచ్చో కదా!' అనుకున్నాడు రాజ్. పెద్దయ్యాక రాజ్ మెజిషియన్ కాలేదుగానీ 'మాటల మాంత్రికుడు' అయ్యాడు! సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్‌గా బోలెడు పేరు తెచ్చుకున్నాడు....

మాటే మంత్రమై...


రాజ్ షమని

పదహారు సంవత్సరాల వయసులో ఇండోర్‌లో తండ్రి చేసే వ్యాపారానికి చేదోడువాదోడుగా ఉండేవాడు రాజ్ షమని. తండ్రితో పాటు డిష్ సోప్స్ అమ్మేవాడు. 'కాలాన్ని కనిపెట్టుకొని ఉండాలి' అనేది వ్యాపారసూత్రం. ఆ వయసులో అతడికి ఇది తెలుసో లేదోగానీ డిష్ సోప్ నుంచి పౌడర్‌కు, పౌడర్ నుంచి లిక్విడ్‌కు, డిష్‌వాషర్ జెల్‌కు బిజినెస్‌ను మార్చాడు.

అంతకు ముందు ఉండీ లేనట్లుగా ఉన్న వ్యాపారం కొత్త ఊపిరి పోసుకొని లాభాల బాటలో పరుగెత్తింది.

రాజ్‌కు తన గురించి తాను తెలుసుకునేలా చేసింది. కొన్ని సంవత్సరాల తరువాత...

సోషల్ మీడియాలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ముంబైకి వచ్చాడు రాజ్.

'మరీ ఎక్కువగా ఉత్సాహపడుతున్నావు. ఇక్కడ బాగానే ఉంది కదా' అన్నారు ఇండోర్ ఫ్రెండ్స్. అయితే రాజ్ షమని ఒక్క విజయం దగ్గర ఆగిపోయే టైప్ కాదు. ఉత్సాహమే అతని ఇంధనం.

కొన్ని సంవత్సరాల కష్టం తరువాత మన దేశంలోని మోస్ట్-ఫాలోవ్డ్ కంటెంట్ క్రియేటర్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నాడు రాజ్ షమని. మరో విశేషం...

మన దేశంలోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించిన పాడ్‌కాస్ట్‌లలో రాజ్ షమని చేసిన 'ఫిగర్ ఔట్' పాడ్‌కాస్ట్ టాప్‌లో నిలిచింది. పన్నెండు నెలల వ్యవధిలో 100 మిలియన్ వ్యూలు వచ్చాయి.

తన స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఎంతో మంది స్టార్టప్‌ల వైపు రావడానికి కారణమైన రాజ్ తొమ్మిది స్టార్టప్‌లలో ఏంజెల్ ఇన్వెస్టర్‌గా ఉన్నాడు.

'వినియోగదారుల ఇష్టాలపైనే వ్యాపారాన్ని నిర్మించాలి' అని చెప్పే రాజ్ షమని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్ తమ కన్స్యూమర్ బ్రాండ్స్‌ను ఎస్టాబ్లిష్ చేసుకోవడం, విజయవంతం చేయడంలో సహాయపడే 'హౌజ్ ఆఫ్ ఎక్స్' వెంచర్ స్టార్ట్ చేశాడు. ఈ వెంచర్ ఇన్వెస్టర్‌ల జాబితాలో నితిన్ కామత్(జెరోదా-కో ఫౌండర్), వినీత సింగ్ (షుగర్ కాస్మెటిక్స్)లాంటి వ్యాపారదిగ్గజాలు ఉండడం విశేషం.

మోటివేషనల్ స్పీకర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకుంటున్నాడు 26 సంవత్సరాల రాజ్ షమని.

ఇప్పటివరకు ఇరవైకి పైగా దేశాల్లో స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఇచ్చిన రాజ్ షమని 'బిల్డ్, డోన్ట్ టాక్' పేరుతో వ్యక్తిత్వ వికాస పుస్తకం రాశాడు. ఈ పుస్తకం గురించి ఇలా పరిచయం చేసుకుంటాడు రాజ్...

'మన స్కూల్లో మ్యాథ్స్, సైన్స్ లాంటి సబ్జెక్ట్‌లు తెలుసుకుంటాం. అయితే ఒక వస్తువును ఎలా అమ్మాలి? స్నేహసంబంధాలను ఏర్పర్చుకోవడం ఎలా? మానసిక ఆరోగ్యంపై ఎలా శ్రద్ధ చూపాలి? ఆర్థిక విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి....మొదలైన విషయాలు స్కూల్‌లో తెలుసుకునే అవకాశం లేకపోవచ్చు. అందుకే ఈ పుస్తకం బడిలోకి రండి. ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు'

'హౌజ్ ఆఫ్ ఎక్స్' ఇన్వెస్టర్‌లలో ఒకరైన నితిన్ కామత్ ఇలా అంటాడు...

'ఐడియాలు, ప్రొడక్ట్ ఎంత ముఖ్యమో వ్యక్తులు కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలో రాజ్ షమని సాధించిన విజయాలే మా నమ్మకానికి కారణం'

ఒక్క విజయం దగ్గరే ఆగిపోయే అలవాటు లేని రాజ్ షమని, తన విజయాలకు మాత్రమే పరిమితం కావాలనుకోవడం లేదు. ఇతరులను కూడా గెలుపు బాటలో నడిపించాలనుకుంటున్నాడు.



మోటోరోలా మోటో జీ 53

డిస్‌ప్లే: 6.50 అంగుళాలు
రిజల్యూషన్: 720×1600 పిక్సెల్స్
మెమోరీ: 64జీబి 4జీబి ర్యామ్ 128జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 128జీబి 8జీబి ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13

● టెక్.. టాక్

లెన్సా ఏఐ

లెన్సా ఏఐ అనేది సరికొత్త ఏఐ పవర్డ్ ఫొటో ఎడిటర్. యూజర్‌లు తమ ఫొటోలను జస్ట్ ఒక్క క్లిక్‌తో కస్టమ్ అవతార్‌గా క్రియేట్ చేసుకోవచ్చు. ప్రిస్మా ల్యాబ్ కంపెనీకి చెందిన ఈ యాప్ ఫొటోల ఎడిటింగ్, వీడియో మేకింగ్, ఏఐ పవర్డ్ టూల్స్‌ను ఉపయోగించి ఆర్ట్‌ను క్రియేట్ చేయడం....మొదలైన వాటిలో ఉపయోగపడుతుంది. వార్షిక సబ్‌స్క్రిప్షన్ ₹ 2,499 వీక్లీ, మంత్లీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లు కూడా ఉన్నాయి. యాపిల్ యాప్‌స్టోర్, గూగుల్ ప్లేస్టోర్‌లో దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



స్పామ్ ఇమెయిల్స్‌ను బ్లాక్ చేయడానికి...



1. జీమెయిల్ ఓపెన్ చేసిన తరువాత బ్లాక్ చేయాలనుకున్న స్పామ్ ఈమెయిల్‌ను క్లిక్ చేయాలి.
2. 'మోర్' లేదా టాప్‌రైట్‌లోని 'ఐ' ఐకాన్‌ను క్లిక్ చేయాలి.
3. బ్లాక్-క్లిక్
4. సెండర్‌ను బ్లాక్ చేసిన తరువాత అక్కడి నుంచి వచ్చే మెసేజ్‌లు ఆటోమేటిక్‌గా జీమెయిల్ స్పామ్ ఫోల్డర్‌లోకి వెళతాయి.

● గేమింగ్



ఫస్ట్ పర్సన్ బిల్డింగ్ అండ్ రైడింగ్ గేమ్ 'మీట్ యువర్ మేకర్' ఏప్రిల్ 4న విడుదల అవుతుంది. వరల్డ్ మ్యాప్‌లోని రైడింగ్ ఔట్‌పోస్ట్స్ యాక్టివేటింగ్ చేయడం ద్వారా ప్లేయర్స్ ర్యాంకింగ్ పాయింట్స్‌ను సంపాదించుకోవాల్సి ఉంటుంది. డ్రాగ్ అండ్ డ్రాప్, డిలిట్ ఎవ్రీ థింగ్...మొదలైన కొత్త బిల్డింగ్ ఫీచర్స్ ఉన్నాయి. లీ ప్లే సిస్టమ్, మ్యాచ్ మేకింగ్ ఫీచర్‌లలో ఇంప్రూవ్‌మెంట్ తీసుకువచ్చారు. 'ఛాలెంజ్ యువర్ ఫ్రెండ్స్' అంటూ వచ్చిన ట్రైలర్ ఆకట్టుకుంది.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ మైక్రోసాఫ్ట్‌విండోస్. **జానర్:** స్ట్రాటజీ వీడియో గేమ్

సినిమా

సాక్షికి శుభాకాంక్షలు
- సినీ ప్రముఖుల అభినందనలు

'సాక్షి' ప్రారంభమై పదిహేనేళ్లు అయిందంటే నమ్మలేకపోతున్నాను. ప్రారంభ వేడుకకి మొన్న మొన్నే వెళ్లినట్లుగా అనిపిస్తోంది. ఆ వేడుక ఇంకా గుర్తుంది. 'సాక్షి'కి నా ప్రత్యేక అభినందనలు'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. 'సాక్షి' దినపత్రిక ఆరంభమై నేటితో 15 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా అల్లు అరవింద్ శుభాకాంక్షలు తెలిపారు. ''సాక్షి' పదిహేనేళ్లు పూర్తి చేసుకుంది. ఇంకా బ్రహ్మాండంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను'' అన్నారు నిర్మాత అచ్చిరెడ్డి. ''సాక్షి' ఇలాంటి విజయవంతమైన వసంతాలను ఎన్నో చూడాలి'' అన్నారు కన్నడ హీరో శివరాజ్‌కుమార్. 'సాక్షి' పదిహేనేళ్లు పూర్తి చేసుకుని, పదహారో ఏడాదిలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా శుభాకాంక్షలు'' అన్నారు దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. ''తెలుగు ప్రేక్షకులకు అద్భుతమైన వాస్తవాలను అందించాలని, స్ఫూర్తినిచ్చే వార్తలు ఇవ్వాలనే ప్రజాసంకల్పాన్ని ధ్యేయంగా చేసుకుని అందులో విజయం సాధిస్తూ, ప్రతి ఏడాది ప్రజలకు మరింత చేరువవుతున్నందుకు అభినందనలు'' అన్నారు నిర్మాత కె.అచ్చిరెడ్డి. ఇంకా హీరోలు 'అల్లరి' నరేశ్, ఆది సాయికుమార్, కార్తికేయ, విశ్వక్ సేన్, కిరణ్ అబ్బవరం, నటులు తనికెళ్ల భరణి, సుమన్, సాయికుమార్, 'సీనియర్' నరేశ్, అలీ, దర్శకులు కృష్ణవంశీ, బి.గోపాల్, నందినీ రెడ్డి, నిర్మాతలు సి.కల్యాణ్, 'దిల్' రాజు, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, రచయిత, నిర్మాత కోన వెంకట్ తదితరులు 'సాక్షి'కి శుభాకాంక్షలు తెలిపి, మరిన్ని విజయవంతమైన వసంతాలను చూడాలని ఆకాంక్షించారు.

భయాన్ని చూపిస్తాడు!


● ఎన్టీఆర్, జాన్వీ కపూర్, రాజమౌళి

ఎన్టీఆర్ హీరోగా పాన్ ఇండియా సినిమా షురూ అయింది. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్-డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఎన్టీఆర్ 30' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంతో దివంగత అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ టాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఎన్టీఆర్, జాన్వీపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కొరటాల శివ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి క్లాప్ కొట్టారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందించారు. కొరటాల శివ మాట్లాడుతూ – ''నేటి తరంలో బెస్ట్ యాక్టర్స్‌లో ఒకరైన ఎన్టీఆర్‌తో సినిమా తీయడం నా అదృష్టం. ఈ కథలో మనుషుల కన్నా ఎక్కువగా భయమంటే ఏంటో తెలియని మృగాలుంటారు. దేవుడన్నా, చావు అన్నా భయం లేదు. కానీ, వారికి ఒకరంటే భయం (ఎన్టీఆర్). వారిని భయపెట్టడానికి ఈ సినిమాలో నా ప్రధాన పాత్ర ఏ రేంజ్‌కి వెళ్తుంది? అనేది భావోద్వేగంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, కెమెరా: రత్నవేలు.

శకుంతలకు 15 కేజీల బంగారం


● సమంత

కాళిదాసు రచించిన ప్రేమకావ్యం అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన చిత్రం 'శాకుంతలం'. శకుంతలగా సమంత, దుష్యంత్ మహారాజు పాత్రలో దేవ్ మోహన్, మేనకగా మధుబాల నటించారు. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రధారులు ధరించిన బంగారు ఆభరణాలతో కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గుణశేఖర్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలోని ప్రధాన పాత్రధారుల కోసం రూ.14 కోట్లు విలువ చేసే బంగారు, వజ్రాభరణాలను ఉపయోగించాం. ప్రముఖ డిజైనర్ నీతూ లుల్లా నేతృత్వంలో దాదాపు 7 నెలలు కష్టపడి ఈ బంగారు, వజ్రాభరణాలను సిద్ధం చేశాం. శకుంతల పాత్ర కోసం 15 కేజీల బంగారంతో 14 రకాల ఆభరణాలు రెడీ చేశాం. దుష్యంత్ పాత్రకి దాదాపు పది కేజీల బంగారం వినియోగించాం. మేనక పాత్రకు 6కోట్లతో వజ్రాలు పొదిగిన దుస్తులు రూపొందించాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్ మోహన్, నిర్మాత హర్షిత, డిజైనర్ నీతూ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులు ఆ నమ్మకాన్ని ఇచ్చారు - విశ్వక్ సేన్



''నిజానికి కామెడీ నా బలం కాదు. యాక్షన్, డార్క్ డ్రామా, ఇంటెన్స్ ఎమోషన్స్‌ని బాగా డైరెక్ట్ చేస్తా. అయితే 'దాస్ కా ధమ్కీ' సినిమాతో కామెడీ కూడా బాగా తీయగలననే నమ్మకాన్ని ఇచ్చారు ప్రేక్షకులు'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. 'కరాటే' రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన ఈ సినిమా బుధవారం విడుదలైంది. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''దాస్ కా ధమ్కీ' మేం అనుకున్నదానికంటే పెద్ద సక్సెస్ అయ్యింది. నా కెరీర్ బెస్ట్ ఓపెనింగ్స్ (రూ.8 కోట్ల 88లక్షలు) వచ్చాయి. హీరో, డైరెక్షన్, ప్రొడక్షన్. ఈ మూడు బాధ్యతలు నిర్వహించడం ఒత్తిడిగా ఉంటుంది. నా 'ఫలక్‌నామా దాస్' కంటే పదింతలు 'దాస్ కా ధమ్కీ'కి ఖర్చు పెట్టాం. సినిమా చేయడం కష్టం కాదు కానీ విడుదల చేయడం మాత్రం కష్టంతో కూడుకున్న పని. ఈ మూవీ ఫస్ట్ డ్రాఫ్ట్‌ని రచయిత ప్రసన్న నుంచి కొన్నాను. నేను నటించిన 'గామి' రిలీజ్‌కి రెడీగా ఉంది. సితార బ్యానర్‌లో ఓ సినిమా, రామ్ తాళ్లూరితో ఓ సినిమా చేయాలి. అలాగే నా సొంత బ్యానర్‌లో ఓ మూవీ ఉంటుంది'' అన్నారు.

ఇండియన్ సినిమాలు... ఫారిన్ విలన్లు!

భారతీయ కథలు ఇప్పుడు దేశీ ప్రేక్షకులతో పాటు విదేశీ ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే విదేశీ ఫైట్ మాస్టర్స్ ఇండియన్ సినిమాలకు ఫైట్స్ కంపోజ్ చేస్తున్నారు. ఇప్పుడు ఫారిన్ ఆర్టిస్టులు కూడా అరంగేట్రం చేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్ సరసన ఫారిన్ బ్యూటీ ఒలీవియా మోరిస్ నటించారు. అంతకుముందు అమీ జాక్సన్ వంటి తారలు కూడా వచ్చారు. ఇప్పుడు ఫారిన్ విలన్లు వస్తున్నారు. వారి గురించి తెలుసుకుందాం.

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబోలో 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కమల్-శంకర్ కాంబోలోనే సెట్స్‌పై ఉన్న ఈ సీక్వెల్‌లో ముంబై బేస్ట్ బ్రిటిష్ యాక్టర్ బెనెడిక్ట్ గారెట్ ఓ కీ రోల్ చేశారు. ఆల్రెడీ ఆయన క్యారెక్టర్ తాలూకు షూటింగ్ కూడా పూర్తయింది. ''ఇండియన్ 2'లో నా వంతు షూటింగ్‌ను పూర్తి చేశాను. అద్భుతమైన అనుభవం దక్కింది. ఈ సినిమా తెర మీద ఎలా ఉంటుందో చూడాలని ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు బెనెడిక్ట్. కాగా ఈ చిత్రంలో బెనెడిక్ట్‌ది విలన్ రోల్ అనే ప్రచారం. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, సిద్ధార్థ్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఇక కోలీవుడ్‌లో సుమారు ఆరేళ్ల క్రితం సెట్స్‌పైకి వెళ్లి ఇంకా రిలీజ్‌కు నోచుకోని చిత్రం 'ధృవనక్షత్రం'. విక్రమ్ హీరోగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందుతున్న స్పై యాక్షన్ ఫిల్మ్ ఇది. గతంలో ఆగిపోయిన ఈ సినిమా షూటింగ్‌ని ఇటీవలే మళ్లీ ఆరంభించారు. 'ఇండియన్ 2'లో నటించిన బెనెడిక్ట్ గారెట్ ఈ మూవీలోనూ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు ప్రస్తుతం విక్రమ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'తంగలాన్'. ఈ చిత్రానికి పా. రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఇంగ్లిష్ యాక్టర్ డేనియల్ కాల్టాగిరోన్ ఓ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆయనది ప్రతినాయకుడి పాత్ర అని కోలీవుడ్ టాక్. ఇక 'తంగలాన్' విడుదల తేదీపై త్వరలోనే సరైన స్పష్టత రానుంది.

ఇలా... రానున్న రోజుల్లో మరికొందరు ఇంగ్లిష్ యాక్టర్స్ ఇండియన్ సినిమాల్లో కనిపించే అవకాశం ఉంది.


● బెనెడిక్ట్ ● కమల్ హాసన్
● డేనియల్ ● విక్రమ్

సెప్టెంబరులో ఖుషి


● విజయ్ దేవరకొండ, సమంత

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఖుషి'. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 1న 'ఖుషి' రిలీజ్ చేయనున్నట్లు గురువారం ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. ''కశ్మీర్‌తో పాటు ఇతర అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరిస్తున్నాం. మిడ్ మాన్సూన్‌లో రెండు విభిన్నమైన నేపథ్యాల మధ్య రాబోతున్న ఈ కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హిషామ్ అబ్దుల్ వాహబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేష్ నరసింహన్.

నిజమేది.. రుజువేది...


● సంతోష్ శోభన్, మాళవిక, నందినీ రెడ్డి

సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. నందినీ రెడ్డి దర్శకత్వంలో మిత్రవిందా మూవీస్‌తో కలిసి స్వప్న సినిమాస్ పతాకంపై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం మే 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని టైటిల్ ట్రాక్ 'అన్నీ మంచి శకునములే..'ను విడుదల చేసింది చిత్ర యూనిట్. సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్ స్వరకల్పనలో కార్తీక్ సాహిత్యం అందించిన ఈ పాటను రెహమాన్ పాడారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ– ''స్వప్న సినిమాస్‌పై నేను 'స్టూడెంట్ నంబర్ 1' సినిమా తీశాను. కొంతగ్యాప్ తర్వాత నా కుమార్తెలు ప్రియాంకా దత్, స్వప్నాదత్ అమెరికా నుంచి తిరిగి రాగానే వారికి ఈ బాధ్యతలు అప్పగించాను. అప్పుడు నాకు మంచి శకునము ఆరంభం అయింది'' అని అన్నారు. ''రెండు కుటుంబాల మధ్య జరిగే కథే ఈ చిత్రం'' అన్నారు నందినీ రెడ్డి.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ షురూ


● మాధవ్, రాఘవేంద్రరావు

హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం గురువారం ఆరంభమైంది. గౌరీ రోణంకి దర్శకత్వంలో యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ నిర్మాత. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్ బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు రాఘవేంద్రరావు క్లాప్ కొట్టి, చిత్ర స్క్రిప్ట్‌ను దర్శక-నిర్మాతలకు అందజేశారు. గౌరి రోణంకి మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. కలర్‌ఫుల్‌గా ఉంటుంది'' అన్నారు. ''మంచి పాయింట్‌తో తెరకెక్కుతున్న చిత్రం ఇది'' అన్నారు జేజేఆర్ రవిచంద్. ''ఏప్రిల్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు మాధవ్. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: రామ్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
24-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
289	75
57,925	17,077

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,852	△	182
డోజోన్స్	32,204	△	174
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,500	▽	67
డాక్స్	15,210	▽	6
షాంఘై	3,287	△	21
నికాయ్	27,420	▽	47

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,086
బంగారం (22 క్యారట్)	58,849
వెండి (కిలో)	69,136

58,000 దిగువకు సెన్సెక్స్

రెండు రోజుల లాభాలకు బ్రేక్



ముంబై: బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలతో స్టాక్ సూచీలు గురువారం నష్టాలతో ముగిశాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల పెంపు మార్కెట్ వర్గాలను మెప్పించలేకపోయింది. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు, అధిక వెయిటేజీ రిలయన్స్ షేరు(1%) పతనం సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు వెంటనే కోలుకొని లాభాల బాటపట్టాయి. మిడ్ సెషన్ వరకు లాభాల్లో ట్రేడైన సూచీలు తర్వాత అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. స్విస్ నేషనల్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపుతో యూరప్ మార్కెట్ల నష్టాల ప్రారంభం మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఉదయం సెన్సెక్స్ 154 పాయింట్ల నష్టంతో 58,061 మొదలైంది. ఇంట్రాడేలో 57,839 వద్ద కనిష్టాన్ని.., 58,396 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 289 పాయింట్ల నష్టంతో 58 వేల దిగువన 57,925 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,045 – 17,205 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 75 పాయింట్లను కోల్పోయి 17,077 వద్ద స్థిరపడింది. ఫార్మా, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 39 పైసలు పెరిగి 82.27 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ రెండు నెలల కనిష్టానికి దిగిరావడం దేశీయ కరెన్సీ బలపడింది.

- గ్లోబల్ సర్ఫేసెస్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.140)తో పోలిస్తే 16% ప్రీమియంతో రూ.163 వద్ద లిస్టయ్యింది. 22.25% ఎగసి రూ.171.15 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 22% లాభంతో రూ.170.90 వద్ద స్థిరపడింది.

ఆన్‌లైన్ కంపెనీలకూ బాధ్యతలు

- జవాబుదారీతనాన్ని పెంచేందుకు నిబంధనలు
- కేంద్రం కసరత్తు



న్యూఢిల్లీ: విక్రేతల మోసాలకు కూడా ఈ-కామర్స్ సంస్థలను బాధ్యులుగా చేసే దిశగా నిబంధనలను కఠినతరం చేయడంపై కేంద్రం దృష్టి సారించింది. వాటిలో జవాబుదారీతనాన్ని మరింతగా పెంచేలా రూల్స్‌ను రూపొందించడంపై వినియోగదారుల వ్యవహారాల శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి, మధ్యవర్తిత్వ సంస్థలుగా అవి పోషిస్తున్న పాత్ర గురించి తెలియజేయాలంటూ కొన్ని ప్రశ్నలను ఈ-కామర్స్ కంపెనీలకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ పంపించింది. వాటికి సమాధానాలు వచ్చిన తర్వాత మార్గదర్శకాల రూపకల్పన ప్రారంభమవుతుందని వినియోగదారుల వ్యవహారాల శాఖ తెలిపింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు సాధారణంగా విక్రేతలు, కొనుగోలుదారులను అనుసంధానించే మధ్యవర్తిత్వ సంస్థలుగా వ్యవహరిస్తున్నాయి. వీటికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000లోని సెక్షన్ 79 ప్రకారం నిర్దిష్ట బాధ్యతల నుంచి కొన్ని మినహాయింపులు ఉంటున్నాయి. అయితే, ప్రతిపాదిత మార్పుల ప్రకారం దాన్ని మార్చి, మధ్యవర్తిత్వ సంస్థలుగా వాటికి మరింత జవాబుదారీతనాన్ని కట్టబెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ ఎకానమీలో వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేలా ఈ-కామర్స్ నిబంధనలను పునర్‌వ్యవస్థీకరించే ప్రక్రియ చేపట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో విక్రయించే ఉత్పత్తులు లోపభూయిష్టంగా ఉన్నట్లు తేలితే .. ఆయా ఈ-కామర్స్ సంస్థలనే బాధ్యులను చేయాలని భావిస్తున్నట్లు వివరించాయి. ఈ-కామర్స్ సంస్థలో నమోదు చేసుకున్న విక్రేత నిర్లక్ష్యంగా వ్యవహరించి, వినియోగదారులు ఆర్డరు చేసిన ఉత్పత్తులు లేదా సర్వీసులను అందించడంలో విఫలమైనా సదరు ఆన్‌లైన్ షాపింగ్ సంస్థే బాధ్యత వహించేలా నిబంధనలు ఉండవచ్చని పేర్కొన్నాయి.

భారత పర్యటనలో 'ప్రపంచ బ్యాంక్' అజయ్ బంగా

ప్రధాని, ఆర్థిక మంత్రి తదితరులతో సమావేశాలు



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్‌గా అమెరికా ప్రతిపాదించిన అజయ్ బంగా తాజాగా భారత్ పర్యటనకు వచ్చారు. రెండు రోజుల పర్యటనలో (మార్చి 23, 24) భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ తదితరులతో సమావేశం కానున్నారు. భారత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధిపరమైన సవాళ్లు వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించనున్నారని అమెరికా ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన వృత్తి విద్యా కోర్సుల సంస్థల నెట్‌వర్క్ 'లెర్నెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్'ను కూడా బంగా సందర్శించనున్నారు. దీనికి ప్రపంచ బ్యాంక్ పాక్షికంగా నిధులు సమకూర్చింది. మాస్టర్‌కార్డ్ చీఫ్‌గా ఉన్న బంగా పేరును ప్రపంచ బ్యాంక్‌కు కొత్త ప్రెసిడెంట్‌గా ప్రతిపాదించిన వెంటనే భారత ప్రభుత్వం మద్దతు తెలిపిందని అమెరికా ఆర్థిక శాఖ తెలిపింది. ఇప్పటికే బంగ్లాదేశ్, ఫ్రాన్స్, ఈజిప్ట్, జర్మనీ, ఇటలీ, సౌదీ అరేబియా, బ్రిటన్ తదిన్‌దేశాలు కూడా మద్దతు ప్రకటించినట్లు వివరించింది. తన అభ్యర్థిత్వానికి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆయన మూడు వారాలుగా వివిధ దేశాలను సందర్శిస్తున్నారు. ఆఫ్రికాతో ప్రారంభించి యూరప్, లాటిన్ అమెరికా, ఆసియా దేశాల తర్వాత ఆఖరుగా భారత్ వచ్చారు.

స్టార్టప్స్ కోసం రూ. 700 కోట్ల ఫండ్



న్యూఢిల్లీ: స్టార్టప్స్‌కు నిధులు సమకూర్చేందుకు రూ.700 కోట్లకు పైగా కార్పస్ ఉన్నట్లు రీసెర్చ్, డెవలప్‌మెంట్ సంస్థ సి-డాట్ వెల్లడించింది. ఆవిష్కరణలకు అందించే నిధులకు ఎటువంటి పరిమితిని ప్రభుత్వం విధించలేదని సంస్థ సీఈవో రాజ్‌కుమార్ ఉపాధ్యాయ్ తెలిపారు. సాంకేతిక భాగస్వామ్యానికి పొరుగున ఉన్న దేశాలు ఆసక్తిగా ఉన్నాయని, దేశీయ ఆవిష్కరణలు భారత్ వెలుపల విస్తరణకు ఆస్కారం ఉందన్నారు.

వాహనాలు మరింత ప్రియం

- కార్లు రూ. 30,000 వరకు
- ద్విచక్ర వాహనాలు రూ. 2,500
- ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా అన్ని రకాల వాహనాల ధరలు ప్రియం కానున్నాయి. కాలుష్యాన్ని కట్టడి చేసే చర్యల్లో భాగంగా భారత్ స్టేజ్-6 రెండవ దశ ఉద్గార ప్రమాణాలు వచ్చే నెల నుంచి అమలులోకి వస్తుండడమే ఇందుకు కారణం. ప్యాసింజర్, ద్విచక్ర, వాణిజ్య వాహనాలకు ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు వర్తించనున్నాయి. చాలా కంపెనీలు ఇప్పటికే ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించాయి. మారుతీ సుజుకీ, హోండా కార్స్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్ వంటి సంస్థలు వీటిలో ఉన్నాయి.

ఖరీదు రూ.30,000 వరకు..

ప్రమాణాలకు అనుగుణంగా కంపెనీలు తమ వాహనాలను అప్‌గ్రేడ్ చేశాయి. దీంతో ప్యాసింజర్ కార్లు మోడల్, వేరియంట్‌నుబట్టి రూ.10,000 మొదలుకుని రూ.30,000 వరకు ధరలు పెరగనున్నాయి. ప్రారంభ స్థాయి ద్విచక్ర వాహనాలు రూ.2,500 దాకా భారం కానున్నాయి. ఇప్పటికే ముడిసరుకు వ్యయాలకు అనుగుణంగా కంపెనీలు వాహనాల ధరలను పెంచుతూ వస్తున్నాయి. అన్ని రకాల వాహన విభాగాల్లోనూ తయారీ కంపెనీలు ధరలను సవరించాయి.

వాహనాల్లో మార్పులు..

నూతన ఉద్గార ప్రమాణాల కింద వాహనాలకు ఆధునిక సాంకేతికత వినియోగించాల్సి వస్తోంది. ప్రోగ్రామ్‌తో కూడిన ఫ్యూయల్ ఇంజెక్టర్స్, సెల్ఫ్ డయాగ్నోస్టిక్ డివైసెస్ ఏర్పాటు తప్పనిసరి అయింది. వాహనం నుంచి వెలువడే కాలుష్య స్థాయిని తెలిపే పరికరం అమర్చాల్సి ఉంటుంది. యూరప్‌లో అమలులో ఉన్న యూరో-6 ప్రమాణాలకు సమానంగా భారత్ స్టేజ్-6 రెండవ దశ ఉద్గార ప్రమాణాలను తీర్చిదిద్దారు. దీంతో వాహనాల్లోని ఇంజిన్లను అప్‌గ్రేడ్ చేయాల్సి వస్తోంది. ఇప్పటికే పరిశ్రమలో 7,00,000 ప్యాసింజర్ కార్లకు బుకింగ్స్ నమోదై ఉన్నాయి. ధర పెరగడం వల్ల డిమాండ్ తగ్గే అవకాశం లేదని కంపెనీలు ధీమాగా ఉన్నాయి.

వ్యయ భారంతో..

ప్రమాణాలకు అనుగుణంగా ఇంజన్లలో మార్పుల ప్రక్రియ ఖర్చుతో కూడుకున్నది. అధికంగా డిమాండ్ ఉన్న మోడళ్లను మాత్రమే కంపెనీలు అప్‌గ్రేడ్ చేస్తున్నాయి. డిమాండ్ తక్కువ ఉన్న మోడళ్లకు స్వస్తి పలకడం తప్పడం లేదు. ఏప్రిల్ 1 నుంచి ఇటువంటివి కనుమరుగు కానున్నాయి. వీటిలో మారుతీ సుజుకీ ఆల్టో 800, హోండా జాజ్, డబ్ల్యూఆర్-వి, అమేజ్ డీజిల్, సిటీ జనరేషన్-4, సిటీ జనరేషన్-5 డీజిల్, మహీంద్రా ఆల్టరస్ జీ4, కేయూవీ100, మరజ్జో, స్కోడా ఆక్టావియా, సూపర్బ్, హ్యుండై ఐ20 డీజిల్, వెర్నా డీజిల్, రెనో క్విడ్ 800, నిస్సాన్ కిక్స్, టాటా ఆల్ట్రోజ్ డీజిల్, టయోటా ఇన్నోవా క్రిస్టా పెట్రోల్ మోడళ్లు ఉన్నాయి.

బ్లాక్ సంస్థకు హిండెన్‌బర్గ్ షాక్...

షేర్లు 20 శాతం డౌన్

న్యూఢిల్లీ: షార్ట్‌సెల్లింగ్ రిపోర్టుతో అదానీ గ్రూప్‌ను అతలాకుతలం చేసిన అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ తాజాగా మరో కంపెనీని టార్గెట్ చేసుకుంది. ఈసారి ట్విటర్ సహ-వ్యవస్థాపకుడు జాక్ డార్సీకి చెందిన చెల్లింపుల కంపెనీ బ్లాక్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. ఇన్వెస్టర్లను బ్లాక్ తప్పుదోవ పట్టించిందంటూ నివేదికను ప్రచురించింది. 1 బిలియన్ డాలర్ల పైగా మోసానికి పాల్పడిందంటూ ఆరోపించింది. దాదాపు రెండేళ్ల పరిశోధన తర్వాత ఈ రిపోర్టును రూపొందించినట్లు పేర్కొంది. ఈ నివేదికతో అమెరికా మార్కెట్లో బ్లాక్ షేర్లు ఒక దశలో 20 శాతం పైగా క్షీణించి 58 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ ఈ ఏడాది జనవరిలో ఆరోపించడం, ఫలితంగా అదానీ సంస్థల షేర్లు భారీగా పతనం కావడం తెలిసిందే. అంతకు ముందు 2020లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ నికోలా కార్పొరేషన్‌పై కూడా హిండెన్‌బర్గ్ పలు ఆరోపణలు చేసింది. దీనితో ఆ కంపెనీ షేరు పతనం కావడంతో పాటు సంస్థ వ్యవస్థాపకుడు ట్రెవర్ మిల్టన్‌పై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి.

ఎల్ఐసీ సారథిగా సిద్ధార్థ మహంతి

ఎంపిక చేసిన ఎఫ్ఎస్ఐబీ



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ నూతన సారథిగా సిద్ధార్థ మహంతిని ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) గురువారం ఎంపిక చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల చీఫ్‌లు, సారథుల ఎంపికను ఎఫ్ఎస్ఐబీ చూస్తుంటుంది. నిబంధనల ప్రకారం నలుగు మేనేజింగ్ డైరెక్టర్ల నుంచి చైర్మన్‌ను ఎంపిక చేస్తారు. మొత్తం మీద అనుభవం, ఇతర అంశాల ఆధారంగా ఎల్ఐసీ చైర్‌పర్సన్ పదవికి సిద్ధార్థ మహంతిని సిఫారసు చేసినట్టు ఎఫ్ఎస్ఐబీ ప్రకటన విడుదల చేసింది. ఎఫ్ఎస్ఐబీ సిఫారసుపై తుది నిర్ణయాన్ని ప్రధాని అధ్యక్షతన గల కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ తీసుకుంటుంది. ఒకవేళ మహంతి నియామకం ఖరారు కాకపోతే ఆయన ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎల్ఐసీ చైర్మన్‌గా ఎంపికైతే 62 ఏళ్లు వచ్చే వరకు కొనసాగొచ్చు. ఇతర ఉన్నత ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 60 ఏళ్లుగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
24-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
23-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

సాక్షి స్పోర్ట్స్

వెస్లీ మదెవెరె 'హ్యాట్రిక్'



నెదర్లాండ్స్ జట్టుతో హరారేలో గురువారం జరిగిన రెండో వన్డేలో జింబాబ్వే జట్టు ఒక్క పరుగు తేడాతో గెలిచింది. వెస్లీ మదెవెరె ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జింబాబ్వే విజయంలో కీలకపాత్ర పోషించాడు. మదెవెరె 43 పరుగులు చేయడంతోపాటు 'హ్యాట్రిక్' తీశాడు. ముందుగా జింబాబ్వే 49.2 ఓవర్లలో 271 పరుగులకు ఆలౌటైంది. సీన్ విలియమ్స్ (77 : 11 ఫోర్లు), మదాండె (52 : 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం నెదర్లాండ్స్ జట్టు సరిగ్గా 50 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. మాక్స్ ఒడౌడ్ (81 : 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), టామ్ కూపర్ (74 : 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ఇన్నింగ్స్ 44వ ఓవర్ వేసిన మదెవెరె తొలి మూడు బంతుల్లో వరుసగా అకెర్‌మన్, తేజ నిడమనూరు, మీకెరన్‌లను అవుట్ చేసి 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. బ్రాండెస్ (1997లో ఇంగ్లండ్‌పై), ఉత్సెయ (2014లో దక్షిణాఫ్రికాపై) తర్వాత జింబాబ్వే తరఫున వన్డేల్లో 'హ్యాట్రిక్' సాధించిన మూడో బౌలర్‌గా మదెవెరె నిలిచాడు.

నిఖత్ పంచ్ అదిరె...



వలెన్సియాపై నిఖత్ పంచ్..

- ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత స్టార్
- నీతూ, లవ్లీనా, స్వీటీ కూడా పసిడి పోరుకు అర్హత



న్యూఢిల్లీ: సొంతగడ్డపై భారత మహిళా బాక్సర్లు తమ పంచ్ పవర్‌ను ప్రదర్శించారు. ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా నలుగురు భారత బాక్సర్లు ఫైనల్లోకి దూసుకెళ్లారు. తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ (50 కేజీలు), నీతూ (48 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు) తుది పోరుకు అర్హత సాధించి స్వర్ణ పతకాలకు విజయం దూరంలో నిలిచారు. గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో నిఖత్ జరీన్ 5-0తో 2016 రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత ఇన్‌గ్రిత్ వలెన్సియా (కొలంబియా)ను చిత్తుగా ఓడించగా... నీతూ 5-2తో ఆసియా చాంపియన్ అలువా బల్కిబెకోవా (కజకిస్తాన్)పై, లవ్లీనా 4-1తో లీ కియాన్ (చైనా)పై, స్వీటీ 4-3తో స్యు ఎమ్మా గ్రీన్‌ట్రీ (ఆస్ట్రేలియా)పై గెలుపొందారు. గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 52 కేజీల విభాగంలో పోటీపడి స్వర్ణం సాధించిన నిఖత్ ఈసారి 50 కేజీల విభాగంలో బరిలోకి దిగింది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను ఓడించిన వలెన్సియాను నిఖత్ తక్కువ అంచనా వేయకుండా ఆరంభం నుంచే పక్కా ప్రణాళికతో ఆడింది. రింగ్‌లో వేగంగా కదులుతూనే అవకాశం దొరికినప్పుడల్లా వలెన్సియాపై పంచ్‌లు విసిరింది. ప్రత్యర్థి తనపై ఆధిపత్యం చెలాయించకుండా కూడా నిఖత్ జాగ్రత్త పడింది. ముందుగా తొలి రెండు రౌండ్లలో ఎదురుదాడి చేసి స్పష్టమైన ఆధిక్యం సంపాదించిన నిఖత్ మూడో రౌండ్‌లో మాత్రం ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా రక్షణాత్మకంగా ఆడి కట్టడి చేసింది.

నేడు విశ్రాంతి దినం. శనివారం, ఆదివారం ఫైనల్స్ జరుగుతాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఫైనల్స్‌లో లుత్సయిఖాన్ అల్టాంట్‌సెట్‌సెగ్ (మంగోలియా)తో నీతూ... లీనా వాంగ్ (చైనా)తో స్వీటీ తలపడతారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఫైనల్స్‌లో ఎన్గుయెన్ థి టామ్ (వియత్నాం)తో నిఖత్ జరీన్... కైట్లిన్ పార్కర్ (ఆస్ట్రేలియా)తో లవ్లీనా పోటీపడతారు.

2 ఒకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది భారత బాక్సర్లు ఫైనల్ చేరడం ఇది రెండోసారి. 2006లో న్యూఢిల్లీయే ఆతిథ్యమిచ్చిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదుగురు భారత బాక్సర్లు (మేరీకోమ్, సరితా దేవి, జెన్నీ, లేఖ, నగిశెట్టి ఉష) ఫైనల్ చేరారు. ఉష రజతం నెగ్గగా, మేరీకోమ్, సరిత, జెన్నీ, లేఖ స్వర్ణ పతకాలు గెలిచారు.

3 మేరీకోమ్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కనీసం రెండుసార్లు ఫైనల్‌కు చేరిన భారత బాక్సర్లుగా నిఖత్ జరీన్, స్వీటీ గుర్తింపు పొందారు. మేరీకోమ్ ఏకంగా ఏడుసార్లు ఫైనల్‌కు చేరి ఆరుసార్లు స్వర్ణం, ఒకసారి రజతం సాధించింది. నిఖత్ గత ఏడాది, స్వీటీ 2014లో ఫైనల్‌కు చేరారు.

భారత్ ఖాతాలో రెండు పతకాలు

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



పతకాలతో రిథమ్, వరుణ్, నర్మద, రుద్రాంక్ష్

భోపాల్: వరుసగా రెండో రోజు ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రిథమ్ సాంగ్వాన్-వరుణ్ తోమర్ (భారత్) జోడీ రజతం నెగ్గగా... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో నర్మద-రుద్రాంక్ష్ పాటిల్ (భారత్) ద్వయం కాంస్య పతకం సాధించింది. ఎయిర్ పిస్టల్ ఫైనల్లో రిథమ్-వరుణ్ జంట 11-17తో కియాన్ వె-లియు జిన్‌యావో (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది. ఎయిర్ రైఫిల్ కాంస్య పతక పోరులో నర్మద-రుద్రాంక్ష్ ద్వయం 16-8తో కియాంగ్‌యు జాంగ్-యు హావోనన్ (చైనా) జంటపై గెలిచింది. రెండో రోజు తర్వాత భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్యాలతో కలిపి నాలుగు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

నేడు డబ్ల్యూపీఎల్ ఎలిమినేటర్



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఈరోజు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ జట్టుతో అలీసా హీలీ కెప్టెన్సీలోని యూపీ వారియర్స్ జట్టు ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడనుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆడుతుంది.

ఇక ఐపీఎల్ ఫ్రాంచైజీల ఇష్టం...

ఆటగాళ్లకు విరామంపై రోహిత్ వ్యాఖ్య



చెన్నై: భారత రెగ్యులర్ ఆటగాళ్లు పదే పదే గాయాలబారిన పడటం, కీలక మ్యాచ్‌లకు దూరం కావడంపై కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. వారికి తగినంత విశ్రాంతి కల్పించడంపై అతను కీలక వ్యాఖ్య చేశాడు. 'ఇకపై ఆటగాళ్లంతా ఐపీఎల్ ఫ్రాంచైజీలకు చెందినవారే. టోర్నీ ముగిసేవరకు వారి పర్యవేక్షణలోనే ఉంటారు. ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చే విషయంపై బోర్డు సూచనలు అందరికీ ఇచ్చింది. కానీ వాటిని ఫ్రాంచైజీలు పాటిస్తాయా లేదా అనేది సందేహమే. అన్నింటికి మించి క్రికెటర్లేమీ చిన్నపిల్లలు కారు. వారికే తమ శరీరం గురించి, గాయాల గురించి స్పష్టత ఉంటుంది. దానిని బట్టి ప్రణాళిక రూపొందించుకోవాల్సిందే తప్ప వేరే వాళ్లు చేసేదేమీ లేదు. అయినా భారత జట్టుకు ఆడుతున్నప్పుడు తగినంత విరామం ఇస్తూనే ఉన్నాం' అని రోహిత్ అభిప్రాయపడ్డాడు. ఏ క్రికెటర్ కూడా గాయపడాలని కోరుకోడని, అందరికీ అన్ని మ్యాచ్‌లు ఆడాలనే ఉంటుందని కెప్టెన్ అన్నాడు. 'గాయాలు తిరగబెట్టడంపై మాట్లాడేందుకు నేనేమీ నిపుణుడిని కాను. అయితే గాయాల ఆటగాళ్ల కెరీర్‌లో భాగం. అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది వారి పరిస్థితిని మెరుగుపర్చేందుకు అత్యుత్తమ చికిత్స అందిస్తుందనే విషయం నాకు తెలుసు. కానీ అనూహ్యంగా జరిగే వాటి గురించి ఎవరూ చెప్పలేరు' అని రోహిత్ విశ్లేషించాడు.

ఐపీఎల్‌కు బెయిర్‌స్టో దూరం




లండన్: ఇంగ్లండ్ విధ్వంసక బ్యాటర్ జానీ బెయిర్‌స్టో ఈసారి ఐపీఎల్‌లో ఆడబోవడం లేదు. అతనికి ఐపీఎల్ కోసం నిరభ్యంతరకర పత్రం (ఎన్‌ఓసీ) ఇచ్చేందుకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిరాకరించింది. వేలంలో పంజాబ్ కింగ్స్ జట్టు బెయిర్‌స్టోను రూ. 6 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో గోల్ఫ్ ఆడుతూ కాలికి గాయం కావడంతో బెయిర్‌స్టో టి20 ప్రపంచకప్‌తో పాటు పాకిస్తాన్, న్యూజిలాండ్‌లతో సిరీస్‌లకు దూరమయ్యాడు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న బెయిర్‌స్టో వెంటనే ఐపీఎల్ ఆడితే గాయం తీవ్రమై మున్ముందు మరిన్ని ఇంగ్లండ్ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉండటంతో ఈసీబీ అతడిని ఐపీఎల్‌కు పంపరాదని నిర్ణయించింది. అయితే పంజాబ్‌కే ఆడనున్న లివింగ్‌స్టోన్, స్యామ్ కరన్‌లకు మాత్రం ఎలాంటి సమస్య లేకుండా ఎన్‌ఓసీ మంజూరు చేసింది.

శ్రీకాంత్ పరాజయం



బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత కథ ముగిసింది. మాజీ చాంపియన్ కిడాంబి శ్రీకాంత్‌తోపాటు హెచ్ఎస్ ప్రణయ్, మిథున్ మంజునాథ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. శ్రీకాంత్ 20-22, 17-21తో చెయుక్ యియు లీ (హాంకాంగ్) చేతిలో... ప్రణయ్ 8-21, 8-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో... జాతీయ చాంపియన్ మిథున్ 19-21, 10-21తో చియా హావో లీ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో సింధు 21-9, 21-16తో జెన్‌జిరా స్టాడెల్‌మన్ (స్విట్జర్లాండ్)పై విజయం సాధించింది.

లలిత్ బాబు శుభారంభం



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ఎం.ఆర్.లలిత్ బాబు శుభారంభం చేశాడు. తొలి రౌండ్ గేమ్‌లో లలిత్ బాబు 31 ఎత్తుల్లో భారత్‌కే చెందిన ఆదిత్య జైన్‌పై గెలిచాడు. ఇదే టోర్నీలో ఆడుతున్న తెలంగాణ ప్లేయర్లు మట్టా వినయ్ కుమార్, ఆదిరెడ్డి అర్జున్, జె.రామకృష్ణ, పొట్లూరి సాయి శ్రీజ, వేల్పుల సరయు, లక్ష్మీ సందీప్ నాయుడు, శిబి శ్రీనివాస్ ఐన్‌స్టీన్, ఉప్పాల శ్రీరామ్ ఆదర్శ్, తోట ధ్రువ తొలి రౌండ్ గేముల్లో నెగ్గారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.